మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ /వనపర్తి / జోగుళాంబ గద్వాల /నారాయణపేట

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం గద్వాల మండలం అనంతపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే రైతులు అకాల వర్షాలతో ఇల్లడిల్లుతున్నారని, ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని, తేమశాతం కాస్త అటు ఇటు ఉన్న తూకం వేయాలని అన్నారు. రైతులు కూడా ప్యాడిక్లీనర్ల ధాన్యం తూర్పార బట్టి తాలు లేకుండా నాణ్యమైన ధాన్యం కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అవసరమైన గన్నీ సంచులు, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, నిర్వాహకులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వరి కొనుగోలు జరగాలని, రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన రైస్‌మిల్లులకు వెంట వెంటనే తరలిస్తూ మిల్లర్లు కూడా 24 గంటలలోగా ధాన్యం దింపుకునేలా పర్యవేక్షించాలని, ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 71 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 565 మెట్రిక్ టన్నుల 70 మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. అనంతరం అనంతపురం గ్రామ శివారు, గద్వాల శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారి రేవతి, జిల్లా మేనేజర్ ప్రసాద్‌రావు, ఎంపిపి ప్రతాప్‌గౌడ్, తహసీల్దార్ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్

## ధాన్యం కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ..!

**తడిసిన ధాన్యం కొని అన్నదాతకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం**

**రాజాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒకటేనని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. రాజాపూర్ మండల కేంద్రంలో జిల్లాసహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అకాల వర్షాలవల్ల తడిసిపోయిన రైతుల ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని సిఎం కెసిఆర్ రైతులకు భరోసా ఇచ్చారని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్నకార్యక్రమాలు దేశంలో మరేరాష్ట్రంలోనూ అమలుకావడం లేదన్నారు.రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి ఉచితంగా 24గంటల కరెంటుసరఫరా,రైతు కళ్లాలలోనే ధాన్యం కొనుగోలు తదితర కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వ్యవసాయం గతంలో ఎట్లా ఉన్నది ఇప్పుడెట్లా ఉన్నది రైతన్నలు ఒకసారి ఆలోచించి మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో దొండ్లపల్లి ఎంపిటిసి అభిమన్యురెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## పోషక విలువల పట్ల అవగాహన కల్పించాలి..

**ఊట్కూర్,మే 10 ప్రభాతవార్త :** మండల పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పోషణ లోపం ఉన్న పిల్లలు, తల్లిదండ్రులతో అంగన్‌వాడి కేంద్రంలో తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు బరువు పెరుగుదల లేని పిల్లలకు పోషకాహారము గురించి తల్లిదండ్రులకు ఆరోగ్య విద్యను అందించాలని ఆదేశించారు.అందులో భాగంగా అంగన్‌వాడి కేంద్రంలో తక్కువ బరువు పెరుగుదల ఉన్న పిల్లలకు పోషకాహారం గురించి ఆరోగ్య విద్యను అందించడం జరిగింది. బాలామృతం ప్లస్‌ను ప్రతి పిల్లవానికి తినిపించాలని దానివల్ల పిల్లల పెరుగుదల,ఎదుగుదల బరువు పెరగడం జరుగుతుందని పిల్లల బరువును చూడాలని దానివల్ల వయసుకు తగ్గబరువు, పెరుగుదల జరుగుతుందో లేదా అని తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి డిఓ కల్యాన్, సర్పంచ్ యశోదమ్మ, ఎంపిటిసి వీరరాఘవరెడ్డి, అంగన్‌వాడి సూపర్‌వైజర్ గీత, వైద్య సిబ్బంది,అంగన్‌వాడి టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు,బాలింతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి

**గ్రంథాలయానికి రూ.2లక్షలు విలువ చేసే పోటీ పరీక్షల పుస్తకాలు**

**అందజేసిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**

**గద్వాల ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కెసిఆర్ స్టడీ సర్కిల్ ద్వారా ఎమ్మెల్యే సొంత నిధులతో తయారు చేయించిన గ్రూప్స్, ఎస్సై,పోలీస్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల కోసం సిద్ధం చేసిన రూ.2 లక్షలు విలువ చేసే పుస్తకాలను జిల్లా గ్రంథాలయానికి వితరణ చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రంథాలయ ఛైర్మన్, గ్రంథాలయ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ ఉద్యోగాల కోసం అనేక నోటి ఫికేషన్లు విడుదల చేసిందని, అన వసర విషయాల జోలికి వెళ్లకుండా యువత ఏకాగ్రతతో చదివి కొలువులు సాధించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నియోజకవర్గంలో విద్యాబివృద్ధి కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నానని తెలిపారు. అందులో భాగంగా గత ఆరేళ్లుగా కెసిఆర్ స్టడీ సర్కిల్ ద్వారా సొంతనిధులతో నాణ్యమైన ఫ్యాకల్టీ చేత వేలాదిమంది యువతకు డీఎస్సీ,గ్రూప్స్,పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రంథాలయానికి అందజేసే పో టీపరీక్షల పుస్తకాలను గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ జంబురామన్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు చెన్నయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ సుభాన్, ఎంపిపి విజయ్‌కుమార్, బిఆర్‌ఎస్ నాయకులు కురుమన్న, నరెం దర్‌రెడ్డి, శ్రీరాములు, సంటెన్న, జిల్లా గ్రంథాలయ అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి..

**-నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 10 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాకు సంబంధించిన హెల్త్ సబ్ సెం టర్ డయాగ్నస్టిక్ సెంటర్ తదితర భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన చాంబర్‌లో హెల్త్ సెంటర్ హెల్త్ నిర్మాణాలపై సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరో గ్యశాఖకు సంబంధించిన 107 హెల్త్ సబ్‌సెంటర్ల నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖకు 64 టీఎస్ యం ఎస్‌ఐడీసీకి 21, ఐటీడీఎకు 22 సెంటర్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. వీటి లో ఇప్పటి వరక ఏ స్థాయిలో ఉన్నాయో సెంటర్ వారీగా సమీక్ష నిర్వహించారు. టీఎస్‌యంఐడీసీకి అప్పగించిన 21 సబ్ సెంటర్లకు గాను 10 పూర్తయ్యాయని, మిగిలిన వాటని త్వరలో పూర్తి చేస్తా మని ఈఈ సనీరుద్దిన్ వివరించారు. ఐటీడీఎకు అప్పగించిన 22 సబ్ సెంటర్లలో ఒకటి పూర్తైంద ని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్‌కు అప్పగించిన 64 సబ్ సెంట ర్లలో పనులు నడుస్తున్నాయని, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ఇస్తామని పంచాయతీ రాజ్ ఈ.ఈ దామోదర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ ఇతర డైయజ్ఞాస్టిక్ సెంటర్లు, సెంట్రల్ మెడికల్ స్టోర్, ఆర్.అండ్ ఆర్ సబ్ సెంటర్ల నిర్మాణ వివరాలు సైతం అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పను లు వేగవంతం చేయాలని అదికారులను ఆదేశించారు. పూర్తైన వాటిని స్వాధీనపర్చుకోవాలని వైద్యా ధికారిణి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్, పంచాయతీ రాజ్ ఈ.ఈ. దామోదర్, నసీరుద్దిన్ తదితరులు ఉన్నారు.



## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆల పరామర్శ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** భూతత్పూర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిన్న దురదృష్టవశాత్తు మరణించిన వెంకటమ్మ, నాగమణి, ఆనంద్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులను పరా మర్శించి ఆర్థిక సహాయం చేసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# కందనూలు ఫస్ట్..
# పాలమూరు లాస్ట్..!



- పదో తరగతి ఫలితాలు విడుదల చేసిన విద్యాశాఖ
- టెన్త్ ఫలితాల్లోనూ అదరగొట్టిన బాలికలు
- రాష్ట్రంలో 12వ స్థానంలో నాగర్‌కర్నూల్, 32వ స్థానంలో మహబూబ్‌నగర్
- జూన్14 నుంచి 22వరకు సప్లిమెంటరీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త :** ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఈమేరకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. ఏప్రిల్ 3 నుంచి 13వరకు పదో తరగతి పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. ఆరు పేపర్లు కావడంతో అధికారులు వాల్యుయేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేశారు. గతంలో కొంత మేరకు తప్పులు దొర్లడంతో ఈ ఏడాది అధికారులు ముందస్తు చర్యలు తీసుకొని పకడ్బందీగా ప్రక్రియ నిర్వహించారు. టెన్త్ ఫలితాల్లో ఉమ్మడి పాలమూరులో నాగర్‌కర్నూల్ జిల్లా మొదటి స్థానంలో నిలువగా, మహబూబ్‌గనగర్ చివరి స్థానంలో నిలిచింది. కాగా రాష్ట్రంలో కందనూలు 90.87 శాతంతో 12వ స్థానంలో నిలువగా 71.25 శాతంతో 32వ స్థానంలో మహబూబ్‌నగర్ నిలిచింది. ఈమేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 12503 మంది పది పరీక్షలు రాయగా 8909 మంది పాసయ్యారు. పదో తరగతి ఫలితాల్లోనూ అమ్మాయిలే అదరగొట్టారు. జిల్లాలో 6175మంది బాలికలు పరీక్ష రాయగా 4657 మంది ఉత్తీర్ణత సాధించగా 75.42శాతంగా నమోదైంది.బాలురు 6328 మంది పరీక్ష రాయగా 4252 పాసయ్యారు. బాలురు 67.19శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురతో పోలిస్తే బాలికలే అత్యధిక ఉత్తీర్ణతా శాతం సాధించి అదరగొట్టారు.జిల్లాలోని జెడ్పీ పాఠశాలల నుంచి 5303మంది పరీక్షకు హాజరుకాగా 2550 మంది ఫెయిల్ అయ్యి, 2753 మంది మాత్రమే పాసయ్యారు. దాదాపు సగానికి విద్యార్థులు ఫెయిల్ కావడం ఆందోళన కలిగిస్తున్న అంశంగా అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రెసిడెన్షియల్‌లో 79 మంది పరీక్ష రాయగా 79మంది పాస్ కావడంతో 100శాతంగా రిజల్ట్ నమోదైంది. మొన్న విడుదలైన ఇంటర్ ఫలితాల్లోనూ బాలికలదే పైచేయి ఉండడం గమనార్హం.

**ఏడుగురికి 10/10 జీపీఏ**

మహబూబ్‌నగర్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు 10/10 జీపీఏ సాధించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. బి వైష్ణవి, చవ్వ గౌతమి, మేడి ఆకాంక్ష, సంగాల రక్షితారెడ్డి, బసిరెడ్డి ప్రవల్లిక, కే అభినయ్ కుమార్ గౌడ్, ఎం మల్లేశ్‌కు 10జీపీఏ సాధించారు. ఈమేరకు వీరందరికీ పాఠశాల ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపారు. మూసాపేటకు చెందిన వైష్ణవిని 10జీపీఏ సాధించడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.


బి వైష్ణవి

**మహబూబ్‌నగర్ జిల్లాలో జెండర్ వారీగా ..**

| జెండర్ | హాజరైనవారు | ఫెయిల్ | పాస్ | శాతం |
| --- | --- | --- | --- | --- |
| బాలురు | 6328 | 2076 | 4252 | 67.19 |
| బాలికలు | 6175 | 1518 | 4657 | 75.42 |
| మొత్తం | 12503 | 3594 | 8909 | 71.25 |

| హాజరైన జిల్లా | విద్యార్థుల సంఖ్య బాలురు బాలికలు | పాసైన విద్యార్థుల సంఖ్య బాలురు బాలికలు | ఉత్తీర్ణతా శాతం |
| --- | --- | --- | --- |
| నాగర్‌కర్నూల్ | 5196 – 5349 | 4660 – 4922 | 90.87 |
| వనపర్తి | 3487 – 3541 | 2750 – 3008 | 81.93 |
| జోగుళాంబగద్వాల | 3538 – 3637 | 2739 – 3051 | 80.70 |
| నారాయణపేట | 3537 – 4004 | 2552 – 3109 | 75.07 |
| మహబూబ్‌నగర్ | 6328 – 6175 | 4660 – 4922 | 71.25 |

**జూన్ 14నుంచి సప్లిమెంటరీ..**

వచ్చే నెల జూన్ 14నుంచి 22 వరకు పదో తరగ తి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధి కారులు తెలిపారు. ఇందుకోసం టెన్త్ పరీక్షలు ఫె యిల్ అయినవారు రేపటి నుంచి మే26వరకు సప్లిమెంటరీ ఫీజు చెల్లించి అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని సూచించారు.

## త్వరలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం...

- ప్రారంభానికి సిద్ధంగా ఆక్సిజన్ ప్లాంట్
- కోట్ల రూ॥లతో ఆసుపత్రికి మౌళిక సదుపాయాల కల్పన
- రాష్ట్రంలో ప్రథమ స్థానంలో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**కల్వకుర్తి,మే10 ప్రభాతవార్త:**కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకు గాను ప్రథమ స్థానంలో నిలిచిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించారు. కల్వకుర్తి ప్రభుతా వ్యసుపత్రి వైద్యులు సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ఏరియా ఆసుపత్రిని 50పడకల నుంచి 100పడకల ఆసుపత్రిగా అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. డయాలసిస్, బ్లడ్ బ్యాంక్, కోవిడ్ వార్డు, ఆక్సిజన్ ప్లాంట్, మార్చురీ గది, యోగా సెంటర్ తదితర విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపల్‌లోని సర్వే నెం.99లో 4 ఎకరాల్లో 100 పడకల నూతన ఆసుపత్రిని త్వరలో నిర్మాణం చేపడుతామన్నారు. పాత ఆసుపత్రి స్థలంలో మాత శిశు రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రిలో సుమారు రూ.65లక్షలతో నూతనంగా నిర్మించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. త్వరలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని, వాహనాల నిలుపుదలకు రూ.7.5 లక్షలు వెచ్చించి పార్కింగ్ నిర్మాణం చేపడుతామని, శవ పంచనామా గది పనులు పూర్తి చేస్తా మన్నారు.


ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వైద్యులను అభినందించిన ఎమ్మెల్యే**

కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రి వైద్యులను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. గత నెలలో 136 కాన్పులు చేయడంతో గ్రేట్ అని ఆయన అన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్‌ను అభినందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం రోగులకు అన్ని వేలల్లో అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం డాక్టర్లు స్వర్ణలత, యశోధబాయి ఇతర డాక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ పథకం గొప్పదని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శాంతకుమారి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయగౌడ్, పీఎసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, బన్నె శ్రీనివాస్‌యాదవ్, వెల్దండ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, వైస్ ఎంపీపీ కొండూర్ గోవర్ధన్, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్ముల శ్రీకాంత్, కౌన్సిలర్లు సూర్య ప్రకాష్‌రావు, బాలునాయక్, నూనె యాదమ్మ శ్రీనివాస్, నాయకులు బావండ్ల మధు, చెన్నకేశవులు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## మణిదీపికకు మంత్రి అభినందన..


అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే10, ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో జడ్చర్లకు చెందిన తోక ఫణిరాజ్ గౌడ్, సుభాషిణి దంపతుల కుమార్తె మణిదీపిక రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడంపై ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని మంత్రిక్యాంప్ కార్యాలయంలో అమ్మాయికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. భవిష్యత్తుల్లో ఉన్నతమైన చదువులు చదివి సమాజాభి వృద్ధికి కృషిచేయాలని మంత్రి ఆకాంక్షించారు.కార్యక్రమంలో తెలంగాణరాష్ట్ర గౌడ్ సంఘంఅధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్,అఖిల భారత గౌడ సంఘం అధ్యక్షుడు వేములయ్య గౌడ్, కీసతర మల్లేష్ గౌడ్, కార్తికేయ తదితరులు ఉన్నారు.

## సాగుకు ముందే ఎరువులు ముందస్తుగా నిల్వ చేసుకోవాలి:జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**నారాయణపేట ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** వానాకాలం పంటల సాగుకు ముందే ఎరువులు ముందస్తుగా నిల్వ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం జాజాపూర్ రైతు వేదికలో ఎరువులు, విత్తన విక్రయదారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పంటల సాగుకు అవసరమైన ఎరువులను కేంద్ర ప్రభుత్వం ఇండెంట్‌కు అనుగుణంగా సరఫరా చేస్తుందని, ఆప్రకారం సహకార పరపతి సంఘాలు కూడా అవసరాన్ని బట్టి ముందస్తుగా స్థానిక వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుని వారం రోజులకు ముందే ఇండెంట్ సమర్పించి ముందస్తుగా సమకూర్చుకోవాలని అన్నారు. డీలర్లు అవసరాన్ని బట్టి స్టాక్ నిల్వ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫారం ఒలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి ఎరువులను సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎరువులు, నిత్యావసర సరుకుల చట్టం క్రిందికి వస్తాయని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా ముందస్తుగా స్టాక్ చేసుకోవాలని, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంఆర్‌పి ధరలకు మాత్రమే ఎరువుల అమ్మకాలు జరపాలని, బ్లాక్ చేయకూడదని అన్నారు.అదనంగా స్టాక్ అవసరమైతే సంబంధిత వ్యవసాయ అధికారుల ద్వారా ఇండెంట్ ముందస్తుగా సమర్పించాలని తెలిపారు. డీలర్లు,సహకార సంఘాల ప్రతినిధులకు తెలియజేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమయానుకూలంగా ఎరువులు ప్రభుత్వ ధరకే అమ్మాలని అన్నారు.వ్యవసాయ అధికారుల సహకారంతో అవసరమైన ఇండెంట్ సమర్పించి పొందాలని, నగదు లేదా బ్యాంక్ గ్యారంటీ ద్వారా ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎలాంటి సమస్యలు రాకుండా సక్రమంగా ఎరువులు విక్రయించడం జరిగిందని అన్నారు. ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ గోదాముల నిర్మాణాలకు సహకార బ్యాంక్ రుణాలు మంజూరు చేసిందని, అవసరమైన భూమి కేటాయంచాలని కోరారు. రైతులకు ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి కోదండ రాములు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహరావు, పరపతి సంఘాల అధ్యక్షులు,సీఈఓలు డీలర్లు, ఆగ్రో రైతు సేవ కేంద్రాల ప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

## వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే.. నిరుద్యోగులారా అధైర్యపడకండి

**యువత భవితే కాంగ్రెస్ నినాదం**

**కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ విడుదల**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 10 ప్రభాతవార్త :** రేపు వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, యువత అధైర్యపడొద్దని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు.యూత్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిఎంఆర్ కోరారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించి, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత లక్ష, 70వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా కెసిఆర్ చెప్పి మాట తప్పారన్నారు. ప్రస్తుతం బిస్వాల్ కమిటి నివేదిక ప్రకారం 2 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో యువత ఆకాంక్షలు నెరవేరలేదని, తమ ఆకాంక్షలు నెరవేరక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని జిఎంఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత ఎవరు అధైర్యపడవద్దని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఏడాదే 2 లక్షల కొలువుల జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని యువతకు భరోసా ఇచ్చారు. టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి యువత కోసం ప్రవేశపెట్టిన హైరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రియాంకగాంధి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేసి యువత ఆకాంక్షలు నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు జె. చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం, రమేష్, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అవేజ్, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ హక్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.



యూత్ డిక్లరేషన్‌ను విడుదల చేస్తున్న డిసిసి అధ్యక్షుడు జి. మధుసూదన్‌రెడ్డి

## అంధత్వ నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యం

**మాచారంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్, ఉపసర్పంచ్**



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రవిందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రవి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 09 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలన కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారని, అందులో భాగంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశానుసారం మాచారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించినట్లు సర్పంచ్ రవిందర్‌రెడ్డి, ఉపసరనపంచ్ చిన్నారిపల్లి రవి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పౌరులందరికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. కంటిచూపు సమస్యలో బాధపడుతున్న ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విన్నూత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని సంపూర్ణ అంధత్వ నిర్మూలనకు అందరం కలిసి పని చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన యన్మన్‌గండ్ల నాయకులు

**నవాబ్‌పేట,మే09 ప్రభాతవార్త:** మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామం నుండి కూచూర్ వరకు ఉన్న మట్టిరోడ్డుతో పాటుఇతర రహదారులను బిటి రోడ్లుగా మార్చాలని కోరుతూ మంగళవారం బిఆర్ఎస్ నాయకులు మాచ నమోని లక్ష్మయ్య, కామునిపల్లి శేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రఘువీర్, రంజిత్ గౌడ్, మాజీ ఎంపిటిసి శేఖర్ ఆధ్వర్యంలో జడ్చర్ల ఎమ్మెల్యే డా. సి.లక్ష్మా రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యన్మన్‌గండ్ల, కూచూర్, నవాబ్‌పేట, యన్మన్‌గండ్ల హనుమాన్‌దేవాలయం,యన్మన్‌గండ్లహాస్టల్‌నుండి మున్నూరు, జంగయ్యపొలం, యన్మన్‌గండ్ల నుండి బ్రహ్మం గుడి వరకు ఉన్న రహదారులను యుద్ధ ప్రాతిపదికన బిటిలుగా మార్చాలని కోరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూచూర్ రహదారిని త్వరలో బిటిరోడ్డు పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మక్సూద్,ఆశన్న,మైసయ్య, వెంకటయ్య,రాంచందర్ నాయక్,గోవింద్‌నాయక్, హన్మంతు, చెన్నయ్య, వెంకటయ్య, శేఖర్, రమేష్‌లు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఛైర్‌పర్సన్ లక్ష్మి రవిందర్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,మే 09 ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపల్ పరిధి 19వ వార్డు నిమ్మబావిగడ్డ అయోధ్యనగర్‌లో దర్జీబాయ్ (55) అనారోగ్యంతో మరణించింది. విషయం తెలిసిన వార్డు కౌన్సిలర్, ఛైర్‌పర్సన్‌లకు సమాచారం ఇవ్వగా ఛైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి రవిందర్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల కోసం ఎమ్మెల్యే డా.చర్లకోళ్ల లక్ష్మారెడ్డి సహకారంతో వార కుటుంబ సభ్యులకు రూ. 5 వేలు అంజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దోరెపల్లి రవిందర్, నాయకులు ఆజార్, మసియొద్దిన్, ఈటె శ్రీనివాసులు, దాసు నాయక్,జగన్ నాయక్, శ్రవణ్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక భరోసా
## మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్

**మక్తల్, మే 09 ప్రభాతవార్త:** మహిళలకు ఆర్థిక భరోసా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నారాయణపేట సబ్ డివిజన్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ అన్నారు. మక్తల్ పోస్టాఫీస్‌లో నారాయణపేట సబ్‌డివిజన్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ మహి ళలకు ఆర్థిక భరోసా ఇచ్చే విధంగా తపాలా శాఖలో కేంద్ర ప్రభుత్వం నూత నంగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌ను ప్రవేశ పెట్టిందని అన్నారు. మహళలకు యువతలతో పాటు గృహిణులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. ఒక్కసారి రూ.వెయ్యి నుంచి గరిష్టంగా రెండు లక్షల వరకు డిపాజిట్ చేస్తే సంవత్సరాలకు ప్రభుత్వం 7.5 శాతం వడ్డి చెల్లి స్తుంది. 28 సంవత్సరాలు నిండిన మహిళలు, మైనర్ ఆడపిల్లల పేరుమీద సంరక్షకులు ఈ ఖాతాను ప్రారంభించవచ్చు.ఈ ఖాతాను కనిష్టంగా 1000తో పాటు గరిష్టంగా 2 లక్షల వరకు జమచేయవచ్చు. గరిష్ట విలువ దాట కుండా ప్రతి 3 నెలల వ్యవధితో ఎన్ని ఖాతాలైనా మహిళలు పొదుపు చేసే డబ్బులపై అత్యధిక వడ్డిరేటు అందించడం ఈ పథకం ప్రత్యేకం. మహిళలు పొదుపు చేసిన డబ్బులపై 7.5 శాతం వడ్డి ప్రతి సంవత్సరం లభిస్తుంది. ఖాతా కాలవ్యవధి 2సంవత్సరాలు జమ అయిన మొత్తంలో ఒక సంవత్సరం తరు వాత 40 శాతం వరకు పాక్షికంగా ఉపసంహరణ చేసుకునే సౌకర్యం కలదు.ఎటువంటి అపరాధ రుసుము లేకుండా 6నెలల తరువాత 5.5 శాతం వడ్డితో ఖాతాను ఎప్పుడైనా ముగించుకునే వెసలుబాటు ఉంటుంది అన్నారు.వడ్డి వివరాలు రూ 1000 జమచేస్తే 7.5 వడ్డిశాతం వడ్డి ప్రకారం రెండు సంవత్సరాలకు రూ.160వడ్డి దాంతో మొత్తం రూ. 1160 అందిస్తారు.అలాగే ఒక లక్ష రూపాయలు జమచేస్తే 7.5 శాం వడ్డి ప్రకారం రెండు సంవత్సరాలకు 16022 అందిస్తారు.రెండు లక్షలు జమచేస్తే 7.5 శాతం వడ్డి ప్రకారం రెండు సంవత్సరాలకు రూ. 32044 అందిస్తారు. కేంద్ర ప్రభు త్వం ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ ప్రవేశం కోసం ఆధార్‌కార్డు, పాన్‌కార్డు,3ఫొటోలు తీసుకునిరావాలి. అలాగే మరిన్ని వివరా లకు మీ దగ్గరలోని హెడ్ పోస్టాఫీస్/ సబ్ పోస్టాఫీస్‌ను, బ్రాంచ్ పోస్టా ఫీసులలో ఎక్కడైనా ఈ ఖాతాను ప్రారంభించవచ్చు.



మక్తల్ డివిజన్ సబ్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్

## సర్పంచ్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**నవాబ్‌పేట,మే 09 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ నవాబ్‌పేట పోమాల్ గ్రామ పంచాయతీ బిజెపి నాయకులు రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి అంజి, బిజెవైఎం మండల అధ్యక్షులు పోరాటం వల్ల 44 లక్షల రూపాయల అవినీతి చేసిన తెరాస సర్పంచ్ కృష్ణయ్య విధుల్లో నుంచి సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. కలెక్టర్ మూడు నెలల్లోపు అతని అవినీతిపై పూర్తిస్థాయిలో కమిటి విచారణ చేసి శాశ్వతంగా సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ హైకోర్టులో కూడా న్యాయపోరాటం చేస్తామని కలెక్టర్‌కు చెప్పారు. కానీ అధికార దుర్వినియోగంతో తిరిగి మళ్లీ సర్పంచ్ పదవి తెచ్చుకున్నందుకు దాని వివరణ అడుగుతూ 44 లక్షల రూపాయలు గ్రామ పంచాయతీ సొమ్మును తిరిగి చెల్లించలేని వ్యక్తికి ఏ విధంగా సర్పంచ్ పవి కేటాయిస్తారనే దానిపై హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి భారతీయ జనతాపార్టీ పోమాల్ గ్రామ నాయకులకు అండగా ఉంటుందని భరోసా ఇవ్వడం జరిగింది.



సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బిజెవైఎం నాయకులు

## బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**● ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి ● ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజలకోసం పల్లెబాట**

**గండీడ్,మే9 ప్రభాతవార్త:** గండీడ్ మండలంలో మంగళవారం పగిడ్యాల్ గ్రామం నుండి ప్రారంభిస్తూ బల్సూర్,కొండాపురం, పంచలింగాల తండా,మన్సూర్‌పల్లి సర్కిల్‌పేట, రెడ్డిపల్లి గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూబడుగు, బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధి కార్యక్రమాలన్ని ప్రజలకు సంపూర్ణంగా అందజేస్తూ గ్రామాల్లో ఉన్న అవసరాలను ప్రజలకు తీరుస్తూ వారికి అందుబాటులో ఉండడం జరుగుతుందన్నారు. గతంలో తెలంగాణ రాకముందు ఇప్పుడు ఉన్న గ్రామాలకు ఎంతో తేడా ఉందన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీళ్లు అందజేస్తూ, రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వడం జరుగుతుందని ఇలా చెప్పుకుంటూ పోతే కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుభీమా, కెసిఆర్ కిట్ మరెన్నో పథకాలు తెలంగాణ ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకే ఈ పల్లెబాట కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి మాధవిరాజ్‌కుమార్‌రెడ్డి, పిఏసిఎస్ వైస్ ఛైర్మన్ లక్ష్మినారాయణ, వైస్ ఎంపిపి ఈశ్వరయ్యగౌడ్, ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు వెంకటేష్,టిఆర్ఎస్ పార్టీమండల అధ్యక్షుడు పెంట్యానాయక్, సర్పంచ్‌ల సంఘంఅధ్యక్షుడు గోపాల్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు గోపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జోగుకృష్ణ పాల్గొన్నారు.



పల్లెబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**కెటిదొడ్డి,మే09 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కెటిదొడ్డి మండల పరిధిలోని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కూల్ భవనంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ఎ. ఆంజనేయులు ప్రారంభించారు. మైలగడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అదేవిధంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా కెటిదొడ్డి మండలంలోని ప్రతి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు ఏ కంటి సమస్య ఉన్నా నివారించుటకు నాణ్యమైన వైద్యం కల్పిస్తూ ఉచితంగా అద్దాలు అందించడం,పేద ప్రజలు చేసుకున్న అదృష్టమని సర్పంచ్‌లు అన్నారు.గ్రామంలోని ప్రతి ఒక్కరు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకోవాలని గ్రామ ప్రజలనద్దేశించి ఆయన కోరారు. కార్య క్రమంలో జడ్పీటిసి రాజశేఖర్, వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు, ఉప సర్పంచ్ బెల్లంగోవిందమ్మ,బిఆర్ఎస్ పార్టీ సీనాయర్ నాయకులు శేఖర్, మహేష్, సంజీవులు, వైద్యాధికారిని డా.అశ్విని, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కంటి వెలుగు శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

## అశ్విని చంద్రశేఖర్ సేవలకు పురస్కారం

**-వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం**

**దేవరకద్ర,మే 09 ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలకు గుర్తింపుగా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు,రెడ్‌క్రాస్ సమన్వయకర్త అశ్విని చంద్రశేఖర్‌కు పురస్కారం లభించింది.ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ లయన్ డాక్టర్ అంబటి నటరాజ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన రెడ్‌క్రాస్ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పాల మూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఎల్.బి.లక్ష్మీకాంత్ రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అందజేసిన సిల్వర్ మెడల్,ప్రశంసా పత్రాన్ని వైస్ ఛాన్స్‌లర్ చేతుల మీదుగా అశ్విని చంద్రశేఖర్ అందుకొన్నారు.ఓ పక్క ఉపాధ్యాయుడుగా,మరోపక్క జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్తగా చంద్రశేఖర్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా విద్యాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.రెడ్‌క్రాస్ ద్వారా మరింతగా పేదలకు సేవలందించాలని వైస్ ఛాన్స్‌లర్ సూచించారు.2021-22 సంవత్సరానికి సంబందిత రక్తదానం అవశ్యకత, ప్రజల్లో అవగాహన,యువతలో చైతన్యం,రక్తదాన శిబిరాల నిర్వహణకు అవసరమైన ప్రేరణ,ప్రోత్సాహం కల్పించడ ంలో చురుకైన పాత్ర పోషించిన చంద్రశేఖర్‌కు పురస్కారం దక్కడం అభినందనీయమన్నారు.అలాగే సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు ఛంద్రశేఖర్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మెన్ నటరాజ్, కోశాధికారి జగపతిరావు, మేనేజింగ్ కమిటి సభ్యులు జి.రమణయ్య ,మేనేజర్ ఎస్.ఛంద్రశేఖర్ పాల్గొన్నారు.



వైస్ ఛాన్స్‌లర్ చేతుల మీదుగా అవార్డు అందుకొంటున్న అశ్విని చంద్రశేఖర్

## అసంతృప్తికరమైన ఇంటర్మీడియట్ ఫలితాలు

**వెల్దండ, మే09 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సోషల్ వెల్ఫేర్, కస్తూర్బా గాంధీ, మోడల్ పాఠశాలల్లో విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలు అసంతృప్తికరంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఫలితాల వివరాలను విడుదల చేయడానికి కొన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ వెనుకంజ వేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు 13 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల వివరాలను చెప్పకుండా వెనుకంజ వేశారు. కస్తూర్బా గాంధీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 32 మంది విద్యార్థినులకు 18 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. మోడల్ పాఠశాలలో మొదటి సంవత్సరం 105 మందికి 55 మంది, ద్వితీయ సంవత్సరం 119కి 104 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి అసంతృప్తి ఫలితాలు వెల్లువెరియడంతో ఇప్పటికైన ఉన్నతాధికారులపై కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించకపోతే మెరుగు పడే అవకాశాలు లేవు. మోడల్ పాఠశాలలకు చెందిన టి.ఉజ్వల 1000 మార్కులకు గాను 950 మార్కులు సాధించడం పట్ల భైరాపూర్ గ్రామ సర్పంచ్ దార్లకుమార్ శాలువాలతో సన్మానించి అభినందించారు.



విద్యార్థినిని అభినందిస్తున్న సర్పంచ్ దార్లకుమార్

## కార్పొరేట్ స్కూల్ పేరుతో ప్రచారంచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం సమర్పిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

**మక్తల్,మే 09 ప్రభాతవార్త :** పట్టణ కేంద్రంలో శ్రీ చైతన్య కార్పోరేట్ స్కూల్ పేరుతో ప్రచారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మక్తల్ మండల విద్యాధికారికి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. భాస్కర్ మాట్లాడుతూ మక్తల్ పట్టణ కేంద్రంలో ఎటువంటి అనుమతులు లేకుండా కార్పోరేట్ విద్య సంస్థ అయిన శ్రీ చైతన్య కార్పోరేట్ స్కూల్ పేరుతో ప్రచారం నిర్వహిస్తున్నారు. మక్తల్ కేంద్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులే చాలా మంది ఉన్నారు. వారు అందులో ఇప్పటికి ప్రభుత్వ బడులలో చదువుతున్నారు. వారిని ఇంగ్లీష్ పేరుతో ప్రచారాలు నిర్వహించి వారిని పాఠశాలలకు ఇచ్చే విధంగా చేసుకుని వారిని ఫీజుల పేరుతో ఇంకా పీల్చుకు తింటున్నారన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య కార్పోరేట్ స్కూల్‌కు ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదని అలాగే ప్రచారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. లేని ఎడల మా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షురాలు సంధ్య, నాయకులు ప్రకాష్, రఘు, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను చూసి మోసపోవద్దు

**అనుతులు లేని పాఠశాలల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి : ఎబివిపి**

**మక్తల్,మే 09 ప్రభాతవార్త:** నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో విద్యను వ్యాపారంగా చేసి కార్పోరేట్ పాఠశాలల పేరుతో కనీస అనుమతులు లేని విద్యా సంస్థల పేరుతో తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడి చేసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారని అలాంటి వ్యక్తుల పట్ల విద్యా సంస్థల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని ఎబివిపి నగర కార్యదర్శి వంశి అన్నారు. పట్టణంలో శ్రీ చైతన్య పేరుతో ఒక బోగస్ పాఠశాల అడ్మిషన్లు ప్రారంభించిందని పాఠశాల ప్రభుత్వ గుర్తింపు పొందకుండా కనీసం భవన అనుమతులు కూడా లేకుండా గతంలో ఒక ప్రైవేట్ కళాశాల నిర్వహిస్తున్న భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నారని అన్నారు. విద్యాశాఖాధికారులు ఇలాంటి అనుమతి లేని పాఠశాలలపై దృష్టి సారించి వాటిని నిలువరించకపోతే ఎందరో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆర్థికంగా, విద్యాపరంగా కూడా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలల గురించి నిజ నిర్ధారణ చేసుకోకుండా సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను చూసి పాఠశాలలో చేర్పించి మోసపోవద్దని అన్నారు.అదేవిధంగా అలాంటి పాఠశాలలపై జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేశామని విద్యాశాఖాధికారులు స్పందించి మక్తల్ పట్టణంలో కనీస వసతులు లేకుండా ప్రభుత్వ గుర్తింపు పొందకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న వారిపై చట్టరిత్యా తగు చర్యలు తీసుకోవాలని ఎబివిపి తరపున కోరుతున్నామని అన్నారు. విద్యార్థులకు నష్టం చేకూర్చే ఎలాంటివాటిని కూడా ఎబివిపి ఉపేక్షించబోదని విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్, జిల్లా కన్వీనర్ సురేష్, నగర ఉపాధ్యక్షుడు వినయ్, శరణ్, నితిన్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎబివిపి నాయకులు

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**దేవరకద్ర,మే 09 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గుడిబండ శివారులోనున్న వాగులో నుండి మంగళవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొన్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. చిన్నచింతకుంట మండలం లాల్‌కోటకు చెందిన రామాంజనేయులు ట్రాక్టర్‌లో ఈఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసునమోదు చేసుకొని ధర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

## ముత్యాల జల్లు కురిసే..

**దేవరకద్ర,మే 09 ప్రభాతవార్త:** వర్షం కురిస్తే వాతావరణం ప్రశాంతంగా కనిపిస్తుంది.కురిసిన వర్షం చినుకులు కాసేపు అలాగే ఉండిపోతే ఎంతో బాగుంటుందనిపిస్తుంది. చెట్ల పూలపైన, కొమ్మలపైన,ఆకులపైన, కురిసిన వర్షపు చినుకులు కాసేపు అలాగే ఉండిపోతాయి. కాసేపటికి అవి రాలిపోతాయి.అలా ఉన్నంతసేపు అవి చూపరులను ఎంతగానో ఆకట్టుకొంటాయి.పకృతికే కొత్త అందాన్ని తెచ్చిపెడు తాయి.అప్పుడు ఆ చినుకులు తెల్లగా మెరిసిపోతూ ముత్యాలజల్లులను తలపి స్తాయి.దేవరకదలో కురిసిన వర్షపు చినుకులు అదేవిదంగా వాటిపై అలాగే నిలిచి ఉండిపోయినప్పుడు ఆ దృశ్యాలు కెమెరా కంటికి చిక్కాయి.



దేవరకద్రలో ఆకులు,పూలపై నిలిచిన వర్షపు చినుకులు

## గ్రామాభివృద్ధే తన లక్ష్యం

**వెల్దండ, మే 09 ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధే తన లక్ష్యమని భైరాపూర్ గ్రామ సర్పంచ్ దార్లకుమార్ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని భైరాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.35లక్షలు, ఎంపీపీ విజయ జైపాల్‌నాయక్ రూ.5 లక్షలతో మంగళవారం సీసీ రోడ్డు పనులను సర్పంచ్ దార్లకుమార్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దార్లకుమార్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులతో పాటు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య, అంజయ్య, గోరట్ల జగన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## అంధత్వ నివారణకు కంటి వెలుగు



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వెల్దండ, మే 09 ప్రభాతవార్త:** అంధత్వ నివారణకై రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం చేపట్టిందని గ్రామ సర్పంచ్ వావిళ్ల వెంకటమ్మ అన్నారు. మంగళవారం వెల్దండ మండలం పోతేపల్లి గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వెంకటమ్మ ప్రారంభించారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమం ప్రపంచంలో అద్భుతమైన పథకమని, నిరుపేదలకు కంటి వెలుగు కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో కిరణ్, ఉప సర్పంచ్ పెద్ద సైదయ్య, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరిసిన మైనార్టీ గురుల విద్యార్థులు

**-విద్యార్థులను అభినందించిన జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి రాజేశ్వరి**



సానియాబేగం



సమ్రిన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 09 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంట ర్మీడియట్ ఫలితాల్లో మైనార్టీ గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి పట్టణాల్లో కొనసాగుతున్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యా ర్థులను కళాశాలల ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులను జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని రాజేశ్వరి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యా ప్తంగా ఉన్న మైనార్టీ గురుకులాల్లో 87.3 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలి పారు. ప్రతి యేడాది మైనార్టీ గురుకుల విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించి అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితల్లో విజయభేరి మోగించారు. సానియా బేగం 1000 మార్కులకు గాను 985 మార్కులు, సమ్రిన్ 983 మార్కులు కల్వకుర్తి మైనార్టీ గురుకుల విద్యార్థులు సాధించినట్లు పేర్కొన్నారు.

## అకాల వర్షం.. తడిసిన వరి ధాన్యం



తడిసిన వరి ధాన్యంను ఒక దగ్గర చేస్తున్న రైతు

**వెల్దండ, మే 09 ప్రభాతవార్త:** ఆరుగాలం శ్రమించిన వరి పంట అకాల వర్షం కురియడంతో నీటి పాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంతో పాటు ఇతర చుట్టు ప్రక్కల రైతులు కోసిన వరి ధాన్యాన్ని ఎండబెట్టడానికి స్పెక్ట్రా వెంచర్‌లో ఆరబెట్టారు. మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన అకస్మిక వర్షం కురియడంతో వరి ధాన్యం, మొక్కజొన్నలు నీటి పాలయ్యాయి. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వేడుకున్నారు.

## చెక్‌పోస్టు దగ్గర ప్రతి వాహనాన్ని తనిఖీ నిర్వహించాలి: సిఐ సీతయ్య

**నారాయణపేట ప్రతినిధి,మే 09 ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఉట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్తపూర్ చెక్ పోస్టును సిఐ సీతయ్య తనిఖీ నిర్వహించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా సిఐ చెక్‌పోస్టును తనిఖీ చేసి పోలీస్ అధికారులు, సిబ్బంది,రెవెన్యూ అధికారులు అందరుఅప్రమత్తంగా ఉండాలని, 24/7 విధులు నిర్వర్తిస్తూ వాహనాలు తనిఖీ చేయాలని,వాటి విరాలను నమోదు చేయాలని సూచించారు. కర్ణాటక ఎన్నికలసందర్భంగా అక్రమంగా మద్యం, డబ్బు, చీరలు మొదలగు రవాణా జరగకుండా చూడాలని తెలిపారు. చెక్‌పోస్టు దగ్గర పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిఐ సూచిం చారు. చెక్‌పోస్టుదగ్గర ఎఎస్సైలు, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.





కోహెడలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

## ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

**కోహెడ, మే 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ దీక్ష మాలధారణ స్వాములు హనుమాన్ శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రను జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, ఎంపిటిసి, హనుమాన్ దీక్ష గురుస్వాములు ప్రారంభించారు. సాయిబాబా కమాన్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర షేర్‌బజార్ రామాలయం, హనుమాన్ దేవాలయం,పాత బస్టాండు, కొత్త బస్టాండు, ఎన్టీఆర్ కాలనీ, ఎస్సీ కాలనీ అంబేద్కర్ చౌరస్తా వరకు శ్రీరామ నామ హనుమాన్ సంకీర్తనలతో భక్తి పరవశంతో శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో హనుమాన్ దీక్ష మాలధారణ స్వాములు, ఎంపిటిసి ఖమ్మం స్వరూపవెంకటేశం, వార్డు సభ్యులు బొమ్మగాని శివకుమార్, బండ జగన్, భక్తులు గుగ్గిల్ల శ్రీనివాస్, నర్సయ్య, తిరుపతి, స్వామి, దామోదర్, హనుమాన్ దీక్ష పరులు సాగర్, అనిల్, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు, రవీందర్, అరుణ్, అరవింద్, అజయ్, మనిదీప్,శరత్, రమేష్, రాజమౌళి, రాము, మహేష్, సంతోష్, హనుమాన్ దీక్ష స్వాములు, హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హామీల అమలుకై ఉద్యమిద్దాం

**-సిపిఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్**



మాట్లాడుతున్న కొమ్ముల భాస్కర్

**అక్కన్నపేట, మే 9, ప్రభాతవార్త :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకై ఉద్యమిద్దామని సిపిఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని కుందన్‌వానిపల్లి, గుండ్లపల్లి,అంబనాయక్‌తండా,పంచరాయితండాల్లో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎడల వనేష్‌తోకలసి ఈనెల 15వ తేదీన హుస్నాబాద్‌లో తలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇందుకు సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వహించే సభకు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావ్,సిని నటుడు ఆర్ నారాయణ మూర్తి, వందేమాతరం శ్రీనివాస్ హాజరవుతారన్నారు.ఈ మహాసభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు జేరిపోతుల జనార్థన్, రాజు, సరోజన, రధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో హుస్నాబాద్ విద్యార్థినికి జిల్లా ఫస్ట్ ర్యాంక్

**అభినందించిన మంత్రి హరీష్‌రావు**



జిల్లా మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్, మే 9, ప్రభాతవార్త :** మంగళవారం విడుదలైన ఇంటర్ మీడియట్ ఫలితాలలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని గుంటిపల్లి అశ్విత 1000 మార్కులకు 986 మార్కులు సాధించి సిద్దిపేట జిల్లా మొదటి ర్యాంక్‌తో పాటు రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంక్ సాధించి సత్తాచాటింది. ఈ నేపథ్యంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థిని అశ్వితను మంత్రి తన్నీరు హరీష్‌రావు శుభాకాంక్షలు తెలపగా,హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థితో పాటు కళాశాల ప్రిన్సిపల్ నల్ల రాంచంద్రారెడ్డిలను శాలువాతో సత్కరించి అభినందించారు.

**విద్యార్థిని సత్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్...**

హుస్నాబాద్ పట్టణానికి చెందిన గుంటిపల్లి అశ్విత ఇంటర్ ఫలితాలలో జిల్లా మొదటి ర్యాంకుతో పాటు రాష్ట్రంలో 8వ ర్యాంక్ సాధించిన నేపథ్యంలో మంగళవారం విద్యార్థిని అశ్వితను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి,కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి,గూళ్ల రాజు,కో ఆప్షన్ సభ్యులు అయూబ్,నాయకులు బోజు రవిందర్‌తో పాటు పాల్గొన్నారు.

## బొడ్రాయి వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

**అక్కన్నపేట, మే 9,ప్రభాతవార్త :** మండలంలోని పోతారం(జే) గ్రామంలో మంగళవారం బొడ్రాయి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో భూలక్ష్మి,మహాలక్ష్మి, కనకదుర్గ,నాభిశీల దేవతలను ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే సతీష్కుమార్ హాజరయి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ధర్మారం గ్రామస్థులు తమ గ్రామంలో నిర్మించే దుర్గమ్మ తల్లి దేవాలయానికి సహకారం కావాలని ఎమ్మెలేను అడగగా దేవాలయానికి తన వంతు సహకారంగా 400ల సిమె ంట్ బ్యాగులు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్య మంగశ్రీనివాస్,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కరివేద నరేందర్‌రెడ్డి, హుస్నాబాద్ మార్కెట్ చైర్మెన్ ఎడబోయిన రజినితిరుపతి రెడ్డి, ధర్మారం సర్పంచ్ శ్రీలతమధుకర్,చౌటపల్లి గద్దల రమేష్,మాజీ జడ్పిటిసి భీల్‌నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో జగదేవ్‌పూర్ మండల విద్యార్థుల ప్రభంజనం

**జగదేవ్‌పూర్, మే 9 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఇంటర్ ఫలితాలను విడుదల చేయగా జగదేవ్‌పూర్ మండలంలోని విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. మండల కేంద్రంలోని మోడల్ కళాశాల విద్యార్థులు భవాని ఎంపిసిలో 966 మార్కులు సాధించగా సృజన ఎంఈసిజిలో 957, సంధ్య బిపిసిలో 956 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌కె.హసీనా బిపిసిలో 948 సాధించి కళాశాలలో మొదటి స్థానంలో నిలువగా అనూష 937 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా మండల పరిధిలోని హోలీ క్రాస్ ప్రైవేట్ కళాశాలకు చెందిన పి.వాణి బిపిసిలో 982 మార్కులు సాధించి మొదటిస్థానంలో నిలిచింది.మొత్తంగా మండలంలోని వివిధకళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు అధికశాతం మార్కులు సాధించి మండలానికి మంచి పేరు తీసుకువచ్చారని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు మెమొంటోలు అందించి అభినందించారు.


# సర్వమత సమ్మేళనం తెలంగాణ రాష్ట్రం : ఎమ్మెల్యే

**బెజ్జంకి, మే 9, ప్రభాతవార్త :**

సర్వమత సమ్మేళనంగా తెలంగాణ రాష్ట్రం పేరు గాంచిందని, రాష్ట్రంలో అన్ని కులమతాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించి పలు కార్యక్రమాలల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎఎంసి చైర్మన్ కచ్చు రాజయ్య, ఎపిపి లింగాల నిర్మల, జడ్ పిటిసి కనగండ్ల కవితలతో కలిసి ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనుమాన్ శోభాయాత్రలో పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో అన్ని కులాలు, మతాలవారు కల్మషం లేకుండా జీవిస్తారని..వారి వారి పండుగలనకు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం గొప్ప విషయమన్నారు. అన్ని మతాలు, కులాలవారికి సిఎం కెసిఆర్ ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కజొన్న క్వింటాలకు రూ.1962 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం కల్లేపల్లి మదిర గుంటూరుపల్లే గ్రామంలో నూతనంగా నిర్మించిన క్యాథలిక్‌చర్చిని ఆయన ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, హనుమాన్ భక్తులు, క్రైస్తావులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి



మాట్లాడుతున్న కాష్యం వెంకటేశం

## నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాష్యం వెంకటేశం**

**నర్సాపూర్, మే 9, ప్రభాతవార్త:** ఈ నెల 11 న సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతంచేయాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాష్యం వెంకటేశం అన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్ లో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. నర్సాపూర్ అసెంబ్లీ బిజెపి కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా కాష్యం వెంకటేశం పాల్గొనగా మహిళా మోర్చా జాతీయ సభ్యురాలు విజయలక్ష్మి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగాయిపల్లి గోపి, నాయకులు రఘు వీరారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు పాపగారి చిన్నరమేష్‌గౌడ్, నాయకులు బాల్‌రెడ్డి, కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాష్యం వెంకటేశం మాట్లాడుతూ టిఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఉద్యోగాలు ఎవరికి లబించక నిరుద్యోగులుగా మిగిలిపోయారని అన్నారు.ఉద్యోగాలు భర్తీచేయకుండా నిరుద్యోగులను మోసం చేసి టిఎస్పిఎస్సి పేపర్ లీకేజిలకు పాల్పడి నిరుద్యోగులకు తీవ్రఅన్యాయం కలిగించాడని అన్నారు. అంతేగాకుండా ఎన్నికల మెనిఫెస్టోలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.3,600 ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. పేపర్ లీకేజిలకు బాధ్యత వహిస్తు ఐటి శాఖ మంత్రి కెటిఆర్ రాజీనామా చేయాలని లేదా భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చి నిరుద్యోగులకు భరోసా కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు మద్దతుగా ఈనెల 11 న సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్ ను నిర్వమిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు దిగంబర్‌రావు, బాదె బాలరాజు,. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు

**తొగుట, మే 9, ప్రభాతవార్త :** బిజెపి ఆధ్వర్యంలో ఈనెల 11న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే ఉమ్మడి మెదక్ జిల్లా నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం పిలుపునిచ్చారు. మంగళవారం తొగుటలో నిరుద్యోగమార్చ్‌ను విజయవంతం చేయాలని ముద్రించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బిఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు నిరుద్యోగులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయమంటే పేపర్లు లీక్ చేస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. నిరుద్యోగ మార్చ్‌కు యువత, నిరుద్యోగులు, పార్టీశ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నంట స్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాతూరులో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

**మర్కుక్, మే 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాతూరులో మంగళవారం ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలు సర్పంచ్ అరుణ నర్సింలుతో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి వెలుగు ద్వారా ఎంతో మందికి మేలు చేకూరుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్‌తోపాటు మందులు, కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లేశం, ఉపసర్పంచ్ చంద్రం, నాయకులు కుమార్, కైలాష్, రమేష్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**చిన్నశంకరంపేట, మే9, ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి ఎస్ఐ పోచయ్య తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేట పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాహన చోదకులు శిరాస్త్రానం తప్పనిసరిగా దరించాలని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. సీసీ కెమెరాలు లేని గ్రామాలలో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## హుస్నాబాద్ కాంగ్రెస్‌లో 'అగ్రకుల' రాజకీయం ....!

**- ఏడు మండలాల అధ్యక్షులను మార్చాలంటూ రేవంత్‌కు ఫ్యాక్స్‌ద్వారా సమాచారం**

**-అక్కన్నపేట గిరిజన కాంగ్రెస్ నాయకులు గుగులోతు రాంబాబునాయక్**

**హుస్నాబాద్, మే 8, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో అగ్రకుల రాజకీయం నడుస్తోందని జిల్లా గిరిజన సంఘం నాయకులు గుగులోతు రాంబాబునాయక్ అసెంబ్లీ నియోజకవర్గఇంచార్జి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిపై మండిపడుతూ ఆరోపించారు.ఈ విషయంలో రాంబాబు నాయక్ మాట్లాడుతూ తక్షణమే నియోజకవర్గంలోని ఏడుమండలాల్లో అధ్యక్షులను మార్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర టిపిసిసి అధ్యక్షులు అనుముల రేవంత్‌రెడ్డికి ఫ్యాక్స్‌ద్వార ఫిర్యాదును పంపించినట్లు వెల్లడించారు.నేడు సరూర్‌నగర్‌లో ఇందిరమ్మ అంతటి తన మనమరాలు అయిన జాతీయ కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకగాంధీ సమావేశం సమాచారం సైతం హుస్నాబాద్ ప్రాంతంలోని దళిత,గిరిజన,బలహీనవర్గాల నేతలకు సమాచారం ఇవ్వకుండ అణగదొక్కారని ఆరోపించారు.ప్రవీణ్‌రెడ్డి తాను ఒక దొరలా వ్యవహరిస్తు ఇక్కడి తన కాంగ్రెస్ పార్టీలోని నాయకులు, కార్యకర్తలను వ్యవహరిస్తు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్రపార్టీ నిర్ణయం తీసుకుని నాయకత ్వంలో పార్టీ ఎదుగుదలకు మార్పులు చేసేందుకు ప్రక్షాళన చేయల్సిన అవసరం ఉందని రాంబాబునాయక్ వ్యాఖ్యానించారు.

## నిరుద్యోగ మార్చ్‌కు నిరుద్యోగులు తరలిరావాలి



మర్కుక్‌లో నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు

**మర్కుక్, మే 9 (ప్రభాతవార్త):** ఈనెల 11వ తేదీన సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌కు మండలం నుండి పెద్దఎత్తున నిరుద్యోగులు తరలి రావాలని బిజెపి మండల ఇన్‌ఛార్జి పేర్ల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌లు పిలుపునిచ్చారు.మంగళవారం మర్కుక్‌లో మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో తొమ్మిదేళ్లగా అవినీతి, అక్రమాలు, కుటుంబ పాలనతో రాష్ట్రం అప్పులపాలు అవుతుందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయనుకున్న ఆశలు అడియాశలయ్యాయన్నారు. టిఎస్‌పిఎస్‌సి చేసిన తప్పిదం వల్లే 30 లక్షల నిరుద్యోగులు రోడ్డునపడ్డా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌కు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, తిరుపతిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాజేందర్‌సింగ్, శ్రీకాంత్‌రెడ్డి, కుషల్‌సింగ్, ఎర్రకుంట ప్రవీణ్ పాల్గొన్నారు.

## తల్లిదండ్రులకు ఆలయాన్ని నిర్మించడం అభినందనీయం

**బర్దీపూర్ దత్తాశ్రమ ఫీఠాధిపతి శ్రీగరిమహారాజ్**

**నర్సాపూర్, మే 9,ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక చింతనతో పలు కార్యాక్రమాలు చేపట్టి తద్వార ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించిన ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం తల్లిదండ్రులు దండెపు ఈశ్వరయ్య, పెంటమ్మల విగ్రహాలను ఏర్పాటు చేసి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని బర్దీపూర్ దత్తాశ్రమ ఫీఠాధిపతి శ్రీగరిమహారాజ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం అధ్వర్యంలో బస్వానందం ఆశ్రమంలో ఆయన తల్లదండ్రుల కు గుడి కట్టించి వారి విగ్రహాలను ప్రతిష్టించారు.బర్దీపూర్ దత్తాశ్రమ ఫీఠాధిపతి శ్రీగరిమహారాజ్ చేతుల మీదుగా డాక్టర్ బస్వానందం తల్లిదండ్రులు దండెపు ఈశ్వరయ్య పెంటమ్మల విగ్రహాలను ఆవిష్కరించారు. అంతేగాక ఈఆశ్రమంలో వెలిసిన సంతానాగదేవత, పోచమ్మ ఆలయాల ఐదవ వార్షికోత్స వాన్నిఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతాన నాగదేవత, పోచమ్మ దేవతలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు,.. ఈసందర్భంగా బర్దీపూర్ దత్తాశ్రమ ఫీఠాధిపతి శ్రీగరిమహారాజ్, రంజోల్ రాజయోగి రాచయ్య స్వామి మాట్లాడుతూ డాక్టర్ బస్వానందం అధ్వర్యంలో బస్వానందం ఆశ్రమంలో సంతాన నాగదేవత, పోచమ్మ దేవతల వార్షికోత్స వాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారన్నారు. బస్వానందం తల్లిదండ్రులు ఎన్నో ఏళ్ల క్రిందట స్వర్గస్తులైన వారిపై ఉన్న అమర ప్రేమతో ఈశ్వరయ్య, పెంటమ్మల విగ్రహాలను ఏర్పాటు చేసి ఆలయంలో ప్రతిష్టించడం అబినందనీయమని అన్నారు. ఎంతో నియమ నిష్టలతో, భక్తి శ్రద్దలతో బస్వానందం ఆశ్రమంలో సంతాన నాగదేవత, పోచమ్మ లవార్షికోత్స వాలను,. బస్వానందం తల్లిదండ్రుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.అనంతరం పలువురు భక్తులు భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

**బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు**

**గజ్వేల్, మే 9 (ప్రభాతవార్త):**

బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్‌లో నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11న సంగారెడ్డిలో నిరుద్యోగ మార్చ్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా నిరుద్యోగులు వేల సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఉద్దేశం నీళ్లు, నిధులు, నియామకాలు అని ప్రజలను మభ్యపెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని, రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు అయినా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు దక్కలేదన్నారు. రాష్ట్రంలో 2.40 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, లక్షా 10వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. టిఎస్‌పిఎస్‌సి లీక్ నుంచి మొదలుకొని 10వ తరగతి పరీక్షల వరకు ఐటి మంత్రి కెటిఆర్ నిర్లక్ష్యం కారణంగా పేపర్ లీక్ అయ్యిందన్నారు.



నిరుద్యోగ మార్చ్ వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కాసం వెంకటేశ్వర్లు

బిఆర్ఎస్ కనుసన్నల్లోనే పేపర్ లీక్ వ్యవహారం జరిగిందని, పేపర్‌లీక్‌లో సిఎం కెసిఆర్‌కు సంబంధించిన బంధువులే ఉన్నారన్నారు. ఉద్దేశపూర్వకంగా బండి సంజయ్‌పై పేపర్ లీక్ వ్యవహారాన్ని అంటగట్టారని సిఎం కెసిఆర్‌పై ఎదురు మాట్లాడితే అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. సంగారెడ్డిలో జరిగే నిరుద్యోగ మార్చ్‌లో మూడు తీర్మాణాలు చేపడుతున్నామని, అందులోభాగంగా పేపర్ లీక్‌కు కారణమైన కెటిఆర్ వెంటనే రాజీనామా చేయాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని, నిరుద్యోగులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున అందించాలని తీర్మానించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఆకుల విజయ, ధరం గురువారెడ్డి, రాష్ట్ర బిజెపి యువజన నాయకుడు నందన్‌గౌడ్, జిల్లా నాయకులు పేర్ల శ్రీనివాస్, అసెంబ్లీ కో-కన్వీనర్ ఎల్కంటి శ్రీనివాస్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి నత్తి శివకుమార్, బండారు మహేష్, రాంమోహన్‌గౌడ్, ఉప్పల మధుసూదన్, ఎల్లు రాంరెడ్డి, నలగామ శ్రీనివాస్, కుడిక్యాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

**-పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి బానోతు సంతోష్‌నాయక్**

**హుస్నాబాద్, మే 9, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార ్యదర్శులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి, కపూర్‌నాయక్‌తండా సర్పంచ్ బానోతు సంతోష్‌నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తుంటే వారిని మంగళవారం విధులకు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం సిగ్గుచేటన్నారు.కార్యదర్శి నియామకాల సమయంలో మూడేళ్లలో రెగ్యూలర్ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఎందుకు రెగ్యూలర్ చేయడం లేదో సమాదానం చెప్పాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు వెంటనే వారిని రెగ్యూలర్ చేయడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**నల్ల బ్యాడ్జీలతో నిరసన...**

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వైఎస్ఆర్‌టిపి నియోజకవర్గ కో కన్వీనర్ మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రోజున పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయకులతో కలసి నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి జానకిరాంరెడ్డి, శ్రీనివాస్, జనార్థన్ రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక, మానవతావాది సిఎం కెసిఆర్

**-ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**



హనుమాన్ దేవాలయం లో పూజలు నిర్వహిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, మే 9 (ప్రభాతవార్త):** గొప్ప ఆధ్యాత్మిక, మానవతావాది సిఎం కెసిఆర్ అని తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణ శివారులోని నల్లవాగు హనుమాన్ దేవాలయంలో పూజలు చేసి మాలధారణ స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ దీక్షలో ఉన్న భక్తులకు, స్వాములకు భగవంతుడు అష్ట అయిశ్వార్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కల్పించాలన్నారు. రాష్ట్రాన్ని సిఎం కెసిఆర్ అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెట్టిస్తూ గజ్వేల్‌ను రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. అనంతరం హనుమాన్ స్వాములకు, భక్తులకు అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, గజ్వేల్ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, స్థానిక కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, అల్వాల బాలేష్, గుంటుకు రాజు, సమీర్, మల్లేశం, నంగునూరి సత్యనారాయణ, గోలి సంతోష్, ఇటిక్యాల సర్పంచ్ చంద్రశేఖర్, తోట శ్రీనివాస్, హన్మంతరెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షుడు స్వామిచారి, హనుమాన్ దేవాలయ అధ్యక్షుడు నాయిని ప్రతాప్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

**-రౌండ్ టేబుల్ సమావేశంలో తేజావత్ రామచంద్రుడు**




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తేజావత్ రామచంద్రువడు

**గజ్వేల్, మే 9 (ప్రభాతవార్త):** తెలంగాణ ప్రజా వేదిక ఆధ్వర్యంలో నిరుద్యోగం, టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ అంశాలపై మంగళవారం ప్రజ్ఞా గార్డెన్‌లో టిజెయు రాష్ట్ర అధ్యక్షుడు కప్పర ప్రసాద్‌రావు, బిజెపి రాష్ట్ర నాయకులు ధరం గురువారెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒరిస్సా ప్రభుత్వ మాజీ సలహాదారుడు తేజావత్ రామచంద్రుడు, టిఎస్‌పిఎస్‌సి మాజీ సభ్యుడు సిహెచ్.విఠల్‌లు హాజరై మాట్లాడారు. తెలంగాణలో నిరుద్యోగం అధికంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి బయట రాష్ట్రాల నుండి కాంట్రాక్టర్లను తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు వివిధ రాష్ట్రాలకు సంబంధించిన వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని, మన రాష్ట్రంలో మేధావులు లేరా అని విమర్శించారు. సిఎం కెసిఆర్‌పై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, రానున్న రోజుల్లో సిఎం కెసిఆర్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్రసాద్ ఐపిఎస్, తెలంగాణ ప్రజావేదిక అధ్యక్షుడు సదానందంగౌడ్, డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, టిజెయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, బిజెపి రాష్ట్ర యువజన నాయకుడు నందన్‌గౌడ్, బిజెపి నాయకులు యెల్లు రాంరెడ్డి, బండారు మహేష్, మనోహర్‌యాదవ్, నలగామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు

**తొగుట, మే 9, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని తొగుట రాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాలకిషన్ తెలిపారు. ఈ యేడు ఇంటర్ ఫలి వంద శాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఎంపిసిలో 977 మార్కులు సాధించి అగ్రగామిగా నిలిచినట్లు తెలిపారు. తొగుట గ్రామానికి చెందిన చిక్కుడ కావ్య 977 మార్కులు సాధించినట్ల తెలిపారు. అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కఠోర శ్రమ, తల్లిదండ్రుల సహకారంతో ఉత్తమ ఫలితాలను సాధించడం జరుగుతుందన్నారు. సైన్‌లో 700లకుపైగా, ఆర్ట్స్‌లో 800లకు పైగా, కంప్యూటర్ సైన్స్‌లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని వివరించారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**-వంటిమామిడి ఏఎంసి చైర్మన్ జహంగీర్**

**ములుగు, మే 9(ప్రభాతవార్త):** రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డిలు సూచించారు. మంగళవారం ములుగు మండల పరిధిలోని కొట్టాల, క్షీరసాగర్, తునికిబొల్లారం, సింగన్నగూడ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను జిల్లా కో-ఆప్షన్ సభ్యుడు సలీం, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నరేష్‌గౌడ్, సర్పంచ్‌లు గణేష్‌గుప్త, యాదమ్మ, నర్సింగరావు, పావని, జగదీశ్వర్‌రెడ్డి, బాలులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వడంతో పాటు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగ్లా గణేష్, బిఆర్ఎస్ నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్, పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాపురెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ రాములుగౌడ్, మహేష్‌యాదవ్, ఐలయ్యయాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



క్షీరసాగర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జహంగీర్


# పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

**టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్**

**నారాయణఖేడ్, మే 9 ప్రభాతవార్త:** కొన్ని రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదని సంగారెడ్డి జిల్లా టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ముందు పంచాయతీ కార్యదర్శులు సమ్మెచేస్తున్నారు. ఈ సందర్భంగా నాగారం శ్రీనివాస్ తదితరులు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు నెలలో 9355 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను మంజూరు చేసి టీఎస్‌పీఎస్‌సీ ద్వారా భర్తీ చేసింది. మూడు సంవత్సరాల ప్రొబెషనరీ పేరుతో నెలకు రూ.15 వేలు వేతనంతో విధులు నిర్వహించారు. జీ.ఓ.నెం. 26 ద్వారా వారి ఆశల మీద నీళ్లు చల్లి ఉద్యమ బాట ఉంచుకునేలా ప్రభుత్వం చేసింది. ప్రభుత్వమే నాలుగో తరగతి ఉద్యోగులతో సమానంగా గుర్తించి రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరిస్తామనిచెప్పి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బెదిరింపు ధోరణిని మానుకుని వెంటనే చర్చలను ఆహ్వానించి రెగ్యులర్ చేస్తామని పేర్కొంటూ ఉద్యోగాల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగా రెడ్డి, కార్యదర్శి శేరికర్ రమేష్, ఎన్.విజయ్‌కుమార్,నాగల్‌గిద్దా మండల అధ్యక్షులు రాఘవేందర్‌గౌడ్; దీపక్‌కుమార్, ప్రభాకర్ చోల్కర్, పుటాల శ్రీనివాస్, మఠం విజయ్‌కుమార్ స్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**పంచాయతి కార్యదర్శుల ఆశలపై నీళ్లుచల్లిన ప్రభుత్వం**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 9, ప్రభాతవార్త:** నూతనంగా లెక్కకు మించి ఏర్పాటుచేసిన గ్రామ పంచాయతీలలో పనులు చేయించాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 2018లో 9,355 జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పోస్టులను మంజూరు చేసి టిఎస్‌పిఎస్‌సి ద్వారా భర్తీ చేసిందని, మూడేండ్లు ప్రొబెషనరీ పేరుతో నెలకు రూ.15 వేల వేతనంతో ఏప్రిల్ 2019లో నియామకం చేసిందని, వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగారం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు చేపట్టిన సమ్మెకు టిపిటిఎఫ్ తరుపున మద్దతు తెలిపి ఆయన మాట్లాడారు. మూడు సంవత్సరాల ప్రొబెషరీ కాలం పూర్తి కాగానే ఎంపిడిఓల ద్వారా అప్రైసల్ తీసుకుని రెగ్యులర్ చేస్తామని నమ్మబలికి 2022 ఏప్రిల్ 12 నాటికి రెగ్యులరైజ్ చేయుటకు బదులుగా మరో సంవత్సరం ప్రొబెషరీ పిరియడ్ పెంచుతూ జీఓనెంబర్ 26 ద్వారా వారి ఆశల మీద నీళ్లుచల్లి ఉద్యమబాట ఎంచుకునేలా చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో పాండురంగారెడ్డి, ఎన్. విజయ్‌కుమార్,నాగల్గిద్ద రాఘవేందర్‌గౌడ్, నాగల్గిద్ద దీపక్‌కుమార్, నారాయణఖేడ్ సీనియర్ నాయకులు ప్రభాకర్ చోల్కర్, పుటాల శ్రీనివాస్, మఠం విజయ్‌కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

## బాబుమోహన్‌పై తప్పుడు కథనాలు రాయకండి

-బిజెపి ఉమ్మడి మండల నాయకులు

**చౌటకూరు, మే 9, ప్రభాతవార్త:** అందోల్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.బాబూమోహన్‌పై అధికార పార్టీ నాయకులు కొమ్ముకాస్తూ కొన్ని పత్రికలు తప్పుడు కథనాలను రాయడం మానుకోవాలని చౌటకూరు, బిజెపి పుల్కల్ మండలాల అధ్యక్షులు కలాలి శేఖర్‌గౌడ్, కుమ్మరి పండరిలు సూచించారు. మంగళవారం చౌటకూరులో వారు మాట్లాడుతూ బిజెపి అధిష్టానం పిలుపు మేరకు బిజెపి సత్యాగ్రహం, రైతు గోసా బిజెపి భరోసా, బైక్ ర్యాలీ కార్యక్రమాలను బాబూమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు గుర్తు చేశారు. పత్రికల్లో కథనాలు రాసేటప్పుడు నిజానిజాలను తెలుసుని రాయాలని సూచించారు. అధికార పార్టీ నాయకులకు అమ్ముడుపోయిన కొందరు తప్పుడు కథనాలు సృష్టిస్తూ బాబూమోహన్‌ను దామోజీ దిగజార్చేలా కుతంత్ర వార్తలు రాయడం ఇకనైనా మానుకోవాలని హెచ్చరించారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో అందోల్ గడ్డపై బిజెపి జెండా రెపరెపలాడం తథ్యమన్నారు. కార్యక్రమంలో పుల్కల్ మండల పార్టీ ఉపాధ్యక్షులు రమేష్, నాయకులు, సాగర్, రామకృష్ణ తదితరులు ఉపేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, రాజు, శివకుమార్, మల్లేశం తదితరులు ఉన్నారు.


## రేణుక ఎల్లమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జడ్పీ చైర్‌పర్సన్



రేణుక ఎల్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

**చౌటకూరు, మే 9, ప్రభాతవార్త:** మండలంలోని వెండికోల్ గ్రామంలో కొనసాగుతున్న శ్రీరేణుక ఎల్లమ్మ జాతరలో అందోల్ శాసనసభ్యులు చంటి క్రాంతికిరణ్, జిల్లా పరిషత్ చైర్మన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం జాతరకు చేరుకున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్‌ను నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా జడ్పీచైర్మన్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు చైతన్య విజయభాస్కర్‌రెడ్డి, ఎంపిపి ఉపాధ్యక్షులు వీరేందర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చౌకంపల్లి శివకుమార్, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు దర్శన్ రెడ్డి, మాణిక్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న పట్నం మాణిక్యం

**సదాశివపేట, మే 9, ప్రభాతవార్త:** మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం శ్రీపద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి డిసిసిబి వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం చేరుకోగా ఆలయ కమిటీ బాధ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా పట్నం మాణిక్యం అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్పిపి జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు వైద్యం పవన్ కుమార్, సున్నం రాము తదితరులు పాల్గొన్నారు.

## ఛలో హైదరాబాద్ కరపత్రం ఆవిష్కరణ



మరియంపూర్‌లో చలోహైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, మే 9, ప్రభాతవార్త:** జూన్ 6వ తేదీన హైదరాబాద్‌లో లింగాయత్ మహార్యాలీని నిర్వహిస్తున్నట్లు లింగాయత్ సమాజ్ బాధ్యులు పేర్కొన్నారు. మంగళవారం రత్నాపూర్, మరియంపూర్, వడ్డి తదితర గ్రామాల్లో 6న నిర్వహించే మహార్యాలీ వాల్ పోస్టర్‌ను లింగాయత్‌లతో కలిసి బసవేశ్వరుడిని స్మరిస్తూ ఆవిష్కరించారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి 6న హైదరాబాద్‌లో జరిగే మహార్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవ దళ్ యూత్ బాధ్యులు ఆనంద్ ఈశ్వర్, అరుణ్‌కుమార్, సంగమేశ్, అన్వేశ్వర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య మేళను పరిశీలించిన డిఎం అండ్ హెచ్ఓ

**ఝరాసంగం, మే 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మేళాను మంగళవారం డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ గాయత్రీదేవి, జడ్పీ సిఇఓ ఎల్లయ్య పరిశీలించారు. ప్రజలు మెరుగైన వైద్యం అందేలా వైద్యులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. గర్భిణీ స్త్రీలకు తగు సూచనలు, సలహాలు అందజేయాలని పిహెచ్‌సి డాక్టర్ రమ్యకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్య, నర్సులు, అంగన్‌వాడీ గీతారాణి, ఆశా వర్కర్లు, సుదర్శన్, నాగమణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఎస్ఐకు సన్మానం

**కంగ్టి, మే 9, ప్రభాతవార్త:** సిఆర్‌పిఎఫ్ ఎస్ఐగా పదోన్నతి పొందిన రాఠోడ్ భట్ రాములను రాజారాం తండా సర్పంచ్ పల్లవి పరశురాం ఘనంగా సన్మానించారు. కేంద్ర రిజర్వు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న తండాకు చెందిన రాఠోడ్ భట్ రాములు ఎస్ఐగా పదోన్నతి అందుకుని స్వగ్రామానికి చేరుకోవడంతో తండా వాసుల ఆనందం అంతా ఇంత కాదు. ఈ సందర్భంగా ఎస్ఐ రాములు కుటుంబ సభ్యులతో కలిసి తండాలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భోజ్ నాయక్, మాజీ ఎంపిటిసి గంగారాం, కారోబార్ మనీరాం, తండా వాసులు వసురాం, బాబుసింగ్, జీవన్, రాంకిషన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఎస్ఐగా పదోన్నతి పొందిన రాములను సన్మానిస్తున్న దృశ్యం

## ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నీ విజేత హస్నాబాద్

-బహుమతులు అందచేసిన టిపిసిసి నేత నరోత్తం

**ఝరాసంగం, మే 9, ప్రభాతవార్త:** మండలంలోని కుప్పానగర్ గ్రామంలో 20రోజులుగా కొనసాగుతున్న ఫ్రెండ్స్ యూత్ క్రికెట్ టౌర్నమెంట్ మంగళవారంతో ముగిసాయి. టౌర్నమెంట్ ముగింపు రోజైన మంగళవారం హస్నాబాద్, కుప్పానగర్ జట్లు తలపడగా హస్నాబాద్ జట్టు విజేతగా నిలిచింది. టోర్నీ విజేత జట్టుకు టిపిసిసినేత వై నరోత్తం చేతుల మీదుగా 40వేల రూపాయలతో పాటు కప్పు, రన్నర్‌గా నిలిచిన కుప్పానగర్ జట్టుకు 20వేల రూపాయలతో పాటు కప్పును అందించారు. ఈ సందర్భంగా నరోత్తం మాట్లాడుతూ వచ్చే శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్ పాటిల్, జడ్పీటిసి వినీల నరేష్, మండల ఎంపిటిసి ఫోరం అధ్యక్షులు శంకర్‌పాటిల్, మండల కాంగ్రెస్ నాయకులు రాజుస్వామి, ఎంపిటిసి సభ్యులు శంకరమ్మ కృష్ణ, ఉప సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ శంకర్, క్రీడాకారులు, గ్రామస్థులు, యువుత మాణెప్ప, దౌలన్న, భీమన్న, టోర్నమెంట్ నిర్వాహకులు వెంకట్, మురళి, కృష్ణ, రాజు, హైమద్, శివ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ట్రాఫిక్ పోలీసు ఠాణాను ఏర్పాటు చేయాలి

-టిపిసిసి నేత నరోత్తం

**జహీరాబాద్, మే 9, ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలో ట్రాఫిక్ పోలీసు ఠాణాను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని టిపిసిసి నేత వై నరోత్తం సూచించారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ జహీరాబాద్ మున్సిపాలిటీలో చుట్టు పక్కల గ్రామాలు విలీనం కావడం, జనాభా పెరగడంతో వాహనాల రాకపోకలు పెరిగిపోయాయన్నారు. పట్టణంలో రోడ్లన్నీ ఇరుకుగా ఉండటంతో వాహన చోదకులు వాహనాలను తోలేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. జహీరాబాద్ డివిజన్ కేంద్రం కావడం, కర్ణాటక సరిహద్దులో పట్టణం ఉండటం, జాతర రహదారి జహీరాబాద్ గుండానే వెళుతుండటంతో వాహనాల రాకపోకలు పెరిగాయని, జహీరాబాద్ పట్టణం వ్యాపార కేంద్రంగా ఉండటం, పట్టణంలో డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల నుంచి నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వస్తూ పోతూ ఉంటారని గుర్తు చేశారు. పట్టణంలో ఆర్‌డిఓ, డిఎస్‌పి, ఎల్‌ఐసి కార్యాలయాలు ఉండటంతో ప్రజల రాకపోకలు పెరగడం సర్వసాదారణమని, ప్రజల రద్దీతో పట్టణం నిత్యం కోలాహలంగా ఉంటుందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీసు ఠాణాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే ట్రాఫిక్ పోలీసు ఠాణాను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని నరోత్తం డిమాండ్ చేశారు.

## అన్నదాతలకు అండగా కెసిఆర్ ప్రభుత్వం

ఎంపిపి, జడ్‌పిటిసి

**సిర్గాపూర్, మే 9 ప్రభాతవార్త:** అన్నదాతకు అండగా కేసీఆర్ ప్రభుత్వం నిలిచిందని సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రాఘవరెడ్డిలు అన్నారు. మంగళవారం సిర్గాపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సహకారంతో రైతు వేదికలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ, జడ్పీటీసీలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సిర్గాపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే బౌగోళిక పరిస్థితుల దృష్ట్యా షెడ్యూల్ ప్రకారం రైతులు పంటలు వేయాలని మార్చి వరకుచ కోతలు పూర్తి చేస్తే ఆకాల వర్షాలకు పంట నష్టపోకుండా ఉంటుందని అన్నారు. రైతులకు మద్దతు ధరతో పాటు పృకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ అందించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం రైతుశ్రేయస్సు పట్ల నిబద్ధతో ఉందని అన్నారు. రైతులు ప్రభుత్వం ద్వారా అన్ని రకాల సంక్షేమ పథకాలను ఒపందాలని రైతన్నకు లాభం చేకూర్చే ధ్యేయంతో బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు మాధవరావుపాటిల్, సంజీవ్‌రావుపాటిల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తెలు, మెట్టెలు బహూకరణ

**శివ్వంపేట, మే 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఏదుల్లాపూర్ గ్రామానికి చెందిన బాలంకుంద లక్ష్మీనారాయణ, భాగ్యమ్మ దంపతుల కూతురు కావ్యశ్రీ వివాహానికి కేహెచ్ఆర్ ట్రస్టు చైర్మన్ కల్లూరి కీర్తనహనుమంతరావు మంగళవారం పుస్తెలు, మెట్టులు అందజేశారు. పేద వధువులకు సహకారం అందించడం సంతోషకరంగా ఉందని, మునుముందు ట్రస్టు ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని కల్లూరి కీర్తన హనుమంతరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నారు.ఈ కార్యక్రమంలో చెన్నాపూర్ సర్పంచి బోళ్ల భారతి భిక్షపతి, ఉప సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మన్నె నర్సింలు, బోళ్ల భిక్షపతి, వాకిటి వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

## హస్తాల్‌పూర్‌లో 'కంటివెలుగు' ప్రారంభం

**వెల్దుర్తి, మే 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కంటిసమస్యలు ఉన్నవారు శిబిరాన్ని వినియోగించుకోవాలని, ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాండు, శేఖర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

**శివ్వంపేట, మే 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే మరో తిరుపతిగా ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని మంగళవారం శివ్వంపేట మండలానికి చెందిన పలువురు ప్రముఖులు, ముఖ్య అధికార పార్టీ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే దేవాలయం అర్చకులు వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. చిన్న తిరుపతిగా పేరుగాంచిన యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శించుకోవడం అదృష్టమని ప్రముఖ వ్యాపారవేత్త కాసు రాయపురెడ్డి, అధికార పార్టీ ముఖ్య నాయకులు కల్లూరి ముత్యాలు పటేల్, కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, సింగాయిపల్లి నారాయణరావు, పుల్లగుర్ల అంజిరెడ్డిలు మాట్లాడుతూ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటువంటి గొప్ప పుణ్యక్షేత్రం ఉండటం ప్రజల అదృష్టమని, లక్ష్మీనరసింహ స్వామి ఆశీర్వచనాలు అందరికీ ఉంటాయని వారు అంటున్నారు. ఈ సందర్భంగా యాదాద్రి దేవాలయం అర్చకులు రాయపురెడ్డి, కల్లూరి ముత్యాలు, నారాయణరావు, కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, పుల్లగుర్ల అంజిరెడ్డిలకు ఆశీర్వచనాలు అందజేశారు.



యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మండల అధికార పార్టీ నాయకులు

## దళితబంధు అవినీతి బిఆర్ఎస్ ఎమ్మెల్యేపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 9, ప్రభాతవార్త:** దళితబంధు అవినీతి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు సంగారెడ్డిలోని బాబు జగ్జివన్‌రామ్, జ్యోతిరావుపూలే మహానీయుల విగ్రహాల వద్ద ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఎంఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ మైసగళ్ళ బుచ్చేంద్ర మాదిగ మాట్లాడుతూ దళితబంధు పథకంలో రూ.2 లక్షల నుండి 3 లక్షలు తీసుకున్నా బీఆర్ఎస్ ఎమ్మెల్యే చిట్టాను సీఎం కేసీఆర్ బహిర్గతం చేయాలని, అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను బిఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ రాష్ట్ర నాయకులు పెద్ద గీత మాదిగ, ఎంఎంఎస్ జిల్లా నాయకులు ముక్కగల్ల కవిత మాదిగ, ఎంఆర్‌పిఎస్ నాయకులు గంగేరి అనిల్‌మాదిగ, అలిగే రాజుమాదిగ, పోతురాజు శివకుమార్ మాదిగ, గుడ్డెల్లి శోభ మాదిగ, సురేష్‌మాదిగ, శ్రీనుమాదిగ పాల్గొన్నారు.

## తగ్గిన ఇంటర్ ఉత్తీర్ణత శాతం

**చిన్నశంకరంపేట, మే 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాలల ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఆదర్శ పాఠశాల మొదటి సంవత్సరం 39.82శాతం, ద్వితియ సంవత్సరం 50.48 శాతం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం జనరల్ 42 శాతం, ఒకేషనల్ 51 శాతం, ద్వితియ సంవత్సరం జనరల్ 55శాతం, ఒకేషనల్ 50 శాతం ఉత్తీర్ణులైనట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్‌లు తెలిపారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో రాజేందర్ 962 100, బైపిసీలో పూజిత 913 100, ఎంఈసీలో అక్షయ 780 100, సీఈసీలో పూజిత 958 1000 లు మొదటి ర్యాంకు సాధించారు. మొదటి సంవత్సరంలో కిర్తివర్ధిని 458 470, బైపీసీలో మల్లేష్, 392 440, సీఈసీలో దివ్య, 445 500 మొదటి ర్యాంకులను సాధించారు.

## నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలి

బిజెపి మండల అధ్యక్షుడు కోణం విఠల్



మాట్లాడుతున్న మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్

**పెద్దశంకరంపేట, మే 9 ప్రభాతవార్త:** ఈ నెల 11న భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి నిరుద్యోగులను నట్టేట ముంచిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల సమయంలో తగిన బుద్ధి చెప్పాలని పులుపునిచ్చారు. పరీక్షల పేరుతో లీకేజీలు చేపడుతూ నిరుద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు.సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌లో అధిక సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, నిరుద్యోగులు, అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, బుగడాల కృష్ణ, సంగమేశ్వర్, సురేష్, దమ్ము సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సిఎంఆర్‌ఎఫ్

-ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, మే9 ప్రభాతవార్త:** పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. శంకరంపేట(ఆర్) మండలం గవ్వలపల్లి గ్రామానికి చెందిన కె.అఖిల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం శంకరంపేట జెడ్పీటీసీ మాధవిరాజు ద్వారా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వెంటనే మానవత దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి రూ.2 లక్షల ఎల్‌వోసీని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు మంజూరు చేయించారు. ఈ మేరకు మంగళవారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా అఖిల కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకరంపేట మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి రాజు, మీర్జాపల్లి సర్పంచి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నాగేష్, రాజు, శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

**జగదేవ్‌పూర్, మే 9 (ప్రభాతవార్త):** రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో పనిచేస్తున్న వివోఏలను ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని జగదేవ్‌పూర్ మండల విఓఏల సంఘం మండల అధ్యక్షుడు నర్ర కనకయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఏపిఎం ఆనంద్‌కు వివోఏలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపిలో విధులునిర్వహిస్తున్న వివోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, గ్రామస్థాయిలో మహిళా సంఘాలకు అనేక సేవలు అందిస్తూ వారి ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్నామని, అలాంటి మాకు ప్రభుత్వం వెంటనే సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్‌చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే బుధవారం నుండి ఐకెపి కార్యాలయం ముందు నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తమ వేతనాలను వ్యక్తిగత ఖాతాలో జమచేసి సెర్ప్ నుండి వివోఏల గుర్తింపు కార్డులను అందజేయాలని, ప్రమాదబీమా, హెల్త్‌కార్డులను జారీచేయాలన్నారు. కార్యక్రమంలో వివోఏలు శ్రీనివాస్‌రెడ్డి, బిక్షపతిరెడ్డి, గందమల శివదాస్, పి.సుదర్శన్, రమేష్, సంతోష్, నర్సింలు, శంకర్, కనకయ్య, వినోద, సరళ, జహీదా, సరిత, హరిత, లావణ్య, వసంత, అనూష, మాధవి, వెంకటమ్మ, రేణుక, విజయ పాల్గొన్నారు.



ఏపిఎంకు వినతిపత్రం అందజేస్తున్న జగదేవ్‌పూర్ మండల వివోఏలు

## 12 నుంచి ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవాలు

-ఎల్లమ్మ దేవత, ధ్వజస్తంభ ప్రతిష్టాపన

**చౌటకూరు, మే 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి ఎల్లమ్మ దేవతా, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గౌడ గీత పారిశ్రామిక సహకార సంఘం బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 12న ఉదయం 6 గంటలకు దేవతా వగ్రహ ఊరేగింపు, 10 గంటలకు గణపతి పూజ, పుణ్యావాన, అఖండ దీపారాధన, ఋత్విక్ వరుణి, ముఖ్య దేవతా కలశ స్థాపన, సాయంత్రం 5 గంటలకు గణపతి హోమం, జలాధివాసం, హారతి, మంత్ర పుష్పము, భక్తులకు తీర్థప్రసాద వితరణ, 13న మంటప దేవత పూజలు, మూల మంత్ర హవనం, సాయంత్రం 5 గంటలకు ధాన్యాధివాసం, శయ్యాదివాసం, ఫలపుష్ప హిరణ్యాధివాసం, హారతి, మంత్ర పుష్పము, భక్తులకు తీర్థప్రసాద వితరణ, 14న మంటప దేవతా పూజలు, గర్తన్యాసం, యంత్ర స్థాపన, ఉదయం 9.32 నిమిషాలకు విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్థంభ ప్రతిష్టాపన, ప్రాణ్య ప్రతిష్ఠా, నేత్రోన్మీలనము, కుంభం, బలి, పూర్ణాహుతి, ఆశీర్వాదం, 15న గంగకు పోవుట, 16న కళ్యాణం, అమ్మవారికి బోనాల ఊరేగిపంఢ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## హద్నూర్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం

**న్యాల్‌కల్, మే 9, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ వీరమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కార్యదర్శి మాతం శెట్టి రాజ్‌కుమార్, వార్డు సభ్యులు సంగారెడ్డి, పంచాయితీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, వైద్యులు డాక్టర్ మైక్ ఫ్రాన్స్, ఎంపిహెచ్ఈఓ మల్కాపురం మల్లికార్జున్, సువర్ణ, శ్యామలతా, ఆశా, అంగన్‌వాడి టీచర్లు, నాయకులు తిరుపల బక్కారెడ్డి, పాదొడ్డి గుండన్న, సామ్యూల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నృపున్ చక్రవర్తి శిబిరాన్ని పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## ఆలయాభివృద్ధికి రూ. 25 వేల విరాళం

**సదాశివపేట, మే 9, ప్రభాతవార్త:** కంది మండలంలోని ఇంద్రకరణ్ గ్రామంలో కొనసాగుతున్న శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో పిఎంఆర్ ఫౌండేషన్ యువసేన నాయకులు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు సూచనల మేరకు ఫౌండేషన్ యువసేన నాయకులతో ఆలయ అభివృద్ధికి 25 వేల రూపాయల విరాళాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కంది మండల ముదిరాజ్ సంఘం నాయకులు, పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

## దేవాలయాల అభివృద్ధికి విరాళం అందజేత

**గుమ్మడిదల, మే 9, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలో మే 13 నుండి 17 వరకు జరగబోయే బీరప్ప కళ్యాణ మహోత్సవానికి రూ.1,16,000, బొంతపల్లి నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ట కోసం రూ.50 వేలు విరాళాన్ని పటాన్‌చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కాట శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు పుట్ట నర్సింగ్‌రావు, ఎంపిటిసి నాగేందర్‌గౌడ్, మాజీ ఎంపిటిసి కిష్టాగౌడ్, వార్డుమెంబర్ వినోద్, చంద్రయ్య, శ్రీశైలం, మల్లేష్, కుమార్, మహిపాల్, శంకర్, రవి, రమేష్, శ్రవణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీహాల్‌కు ఎమ్మెల్యే శంకుస్థాపన


**గుమ్మడిదల, మే 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సోమవారం పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఎస్సీ కమ్యూనిటీ హాల్, మినీ ఫంక్షన్‌హాల్ కోసం రూ.20 లక్షలతో నిర్మించడంకోసం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు తుడం రవి, కరుణాకర్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను తిరిగి అదే ప్రాంతంలో నూతనంగా కమిటీ హాల్, పెళ్లిళ్లకు మినీ ఫంక్షన్ హాల్ నిర్మించాలని దశబ్దకాలంగా అనుకుంటున్న ఎంతో మంది నాయకులు సహాయం చేసి కట్టిస్తామని మాటే ఇచ్చారు తప్ప ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి తమ సమస్యలను వివరించగా తక్షణమే స్పందించి గుమ్మడిదలలో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఎస్సీలకున్న కల నెరవేరబోతుందని ఆనందంలో బస్తివాసులు ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షలతో పాటు ఎంత అవసరమైతే అంత సొంత నిధులు కేటాయిస్తానని హామీనివ్వడంతో వారు సంతోషం వ్యక్తం చేశారని తెలిపారు. గ్రామస్తులు, నాయకుల సహకారంతో పనులు ప్రారంభించి త్వరలో సుందర భవనాన్ని నిర్మించబోతున్నా మని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ మొగులయ్య, మాజీ సర్పంచ్ ఇందుల సురేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు హుస్సేన్, తుడుం శ్రీనివాస్, దోమడుగు సర్పంచ్ అభిశెట్టి రాజశేఖర్, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**చిన్నశంకరంపేట, మే9, ప్రభాతవార్త:** కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారాస పార్టీ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు తెలిపారు. గవ్వలపల్లి తండాలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కంటి వెలుగు శిబిరాలలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు, అవసరమైనవారికి శస్త్రచికిత్సలుచేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, సర్పంచి గోపాల్‌నాయక్ తదితరులున్నారు.

## ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతాం

ఇన్‌చార్జి సర్పంచ్ మేడిపల్లి మురళి



రోడ్డు వెడల్పుకు సిద్ధమవుతున్న రహదారి

**గుమ్మడిదల, మే 9, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో గ్రామ ఇంచార్జీ సర్పంచ్ మేడిపల్లి మురళి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో ప్రధాన రహదారి కమాన్ నుండి ఊరాడమ్మ వరకు 22 ఫీట్ల సీసీ రోడ్డు, గ్రామంలో ఏనెగడ్డ నుండి 30 ఫీట్ల సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పాఠశాల అదనపు భవనం నిర్మాణాల పనులకు సిఎస్ఆర్ నిధులు రూ.2.30 లక్షలతో పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు గ్రామంలో చేపట్టామని ఇంచార్జీ సర్పంచ్ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సారథ్యంలో పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తున్నారన్నారు. గ్రామాన్ని నేడు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నామన్నారు. గ్రామంలో రూ.2 కోట్ల 30 లక్షలతో ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి శ్రీకారం చుట్టామని, ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నామని, గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ప్రత్యేన ధన్యవాదాలు తెలియజేశారు.

## కాలుకు చేపల వల చిక్కుకుని వ్యక్తి మృతి

**పుల్కల్, మే 9, ప్రభాతవార్త:** మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన చిలుక శ్రీనివాస్(48) చేపలు పడుతున్న క్రమంలో వాగులో వేసిన వల కాలుకు చిక్కుకోవడంతో నీట మునిగి మృతి చెందినట్లు పుల్కల్ ఎస్ఐ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకాశం... గ్రామానికి చెందిన చిలుక శ్రీనివాస్ ఈ నెల 8వ తారీఖున గ్రామ శివారులోని బొడతలం చెరువుకు చేపలు పట్టేందుకు వెళ్లాడన్నారు. చేపలు పడుతున్న తరుణంలో చేపల కోసం చెరువులో వేసిన వల కాలుకు చిక్కుకోవడంతో నీట మునిగిపోయాడన్నారు. శవం కోసం సోమవారం వెతికినా ప్రయోజనం లేకుండా పోయిందని, మంగళవారం మరో మారు వెతుకగా శ్రీనివాస్ శవం లభ్యమయినట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు చిలుకు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# మధ్యప్రదేశ్ బాటలో యోగి సర్కార్

## ది కేరళ స్టోరీకి పూర్తిగా పన్ను మినహాయింపు

**లక్నో, మే 9:** ట్రైలర్ విడుదలైనప్పటి నుంచే ది కేరళ స్టోరీ సినిమా వివాదలో చిక్కుకుంది. ఈ సినిమాపై పలు రాష్ట్రాలు తీవ్ర నిరసనలు వ్యక్తమవుతుండగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో మద్దతు లభిస్తోంది. తాజాగా, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈ సినిమాకు పన్ను మినహాయింపు నిస్తున్నట్లు ప్రకటించింది. ది కేరళ స్టోరి సినిమాపై ఉత్తరప్రదేశ్‌లో పన్ను రహితం చేస్తున్నాం అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ట్వీట్‌చేశారు. యోగి ఆదిత్యనాథ్ సహా ఆయన క్యాబినెట్ మంత్రుల కోసం సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ఇప్పటికే ఈ వివాదాస్పద చిత్రానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇచ్చింది. దీంతో పన్ను రహితంగా ప్రకటించిన మొదటి రాష్ట్రంగా నిలిచింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఈ చిత్రానికి పన్ను రహితంగా ప్రకటించే అవకాశం ఉంది. ఆ రాష్ట్ర సిఎం ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ప్రకటన చేస్తారని తెలుస్తోంది. డెహ్రాడూన్‌లోని పివిఆర్ మల్టీప్లెక్స్ ఆయన సినిమాను చూసే అవకాశం ఉంది. ఆయనతో పాటు క్యాబినెట్ మంత్రి గణేష్ జోషి కూడా పాల్గొననున్నారు. మరోవైపు, సినిమా విడుదలను ఆపేయాలని పలువురు కేరళ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేయగా స్టే విధించేందుకు నిరాకరించింది. ట్రైలర్‌లో ఏ ఒక్క వర్గానికి అభ్యంతకరమైన అంశాలు లేవని పేర్కొంది. సినిమా ప్రదర్శనకు వ్యతిరేకంగా కేరళ రాష్ట్రంలోని వివిధ యువజన సంఘాలు ప్రదర్శనలు నిర్వహించాయి. తమిళనాడులోని మల్టీప్లెక్స్ థియేటర్లు ఆ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని పేర్కొంటూ మే 7 నుంచి కేరళ స్టోరీ ప్రదర్శనను నిలిపివేశాయి. బెంగాల్ ప్రభుత్వం కూడా ఈ సినిమాను నిషేధించింది.

# హైకోర్టు ఆవరణలోనే మాజీ ప్రధాని ఇమ్రాన్ అరెస్టు

**ఇస్లామాబాద్, మే 9:** పాకిస్థాన్ మాజీ ప్రధాని పిటిఐ అధినేత ఇమ్రాన్‌ఖాన్‌ను మంగళవారం ఇస్లామాబాద్‌హైకోర్టు ఆవరణలోనే అరెస్టుచేసారు. గత ఏడాది ఆయన పదవినుంచి ఉద్వాసనకు గురయిన తర్వాత డజ్లకొద్దీకేసులు ఆయనపై పెండింగ్‌లోఉన్నాయి. 70 ఏళ్ల మాజీ ప్రధానమంత్రిని కోర్టు ఆవరణలోనే పోలీసులు, మిలిటరీ అదుపులోకి తీసుకున్నారు. పారామిలిటరీ సిబ్బంది భారీ స్థాయిలో కోర్టు ఆవరణలోకి వచ్చారు. పాకిస్థాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ తమ అధినేతను అరెస్టుచేయడంపై తీవ్రనిరసన వ్యక్తంచేసింది. అంతేకాకుండా కోర్టు ఆవరణలోకి పోలీసులు ప్రవేశించడాన్ని తప్పుపట్టింది.



గదికి ఉన్న అద్దాలను పగులగొట్టారని, ఇమ్రాన్ బయోమెట్రిక్ డేటా తీసుకునే గదిని కూడా ధ్వంసంచేసారని ఆరోపించారు. గదినుంచి ఇమ్రాన్‌ను బయటికి లాక్కుని వచ్చి అరెస్టుచేసి ప్రత్యేకవాహనంలో తరలించారు. అయితేప్రస్తుతం ఇమ్రాన్‌ఖాన్‌ను మాత్రం ఖాదిర్‌ట్రస్ట్ కేసులో అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు. కోట్లాదిరూపాయల విలువైన భూమిని బహ్రియా పట్టణంలో అల్‌ఖాదిర్‌ట్రస్టుకు కేటాయించారని, ఈ ట్రస్టు పిటిఐ ఛైర్మన్ ఇమ్రాన్‌ఖాన్ ఆయన భార్యకు చెందినదని ఇస్లామాబాద్‌పోలీసులు ఉర్దూలో ట్వీట్‌చేసారు. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణల ఆధారంగానే ఆయన్ను అరెస్టుచేసామని పోలీసులు వెల్లడించారు. కోర్టు ఆవరణపరిసరాల్లో సెక్షన్ 144ను విధించారు. పిటిఐ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలుచేసినా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దేశ అంతర్గత వ్యవహారాలమంత్రి సనాముల్లా ఇమ్రాన్‌ఖాన్ కోర్టు ఎదుట హాజరయ్యేందుకు విఫలం అయ్యారని, అనేకసార్లు నోటీసులు జారీచేసినా ఆయన హాజరుకాలేదని అందువల్లనే పాక్‌నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో ఆధ్వర్యంలో అరెస్టుచేసారని, దేశ ఖజానాకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడినందువల్లనే ఆయన్ను అరెస్టుచేసినట్లు తెలిపారు. ఆయన అరెస్టుపరంగా ఎలాంటి హింస జరగలేదన్నారు. కోర్టును వీడే క్రమంలో ఇమ్రాన్‌ఖాన్ విడియోను కూడా విడుదలచేసారు. గతంలో ఐఎస్ఐకి చెందిన ఒక సీనియర్ అధికారిపై ఇమ్రాన్ నిరాధారమైన ఆరోపణలుచేయడాన్ని ఆదేశ ఆర్మీ తీవ్రంగా ఖండించింది. ఐఎస్ఐ అధికారి మేజర్‌జనరల్ ఫైసల్ నసీర్‌కు తనపై జరిగిన హత్యాప్రయత్నాల్లో ప్రమేయం ఉందని ఆరోపించారు. వజీరాబాద్‌లో తనపై హత్యాయత్నం సంఘటనలో ఆయనప్రమేయం ఉందని ఇమ్రాన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఐఎస్ఐ చీఫ్ తనను రెండుపర్యాయాలు హత్యచేసేందుకుకుట్రచేసారని ఆ ర్యాలీలో ఇమ్రాన్ ఆరోపించారు. అర్షద్‌షరీఫ్ హత్యకేసులో ఆయన ప్రమేయం ఉందని, తన పార్టీ సెనేటర్ ఆజమ్ స్వాతిని నగ్నంగా చేసి క్రూరంగా హింసించారని పిటిఐ చీఫ్ ఆరోపించారు. ఈనెల ఏడోతేదీ లాహోర్‌లో జరిగిన ర్యాలీలోనే ఇమ్రాన్ తన వాహనంపైనుంచి ర్యాలీలో ఆర్మీ చీఫ్, ఐఎస్ఐ చీఫ్, షరీఫ్‌ప్రభుత్వంపైనా తీవ్రస్థాయి విమర్శలుచేసారు. సెక్యూరిటీ ఏజెన్సీలనుంచే తనకు ప్రాణహాని ఉన్నదన్న భయంతో టివి యాంకర్ అర్షద్‌షరీఫ్ కెన్యాకు పారిపోయినా గత ఏడాది అక్టోబరులో కెన్యాలోనే హత్యకు గురయ్యాడని ఐఎస్ఐ చీఫ్‌ప్రమేయం ఉందని ఆరోపించారు. ఇటీవలికాలంలోనే ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కూడా అనేకపర్యాయాలు అరెస్టునుంచి తప్పించుకున్నారు. లాహోర్‌లోని జమన్‌పార్క్ నివాసంపై పోలీసుల దాడినుంచి కూడా తృటిలో తప్పించుకున్నారు. పాకిస్తాన్ మిలిటరీ రేంజర్స్ ఇమ్రాన్‌ను చుట్టుముట్టి సాయుధ వాహనంలో ఎక్కించుకుని తరలించుకుని పోతున్న విడియోలు సోషల్‌మీడియాలో హల్‌చల్‌చేసాయి. తమ అధినేతను క్రూరంగా లాక్కుని వెళ్లారని, తీవ్ర గాయాలయ్యాయని ఆరోపించారు. అరెస్టు అయిన 15 నిమిషాలకే ఇస్లామాబాద్ హైకోర్టు చీఫ్‌జస్టిస్ ఆమర్ ఫరూక్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి, అదనపు అటార్నిజనరల్, పోలీస్ చీఫ్‌లు 15 నిమిషాల్లోపు తనముందు హాజరుకావాలని ఆదేశించినట్లు పాకిస్థాన్ డాన్‌పత్రిక వెల్లడించింది. కోర్టుకు హాజరయి ఇమ్రాన్‌ను ఎందుకు అరెస్టుచేసారో వివరణ ఇవ్వాలని, ఏకేసులో ఇమ్రాన్‌ను అరెస్టుచేసారన్నది తెలియాలని జస్టిస్‌ఫరూఖ్ ఆదేశించినట్లు పత్రిక ఉటంకించింది. ఇస్లామాబాద్ హైకోర్టు ఆవరణ మొత్తం పాకిస్థాన్ రేంజర్స్ ఆక్రమించుకున్నట్లుగా ఉందని న్యాయవాదులను హింసించారని, ఇమ్రాన్ ఖాన్ కారునుసైతం చుట్టుముట్టారని పిటిఐ నేత ఫవద్‌చౌదరి ఆరోపించారు. ఇమ్రాన్‌ఖాన్ న్యాయవాదిగా చెపుతున్న ఒక వ్యక్తిని తీవ్రంగా గాయపరిచారని, కోర్టు ఆవరణలోనే గాయపరిచినట్లు పిటిఐ ఆరోపించింది. దేశప్రజాసామ్యవ్యవస్థలో ఇదొక దుర్దినమని పిటిఐ వ్యాఖ్యానించింది.



## రాహుల్‌గాంధీకి ఢిల్లీ యూనివర్సిటీ నోటీసులు!

**న్యూఢిల్లీ, మే 9:** ఎఐసిసి మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఢిల్లీయూనివర్సిటీ నోటీసులు పంపించింది. అనుమతులు లేకుండా భవిష్యత్తులో వర్సిటీ క్యాంపస్‌లోకి ప్రవేశించవద్దని నోటీసు పంపించినట్లు సీనియర్ అధికారులు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు యూనివర్సిటీ హాస్టల్‌లో కొందరు విద్యార్థులను కలుసుకోవడంపై వర్సిటీ తీవ్రంగాపరిగణించింది. మంగళ,బుధవారాల్లో ఈనోటీసులను పంపించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ వికాస్ గుప్తా వెల్లడించారు. ఈతరహా పర్యటనలవల్ల విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడుతుందని, సరైన ప్రోటోకాల్‌ను కూడా పాటించాలని, విద్యార్థులతో ముఖాముఃః నిర్వహించేందుకు వర్సిటీ అధికారిక ప్రోటోకాల్‌ను పాటించాలని సూచించింది. గత శుక్రవారమే రాహుల్ వర్సిటీలోని పోస్టుగ్రాడ్యుయేట్ మెన్స్ హాస్టల్‌ను సందర్శించి కొందరు విద్యార్థులతో ముఖాముఃః నిర్వహించి వారితోనే భోజనంచేసారు. రాహుల్‌పర్యటన అనధికారికమని ఇలాంటి పర్యటనలను సహించబోమని మేం నోటీసు జారీచేస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు. అయితే కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యుఐ రిజిస్ట్రార్‌చర్యలను తీవ్రంగా ఆక్షేపించింది. ప్రభుత్వ ఒత్తిడితోనే వర్సిటీ అధికారులు ఈచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమపై ఎలాంటి వత్తిడి లేదని, క్రమశిక్షణలోభాగంగా మాత్రమే వ్యవహరిస్తామని రిజిస్ట్రార్ స్పష్టంచేసారు. రాహుల్ పర్యటన జరిగిన వెంటనే వర్సిటీ యాజమాన్యం నోటీసుబోర్డులో ఎలాంటి అక్రమ అనుమతి లేనిప్రవేశాలను ఉపేక్షించబోమని ఇలాంటివాటివల్ల విద్యార్థుల భద్రతతోపాటు వచ్చిన నాయకుని భద్రతకుసైతం ముప్పు వాటిల్లుతుందని అన్నారు.

# 'కీలక మలుపు వద్ద ప్రపంచం'

## విక్టరీ డే సందర్భంగా పుతిన్ వ్యాఖ్యలు

**మాస్కో, మే 9:** రష్యాకు వ్యతిరేకంగా పశ్చిమ దేశాలు యుద్ధాన్ని ప్రారంభించాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ ప్రపంచం కీలక మలుపు వద్ద ఉందని అన్నారు. మంగళవారం విక్టరీ డే సందర్భంగా మాస్కోలోని రెడ్‌స్క్వేర్ వద్ద జరిగిన పరేడ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండో ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా యేటా విక్టరీ డే' మే 9న రష్యా ఘనంగా నిర్వహిస్తుంది. 'ప్రస్తుతం ఈ ప్రపంచం ఒక కీలక మలుపు వద్ద ఉంది. మన మాతృభూమికి వ్యతిరేకంగా ఒక అసలైన యుద్ధాన్ని ప్రారంభించారు' అని పుతిన్ తీవ్ర ఆరోపణలుచేశారు. ఈ యుద్ధంలో రష్యా విజయం సాధించాలని పిలుపునిచ్చారు. మనం అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని తరిమికొట్టాం. డాన్‌బాస్ ప్రాంత ప్రజలకు రక్షణగా కల్పిస్తాం.



అలాగే ఉక్రెయిన్‌లో సైనిక చర్యలో భాగమై నందుకు గర్వంగా ఉంది అని అన్నారు. అంతేకాకుండా హుర్రే అంటూ పరేడ్‌లో పాల్గొన్న సైనికులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా భారీ స్థాయి సైనిక కవాతు నిర్వహించారు. గత యేడాది ఫిబ్రవరి నుంచి ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం జరుగుతోంది. రోజుల్లో ముగుస్తుందనుకున్న ఈ యుద్ధానికి యేడాది దాటింది. దీంతో ఇరువైపులా ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తున్నాయి. అయినా దీనికి ముగింపు మాత్రం కనిపించడం లేదు. ఈ సమయంలోనే ఇటీవల రష్య అధ్యక్షుడి నివాస, కార్యాలయ భవనాలున్న క్రెమ్లిన్‌పై డ్రోన్ల దాడియత్నం జరిగింది. వాటిని గుర్తించిన పుతిన్ సేన ముందుగానే ఆ డ్రోన్లను పేల్చివేసింది. ఇది ఇరువైపులా తీవ్ర వ్యాఖ్యలకు దారితీసింది. క్రెమ్లిన్ ఘటనవెనుక అమెరికా హస్తం ఉందని రష్యా ఆరోపించింది. మరోపక్కో విక్టరీ డే ముందు ఉక్రెయిన్‌పై రష్యా విరుచుకుపడింది. డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసింది.

# ప్రపంచ దేశాల్లో 68.79 కోట్లకు పెరిగిన బాధితులు

## 68.71 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, మే 9:** ప్రపంచదేశాల్లోకరోనా కేసులు పెరుగుతున్నాయి. చిన్నదేశాల్లో మరింతగా కలవరం వ్యక్తం అవుతోంది. మంగళవారం నాటికి మొత్తం 68.79 కోట్లమందికి కరోనాసోకి 68.71 లక్షలమంది చనిపోయారు. మరో 38,977 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 66.03 కోట్లకుపైగ ఆనమోదుకాగా మరో 2.07 కోట్లమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 24.90 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వారిలో 20.55 లక్షలమందిచనిపోయారు. మరో 6333 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 24.49 కోట్లకుపైగా ఉన్నాయి. మరో 2.07 కోట్లమంది ఇప్పటికీ ఆసుపత్రుల్లోనే కొనసాగుతున్నారు. ఉత్తరఅ మెరికా దేశాల్లో మొత్తం 12.63 కోట్లకుపైగా కరోనా కేసులునమోదుకాగా వారిలో 16.30 లక్షలమందిచనిపోయారు. మరో 6267 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 12.21కోట్లకుపైగా నమోదుకాగామరో 25.60 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాడుతున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం కరోనా బాధితులు 21.69 కోట్లకుపైగా నమోదుకాగా వారిలో 15.45 లక్షలమందిచనిపోయారు. మరో 15,612 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 20.07 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.46 కోట్లమంది ఇప్పటికీ వైరస్‌తోపోరాటంచేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.86 కోట్లకుపైగా బాధితులుంటే వారిలో 13,.54 లక్షలమందిచనిపోయారు. మరో 10,128 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది.

# మీ ప్రేమాభిమానాలు నాకు దేవుని ఆశీస్సులు

## కర్ణాటక ఓటర్లకు ప్రధాని

## మోడీ బహిరంగ లేఖ



**న్యూఢిల్లీ, మే 9:** అసెంబ్లీఎన్నికల పోలింగ్‌కు ముందురోజు ప్రధాని మోడీ కర్ణాటక ప్రజలకు బహిరంగ లేఖ రాసారు. ఆదేవుడే తనకు ఆశీస్సులు అందచేసినట్లు కర్ణాటకప్రజలంతా ఎంతో ప్రేమాభిమానాలుచూపించారని ఆజాదీకా అమృత్‌కాల్‌సమయంలో మన భారత దేశాన్ని అభివృద్ధిచెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. కర్ణాటక ప్రజలకు అభివృద్ధిపట్ల పూర్తిస్థాయిలో అవగాహణ ఉందని పేర్కొన్నారు పార్టీ అంకితభావంతో కర్ణాటక అభివృద్ధికి పనిచేస్తుందని,ప్రజల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. కొవిడ్‌మహమ్మారి సమయంలోకూడా కర్ణాటకకు 90వేల కోట్ల వార్షిక పెట్టుబడులు వచ్చాయని, బిజెపి ప్రభుత్వంలో మాత్రమే ఇది సాధ్యం అయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 వేల కోట్లు మాత్రమే పెట్టుబడులు వచ్చాయన్నారు. పెట్టుబడులపరంగా కర్ణాటకను నంబర్‌వన్ స్థాయికి తీర్చిదిద్దుతామని, పెట్టుబడులు, పారిశ్రామికరంగం, సృజనాత్మక ఐటిరంగంలోను ప్రథమ స్థానానికి తెస్తామన్నారు. అలాగే విద్యారగంగం, ఉపాధిరంగం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలనుప్రోత్స హించడంలోకూడా కర్ణాటక ముందడుగు వస్తుందని ఆయన అన్నారు. మంత్తం 5.2 కోట్లమంది ఓటర్లలో కర్ణాటకలో ఈసారి 9.17 లక్షలమంది మొదటిసారి ఓటుహక్కువినియోగించుకుంటున్నారు. గ్రామీణ,పట్టణ మౌలికవసరులపరంగా సమస్యలనుప్రస్తావిస్తూ రవాణరంగం, ఉపాధి రంగాలు వృద్ధిచెందానల్నాఆరు. బిజెపి ప్రభుత్వం నిరంతరం భావితరం మౌలికవసరులను కల్పించేందుకు ఎంతోకృషిచేస్తుందన్నారు. రవాణారంగాన్ని ఆధునీకరిస్తుందన్నారు. గ్రామీణ,పట్టణప్రాంతాల్లోకూడా ప్రజల జీవనశైలిని మార్చేదిశగాకృషిచేస్తామని చెప్పారు. మహిళలు,యువతకు ఉపాధి అవకాశాలు మరింతపెరుగుతాయన్నారు. కర్ణాటకలో ప్రతి పౌరుని కలలు తనవిగానే భావిస్తానని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల్లో బిజెపి 224 మంది అభ్యర్థులను పోటికి దించింది. కాంగ్రెస్ 223 మందిని పోటీకి దించితే జెడిఎస్ 207 మందిని పోటీలో ఉంచింది. మొత్తం అన్ని నియోజకవర్గాలకు పదవ తేదీ పోలింగ్ జరుగుతుంది. 13వ తేదీ ఓట్లలెక్కింపుతో ఫలితాలను వెల్లడిస్తారు.

# కర్ణాటకలో ఎన్నికల ఎఫెక్ట్

## ఒకేసారి 5,500 బస్సులు మాయం





**బెంగళూరు/మంగళూరు, మే 9:** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మే 10వ తేదీన జరగనుంది. మే 13వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల అధికారులు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇన్ని రోజులు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న 5,500 బస్సులు మాయం అయ్యాయి. బెంగళూరు నగరంతో పాటు కర్ణాటకలో మొత్తం 224 అసెంబ్లీ నియోజక వర్గాల్లో పోలింగ్ జరుగుతోంది. ప్రతి నియోజక వర్గంలో పలు ప్రాంతాల్లో పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఎన్నికల అధికారులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులు విధులు నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేశారు. ఒక ప్రాంతంలో ఉన్న అధికారలు, పోలీసులను మరో ప్రాంతంలో విధులు నిర్వహించేలా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇవిఎం యంత్రాలు, ఎన్నికల అధికారులు, పోలీసులు పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి పిలుచుకుని వెళ్లి వారిని మళ్లీ స్ట్రాంగ్ రూమ్‌లకు పిలుచుకుని రావడానికి ఎన్నికల అధికారులు కెఎస్ఆర్‌టిసి, బిఎంటిసి బస్కుసలు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రతి రోజు రోడ్ల మీద వివిధ ప్రాంతాల్లోని ప్రయాణికులను తరలిస్తున్న 5,500 బస్సులు ఎన్నికల విధుల కోసం పంపించడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల కోసం కెఎస్ఆర్‌టిసి బస్సులు 3,700, బెంగళూరు సిటీలో నిత్యం సంచరించఎ 1,868 బస్సులు ఎన్నిక విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది, పోలీసులను తరలించడానికి తీసుకున్నారు. కర్ణాటకలో రెండు రోజుల పాటు కెఎస్ఆర్‌టిసికి చెందిన 46శాతం బస్సులు, బెంగళూరులోని 28శాతం బిఎంటిసి బస్సులను రెండు రోజులు ఎన్నికల విధుల కోసం తీసుకోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# గుజరాత్‌లో ఇప్పటికీ తెలియని 2124 మంది మహిళల ఆచూకీ

**అహ్మదాబాద్, మే 9:** గుజరాత్‌లో మొత్తం 41,621 మంది మహిళల ఆచూకీ తెలియడంలేదన్న సంచలన వార్తలతో గుజరాత్‌పోలీసుల్లోకలకలం బయలుదేరింది. ఒక అంగ్లపత్రిక వెలువరించిన కథనంపై ప్రభుత్వానికి మద్దతుగా పోలీస్‌శాఖ రక్షణగా నిలుస్తూ ఇప్పటివరకూ 39,497 మంది ఆచూకి గుర్తించామని, వారు తిరిగి వచ్చినట్లు ప్రకటించింది. అయితే 2124 మంది మహిళల ఆచూకీ ఇప్పటికీ మిస్టరీగానే ఉందని, పోలీసులు వారి ఆచూకీని గుర్తించలేనిపరిస్థితి నెలకొందని వెల్లడించింది. రాష్ట్రప్రబ్బువం ఇప్పటికీ 2021, మరియు 2022 సంవత్సరాల మహిళల మిస్సింగ్ డేటాను ప్రకటించలేదు. 2016 నుంచి 2020 మధ్యకాలంలో మొత్తం 41,621 మంది మహిళలు అదృశ్యం అయ్యారని, వారిలో ఇప్పటివరకూ 39,497 మంది ఆచూకిని గుర్తించామని పోలీసులు ప్రకటించారు. వారందరినీ కూడా వారి కుటుంబాలతో కలిపామన్నారు. కుటుంబ కలహాలు, లేవదీసుకుపోవడం, పరీక్షల్లో ఫెయిల్ కావడం వంటి అంశాలతోనే ఎక్కువమంది మహిళల ఆచూకీ లభించడంలేదన్నారు. జాతీయ క్రైమ్‌రికార్డుల బ్యూరో డేటాప్రకారం 2016లో 7105మంది, 2017లో 7712 అలాగే 2018లో 9246, 2019సంవత్సరంలో 9268 మంది మహిళలు అదృశ్యం అయినట్లు ప్రకటించింది.

# పార్టీ ఎలా నడపాలో మాకు తెలుసు: పవార్ కౌంటర్

**పుణె, మే 9:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి వారసుడిని తయారు చేయడంలో శరద్ పవార్ విఫలమయ్యారంటూ ఉద్ధవ్ వర్గానికి చెందిన శివసేన చేసిన విమర్శలకు పవార్ తనదైన శైలిలో బదులిచ్చారు. అలాంటి వ్యాఖ్యలను తాము పట్టించుకోబోమంటూనే పార్టీని ఎలా నడపలో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. ఈమేర విలేకరులతో ఆయన మంగళవారం మాట్లా డారు. ఎన్సీపీలో ఇటీవలి చోటు చేసుకున్న పరిణామాలపై శివసేన (ఉద్ధవ్ వర్గం) అధికారిక పత్రిక సామ్నాలో సోమవారం ఓ సంపాదకీయం వెలువడింది. పార్టీ వారసుడి ఎంపికలో ఆయన విఫలమయ్యారని పేర్కొంది. పవార్ రాజీనామా తర్వాత ఏర్పాటైన జంబో కమిటీలో బిజెపితో కలిసి వెళ్లాలనుకునే నాయకులూ సభ్యులుగా ఉన్నారని తెలిపింది. అయితే ఎన్సీపి శ్రేణుల నుంచి ఒత్తిడి కారణంగా ఆ కమిటీ పవార్‌కే మళ్లీ బాధ్యత అప్పగించాలని నిర్ణయించిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సామ్నా సంపాదకీయంపై పవార్‌ను విలేకరులు ప్రశ్నించగా ఆయన స్పందించారు. పార్టీ నాయకత్వం గురించి ఎవరో ఏదో రాస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదు. రాయడం వారి హక్కు విస్మరించడం మా పని. మేమేం



చేస్తున్నామనే విషయంలో మేం సంతృప్తిగా ఉన్నాం. పార్టీని ఎలా నడపాలో, నాయకత్వాన్ని ఎలా రూపొందించాలో మాకు తెలుసు. ఎవరో చెప్పే వాటిని పట్టించుకోం అని పవార్ వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీల మధ్య అన్ని విషయాల్లో 100శాతం పొంతన ఎప్పుడూ ఉండదని, కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉంటాయని అవేవీ మహావికాస్ అఘాడిపై ప్రభావం చూపవని పేర్కొన్నారు.

# ఒక్కరోజులో కరోనా కేసులు 1327, మృతులు 11

## దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,49,72,800

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే9:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 1327 కేసులు నమోదయ్యాయి. మృతి 11 మంది. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,49,72,800కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,44,18,351మంది కోలుకోగా 22,742మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,31,707చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.77 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.18శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 81,67,595కి చేరగా, 80,17,530మంది వరకు కోలుకున్నారు. 1,48,538మంది ప్రాణాలు కోల్పోయారు. కేరళలో కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 69,01,014కి చేరింది.



# కెనడా, చైనా మధ్య దౌత్యయుద్ధం

## టొరంటో రాజకీయాల్లో బీజింగ్ జోక్యం !

**బీజింగ్, మే 9:** చైనా, కెనడా మధ్య సంబంధాలు నానాటికీ దిగజారుతున్నాయి. ఇరు దేశాలు దౌత్యయుద్ధానికి దిగుతున్నాయి. తమ దేశానికి చెందిన ఎంపిపై నిఘా పెట్టారనే ఆరోపణలతో చైనా దౌత్యవేత్తను కెనడా బహిష్కరించగా, డ్రాగన్ అందుకు ప్రతీకారం తీర్చుకుంది. షాంఘైలోపని చేస్తున్న కెనడా దౌత్యవేత్తను చైనా బహిష్కరించింది. ఝావోవెయ్ బహిష్కరణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చైనా విదేశాంగ శాఖ ప్రకటించింది. టోరంటో చర్యకు ప్రతిగా షాంఘైలోని కెనడా కాన్సులేట్ జనరల్‌లో రాయబారిగా పని చేస్తున్న జెన్నీఫర్ లిన్ లాలోండేను బహిష్కరించింది. మే 13లోగా తమ దేశాన్ని విడిచి వెళ్లాలని జెన్నీఫర్‌ను చైనా ప్రభుత్వం ఆదేశించింది. చైనా, కెనడా మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంతగా దిగజారుతున్నాయి. కెనడాలో చైనా ప్రాబల్యం పెరుగుతుండటం పట్ల ఆందోళనలు తలెత్తుతున్నాయి. కెనడాలో 2019, 2021ల్లో జరిగిన ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు చైనా ప్రయత్నించిందనే ఆరోపణల పట్ల జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. లాలోండేను బహిష్కరిస్తామని బీజింగ్ ప్రకటించిన కొద్ది గంటలకే విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి కెనడా ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కెనడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమ దేశం దృఢంగా, బలవంతంగా ప్రతిస్పందిస్తుందని హెచ్చరించారు. కెనడా మీడియా, కొంతమంది రాజకీయ నాయకులు తప్పుడు సమాచారాన్ని రూపొందించారని ఆరోపించారు. ప్రతిపక్షానికి చెందిన చట్టసభ సభ్యుడు మైకెల్ చోంగ్‌తో పాటు చైనాలోని ఆయన బంధువులను చైనా దౌత్యవేత్త లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారని కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ గుర్తించింది. దీనిపై స్పందించాలని కెనడా ప్రభుత్వంపై ప్రజల నుంచి ఒత్తిడి తీవ్రమైంది. దీంతో ఝావోను కెనడా తమదేశం నుంచి బహిష్కరించింది. ఉయ్ఘర్ ముస్లింల పట్ల చైనా వ్యవహరిస్తోన్న తీరును ఖండిస్తూ చోంగ్ కెనడా పార్లమెంట్‌లో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఆయన్ను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తమ అంతర్గత వ్యవహారాల్లో ఏ విధంగాను విదేశీ జోక్యాన్ని సహించబోమని కెనడా విదేశాంగ మంత్రి మెలనీ జోలే వ్యాఖ్యానించారు. దౌత్యవేత్తలు ఎవరైనా ఇలాంటి ప్రవర్తనను కనబరిస్తే వారిని వెనక్కి పంపిస్తామని హెచ్చరించారు. కాగా కెనడాలో రాజకీయ జోక్యం ఆరోపణలు చైనా మరోసారి ఖండించింది. చైనా, కెనడా సంబంధాలు గత కొన్నేళ్లుగా క్షీణిస్తున్నాయి. 2018లో చైనాకు చెందిన మహిళా వ్యాపారవేత్త మెంగ్ వాంఝౌను కెనడా అరెస్ట్ చేయగా అందుకు ప్రతిగా చైనా ఇద్దరు కెనడీయులను అదుపులోకి తీసుకుంది. మాజీ దౌత్యవేత్త కోవ్రిగ్, వ్యాపారవేత్త అయిన మైఖెల్ స్పావోర్‌ను చైనా తిరిగి వెళ్లడానికి 2021లో అనుమతిచ్చింది. కెనడాలో భారీ సంఖ్యలో చైనా సంతతి ప్రజలు నివసిస్తున్నారు. వీరి సాయంతో తమ రాజకీయాల్లో చైనా జోక్యం చేసుకుంటోందని ఆరోపణలు తలెత్తుతున్నాయి. చైనా జోక్యం పెరుగుతుండటం కెనడా ప్రభుత్వానికి, ప్రధాని జస్టిస్ ట్రూడోకు సంకటంగా మారింది.

# ఒక్క మామిడి పండు ధర రూ.1900 - జపాన్‌లో ప్రకృతి సాగుతో కొత్త మామిడి

**టోక్యో, మే 9:** మామిడి ఉత్పత్తిలో జపాన్‌రైతు కొత్తచరిత్ర సృష్టించాడు. మైనస్ 8 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే వాతావరణంలో మామిడిని పండించి అందరి దృష్టి తనవైపు తిప్పుకోగలిగాడు. హక్కైడో ద్వీపంలోనితోకచి ప్రాంతానికి చెందిన హిరోయుకి నకగావా అనేరైతు 2011నుంచి మామిడిసాగుచేస్తున్నారు. గడ్డకట్టే చలి వాతావరణంలో గ్రీన్‌హౌస్ లోపల 36 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండేలా ఏర్పాట్లుచేసి మామిడితోటలు పెంచాడు. అక్కడ పండిన ఒక్కొక్క పండును ప్రస్తుతం 230 డాలర్లకు విక్రయిస్తున్నాడు. అంటే భారత కరెన్సీలో 19వేల రూపాయలు అన్నమాట. సుస్థిర వ్యవసాయంలో ఆతడుచేసిన ప్రయోగం ఒక్కరోజున ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మామిడిని ఉత్పత్తిచేస్తుందని భావించలేదు. ఒక పెట్రోలియం కంపెనీని నడిపిన నకగావా తాను వ్యవసాయం చేస్తానంటే ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. హక్కైడోలో నేను ప్రకృతిసహజమైన ఉత్పత్తులనే సృష్టించాలని నిర్ణయించినట్లు చెప్పాడు. మియాజాకి దక్షి ప్రిఫెక్చర్‌కు చెందిన మరొక మామిడిరైతు మార్గదర్శకత్వంలో శీతాకాలంలో మామిడి పండించడంకూడా సాధ్యమేనని నిరూపించాడు. నోరావర్క్స్ జపాన్ పేరుతో స్టార్టప్ వ్యవసాయ క్షేత్రాన్ని స్థాపించి తన మామడిబ్రాండ్‌నుహకుగిన్ నో తైయోగా అంటే మంచుసూర్యుడు బ్రాండ్‌గా మార్చి పండించాడు. నకగావా సాగురహస్యం మంచు వేడినీటి బుగ్గలు రెండు సహజవనరులను మాత్రమే వినియోగించాడు. శీతాకాలంలో మంచును నిల్వచేసి వేసవిలో తన గ్రీన్‌హౌస్‌లను చల్లబరిచేందుకు ఉపయోగిస్తున్నాడు. దీనివలన లపండ్లు ఆలశ్యంగా పక్కావనికి వస్తాయి. గ్రీన్‌హౌస్‌ను వేడిచేయడానికి సహజమైన వేడినీటి బుగ్గలు ఉపయోగిస్తాడు. సీజన్‌లో సుమారు ఐదువేల మామిడి పండ్లనుపండిస్తున్నట్లు తెలిపాడు. 2014లో ఇసేటాన్ డిపార్టుమెంటల్‌స్టోర్‌లో తన మామిడిపండును ప్రదర్శనకు ఉంచితే 400 డాలర్లకు అమ్ముడుపోయిందని, ఒక్క మామిడిపండుకు కళ్లుచెదిరే ధర పతాక శీర్షికలకు ఎక్కి అందరి



దృష్టిని ఆకర్షించింది. ఇపుడు నకాగవా క్లయింట్లలో మామిడిపువ్వులకేకులలో పండ్లను ఉపయోగించే ఆసియాస్ బెస్ట్ ఫిమేల్‌చెఫ్ నాట్సుకో షోజి వంటి రెస్టారెంట్‌లు కూడా ఉన్నాయి. విదేశాల్లోకూడా వందలాదికస్టమర్లు ఉన్నారు. హాంకాంగ్‌లోని సిటీసూపర్ వంటి అత్యాధునిక రిటైలర్లకు తన మామిడి పండ్లను ఆయన సరఫరాచేస్తున్నాడు. శీతాకాలంలో వ్యవసాయం వల్ల ఆయన ఊహించని విధంగాప్రనయోజనాలు పొందుతున్నట్లు తెలిపాడు. మామిడి టీకోసం ఒక ప్రముఖ కంపెనీ లుపిసియా తనను సంప్రదించిందని నకగవా చెప్పాడు. శీతాకాలంలో టోకాచిని పండ్ల ఉత్పత్తికేంద్రంగా మార్చేందుకు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహాన్ని అందించడానికి అదేపద్ధతిని ఉపయోగించి ఇతర ఉష్ణమండల ఉత్పత్తులనెంచాలని లక్ష్యంగాపెట్టుకున్నాడు. వెచ్చని వాతావరణంలో వృద్ధిచెందడానికిప్రసిద్ధిచెందిన పండ్లను సాగుచేయాలని నిర్ణయించాడు.

# విశ్వనగరంగా ముందుకు దూసుకెళ్తోన్న హైదరాబాద్



### రూ. 985కోట్ల ఖర్చుతో స్ట్రాటజిక్ నాలా అభివృద్ధి కార్యక్రమం
### అత్యాధునిక వసతులున్న వైకుంఠధామాన్ని
### ప్రారంభించిన ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్
### అద్భుతమంటూ అధికారులకు ప్రశంసలు

**హైదరాబాద్ (బేగంపేట), మే 9, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరం విశ్వ నగరంగా మరింత అభివృద్ధి చెందుతున్నదని, ముఖ్యమంత్రి కెసిఆర్ విజన్‌తో భాగ్యనగర అభివృద్ధి మరింతగా కొనసాగుతోందని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారాకరామారావు అన్నారు. మంగళ వారం కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ పరిధిలోని ధనియాల గుట్టలో నూతనంగా నిర్మించిన వైకుంఠధామం (శ్మశాన వాటిక)ను మంత్రి కెటిఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సుందరంగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన వైకుంఠధామంలోని ప్రతి ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగించారు. హైదరాబాద్ నగరంలో నాలాల అభివృద్ధికి రూ. 985 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ప్రతి యేటా వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టా మన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగాలంటే ఫ్లైఓవర్లు, మెట్రో సౌకర్యాలు, తాగునీటితోపాటు చక్కటి వాతావరణాన్ని అందించే శ్మశాన వాటికలు సైతం అవసరం అని అన్నారు. గతంలో జూబ్లీహిల్స్‌లో మహాప్రస్థానం ఉండేదని, నేడు హైదరాబాద్ నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో వైకుంఠధామాల నిర్మా ణాన్ని ప్రారంభించి పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా ఎల్బీనగర్‌లో హిందూ, క్రిస్టియన్, ముస్లిం మతాల కోసం ఒకేచోట ఏర్పాటు చేసామని మంత్రి కెటిఆర్ చెప్పారు.

హైదరాబాద్ నగరంలో వరదముంపు ముప్పు తట్టుకునేలా నాలాల అభివృద్ధికి రూ. 985 కోట్లు ఖర్చు చేస్తున్నామని మంత్రి అన్నారు. అదే విధంగా ఆగస్టు 15నాటికి హైదరాబాద్ నగరంలో మురుగును పూర్తిగా శుద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం 3800కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందని మంత్రి ప్రకటించారు. మౌలికవసతుల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని ఆయన అన్నారు.

అలాగే ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ ఈ మధ్యకాలంలో హైదరాబాద్ నగరం సందర్శించి న్యూయార్క్‌లా ఉందని అభిప్రాయం వ్యక్తం చేసారని, అలాగే అమెరికాలో నివసిస్తున్న సినీనటి లయ ఈ మధ్య కాలంలో హైదరాబాద్ నగరాన్ని సందర్శించి లాస్‌ఏంజెల్స్‌లా మారిందన్న కితాబు ఇచ్చారని మంత్రి వెల్లడించారు. పల్లె, పట్టణ ప్రగతిలో తెలంగాణా ప్రభుత్వానికి అవార్డులు గెల్చుకుం టున్నదని, ఇది తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. మంచి నాయకులు, మంచి ప్రభుత్వాన్ని ప్రజలు కాపాడుకోవాలని, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభివృద్ధి కోసం అహర్నిశలు తపిస్తుంటాడని, అలాంటి నాయకుడికి ప్రజలు అండగా ఉండి కాపాడు కోవాలని పిలుపు నిచ్చారు.

త్వరలోనే డబుల్‌బెడ్ ఇళ్లను పంపిణీ చేయనున్నామన్నారు. ప్రజారవాణాను మరింతగా మెరుగు పరుస్తున్నా మన్నారు. హైదరాబాద్ నగరాన్ని ఈ స్థాయిలో నిలబెట్టిన ఈ ప్రభు త్వాన్ని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి కెటిఆర్ కోరారు. కార్యక్రమంలో మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ముఠాగోపాల్, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, శంభిపూర్ రాజు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్ బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, కూకట్‌పల్లి నియోజక వర్గంలోని అన్ని డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.


మహేశ్వరం నియోజకవర్గంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్న సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క తదితరులు

## భూములను దోపిడీ చేస్తున్న కెసిఆర్ సర్కార్‌ను గద్దె దింపుతాం

### పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో సిఎల్పీ నేత భట్టి విక్రమార్క

**హైదరాబాద్ (సరూర్‌నగర్), మే 9, ప్రభాతవార్త:** గత కాంగ్రెస్ పాలనలో పేదలకు, రైతులకు ఇచ్చిన భూములను దోపిడీ చేస్తున్న బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్యాయానికి గురవుతున్న ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోల్పోయిన భూములను, ఇంటి స్థలాలను ప్రజలకు తిరిగి పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పీపుల్స్ మార్చ్ పేరిట భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర మహేశ్వరం నియోజకవర్గానికి చేరుకుంది. 54వ రోజు పాదయాత్ర మంగళవారం నియోజకవర్గంలోని జిల్లెలగూడ నుండి ప్రారంభమై మీర్‌పేట్, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట్, నాదర్‌గుల్‌ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదలకు, రైతులకు ఇచ్చిన భూముల వివరాలను నియోజకవర్గాల వారీగా లెక్కలు తీస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ సుమారు 25 లక్షల కోట్ల విలువ చేసే ప్రజల భూములను కెసిఆర్ ప్రభుత్వం బలవంతంగా లాక్కున్నదనీ ఇది అతిపెద్ద కుట్ర అని ఆయన అభివర్ణించారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఫార్మాసిటీ కోసం రైతులకు చెందిన 500 ఎకరాల భూమిని బలవంతంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుందనీ మరో 400 ఎకరాలు బఫర్ జోన్‌లో పెట్టి ప్రజలకు అన్యాయం చేసిందని భట్టి ఆరోపించారు. ప్రభుత్వం బలవంతంగా గుంజుకున్న భూముల్లో బాధితులతోనే దున్నిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన అతివేగం

### ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 9 ప్రభాతవార్త :** అతి వేగంతో బైక్‌పై వెళుతూ డివైడర్ ఢీకొట్టడంతో ముగ్గురు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే భూత్పూర్‌కు చెందిన ఆనంద్ (26) తన వ్యక్తిగత పని నిమిత్తం మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అమిస్తాపూర్ వద్ద ఉన్న తన సోదరి నాగమణి (26), మేనత్త వెంకటమ్మ అలియాస్ లక్ష్మమ్మ (60)లు భూత్పూర్‌కు బబయలుదేరారు. భూత్పూర్ మున్సిపల్ హైసూనకల్ వద్ద తహసిల్దార్ కార్యాలయం ఎదురుగా యూటర్న్ ఉండగా బైక్ అతివేగంగా రావడంతో అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆనంద్ తల డివైడర్‌ను ఢీకొట్టడంతో నుజునుజ్జుగా మారింది. ఘటనా స్థలానికి సిఐ రజితారెడ్డి, ఎస్సై భాస్కర్‌రెడ్డిలు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ రజితారెడ్డి మాట్లాడుతూ అతివేగం వల్లేప్రమాదం జరిగిందని బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం కూడా ఇందుకు కారణమని పేర్కొన్నారు. వాహనదారులు నిదానంగా ప్రయాణించాలని సూచించారు.

## ఆయన నోటికి అడ్డూ.. అదుపు లేదు!

### పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డిపై నిప్పులు చెరిగిన మంత్రి తలసాని

**హైదరాబాద్ (బేగంపేట), మే 9, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం నూత నంగా నిర్మించి ప్రారంభించిన సచివాలయంపై విపక్షాలు బిఆర్‌ఎస్ సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. మంగళవారం బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ ధనియాలగుట్టలో రూ 8కోట్ల 54లక్షలతో అత్యా ధునికంగా నిర్మించిన వైకుంఠధామాన్ని మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి తలసాని మాట్లాడుతూ తీవ్రపదజాలంతో ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. సెక్రటేరియట్ అనేది ఈ రాష్ట్ర పౌరులందరికీ సంబంధించిన విషయం.. ఈ రాష్ట్రంలోని ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం, అందించాలంటే సచివాలయమే కేంద్ర స్థానం. పాత సెక్రటేరియట్ స్థానంలో నూతన భవనాన్ని నిర్మిస్తామంటే ఆరోజు (విపక్షాలు) ఎన్ని గొడవలు చేసారో అందరికీ తెలుసు. కోర్టులను కూడా ఆశ్రయించారు. ఈ రోజు వీరంతా సచివాలయంలోకి మేం కూడా వస్తాం అంటారు. అని నిప్పులు చెరిగారు. ఇది అద్భుతమైన సెక్రటేరియట్ అని, చూస్తే అమెరికాలోని వైట్‌హౌస్ చూడాలి. లేకపోతే తెలంగాణలో మన సచివాలయాన్ని చూడాలి అని తలసాని అభివర్ణించారు. రాజ్యాం గాన్ని తెలంగాణలో అమలు చేస్తున్నామని, సచివాలయానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో తలసాని టీపీసీసీ చీఫ్ రేవంత్‌పై ఘాటైన పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేసారు. నిన్న ఆమె(ప్రియాంక గాంధీ) వచ్చింది. ఆమె ఒక డిక్లరేషన్ ఇచ్చింది. ఆ పొట్టివాడు డిక్లరేషన్ గురించి మాట్లాడుతాడు. ఆయన నోటికి అడ్డు అదుపు లేదు. ఎమ్మెల్యే, మంత్రి లేదు. అందరి గురించి అవాకులు, చవా కులు మాట్లాడుతాడు అంటూ రేవంత్‌రెడ్డి గురించి పరుషంగా మాట్లా డుతూ తన ఉగ్రరూపాన్ని ప్రదర్శించారు. ఇంకొకరు మతాల మధ్య చిచ్చుపెట్టేలా ప్రవర్తిస్తున్నారు. వీరు మాకు బొట్టు పెట్టుకోవడం నేర్పు తారా? వారు సొంతంగా ఏమైనా ఆలయాలు నిర్మించారా? మతాల మధ్య, కులాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపు కోవాలని చూడటం దారుణమైన చర్య అన్నారు. చేసిన అభివృద్ధి ఏమి లేనపుడే ఇలా రెచ్చగొడుతుంటారని, ప్రజలకు అభివృద్ధి ఎవరూ చేస్తున్నారన్న విషయం ఇప్పటికే పూర్తిగా అర్ధమైందని, ప్రజలు అలాంటి పగటి వేషగాళ్లను నమ్మరని తలసాని అన్నారు.

## బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశం

### పిల్లలను చూడకుండా పదేళ్లుగా అక్కడే ఉద్యోగం

### ఇంటికొచ్చిన గంటలోనే కొడుకు మృతితో విషాదం


శివకార్తిక్ (ఫైల్)

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందుల వల్ల కుటుంబ పోషణకై చౌట్‌పల్లి మోహన్ గల్ఫ్ వెళ్లి డబ్బు సంపాదించుకొని వద్దామని వెళ్లి పది సంవత్సరాలు అక్కడే ఉండి ఇంటి కొచ్చిన గంటలోనే కొడుకు మృతితో ఆ కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి. తండ్రి తన కొడుకు పుట్టిన రెండేళ్లకే ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్ వెళ్లాడు. పదేళ్ల పాటు అక్కడే ఉండి ఒక్కసారి కూడా ఇంటి ముఖం చూడలేదు. కుటుంబ వ్యవహారాలు,పిల్లల బాగోగులు ఫోన్‌లో మాట్లాడి తెలుసుకునేవాడు చాలాకాలం నిరీక్షణ పూర్తయ్యాక ఎట్టకేలకు ఇంటికి బయటు దేరాడు. కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టుకు వచ్చి ప్రేమతో ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికెళ్లిన తర్వాత తాగడానికి నీరు లేకపోవడంతో నీటి డబ్బా తీసుకొస్తానని బైక్‌పైవెళ్లిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయాడు. విగత జీవిగా పడి ఉన్న కొడుకుని చూసి తండ్రి కుప్పకూలి పోయాడు. ఈ ఘటన జగిత్యాలలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలలోని మహాలక్ష్మినగర్‌కు చెందిన చౌట్‌పల్లి మోహన్, పద్మిని దంపతులకు కుమార్తె హర్ష, కుమారుడు శివకార్తిక్ (12) ఉన్నారు. తండ్రి మోహన్ ఉపాధి నిమిత్తం పదేళ్ల క్రితమే సౌదీ అరేబియా వెళ్లారు. సోమవారం ఆయన గల్ఫ్ నుంచి స్వదేశానికి తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు ఎయిర్‌పోర్టుకు వెళ్లి తోడ్కొని వచ్చారు. ఇంట్లో తాగునీరు అయి పోవడంతో తాను తీసుకొస్తానని శివకార్తిక్ ద్విచక్రవాహనంపై వెళ్లాడు. బైపాస్ రహదారిలోని దేవిశ్రీ గార్డెన్ సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు .తీవ్రగాయాలవడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యం లోనే చనిపోయాడు. పదేళ్ల తర్వాత తన కొడుకును చూసుకున్న ఆ తండ్రి ఆనందం అంతలోనే మాయమైపోయిందని అంతా కంటతడి పెట్టారు.

## కార్పొరేట్‌కు దీటుగా తార్నాక ఆర్టీసి ఆస్పత్రి

● అందుబాటులోకి మరో 25 ఐసియు పడకలు: ఎండి విసి సజ్జనార్


తార్నాక ఆర్టీసి హాస్పిటల్‌లో ఆపరేషన్ థియేటర్లను ప్రారంభిస్తున్న ఎండి విసి సజ్జనార్

**హైదరాబాద్ (తార్నాక), మే 9, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగుల ఆరోగ్యానికి సంస్థ పెద్ద పీట వేస్తూ కార్పొరేట్ హాస్పిటల్‌లకు ధీటుగా ఆసుపత్రిలో సేవలందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీఎస్‌ఆర్టీసీ ఎండి వీసి సజ్జనార్ పేర్కొన్నారు. తార్నాక ఆర్టీసీ హాస్పిటల్లో నూతనంగా నిర్మించిన 4సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లతో పాటు 15 బెండ్ల మెడికల్, 10 బెడ్ల సర్జికల్ ఐసీయూలను మంగళవారం ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ థియేటర్లలోని వైద్య పరికరాలను పరిశీలించి హాస్పిటల్లో సిబ్బందికి అందుతున్న వైద్య సేవలను డాక్టర్లతో అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్య సంక్షేమంపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించించడంతో పాటు సంస్థ అభ్యున్నతి దిశగా తీసుకెళ్లడానికి అందరి సహకారంతో ముందుకు వెళ్లతున్నానని వెల్లడించారు. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో కూడిన 4సూపర్ స్పెషాలిటీ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్)లో మద్ద తుతో 25 ఐసీయూ బెడ్లతో పాటు అవసరమైన పరికరాలను సమకూ ర్చుకుం టున్నామని చెప్పారు. ఈ ఆసుపత్రిపై గతంలో చాలా ఫిర్యాదులు వచ్చేయని నేడు ఆ పరిస్థితిలేకపోవడం మంచి పరిణామం అన్నారు.

**ఉద్యోగుల ఆరోగ్యం కోసం**

**హెల్త్ వలంటీర్ల వ్యవస్థ: ఎండి సజ్జనార్**

తార్నాక ఆర్టీసీ హాస్పిటల్లో ఉద్యోగుల సౌకర్యం కోసం కొత్తగా వాలంటీర్లను అన్ని డిపోలల్లో ఏర్పాటు చేస్తున్నామని ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. వీరు ఉద్యోగుల ఆరోగ్యకరమైన అలవాట్లపై మాట్లాడుతారని, నిత్యం కౌన్సిలింగ్‌తో పాటు పలు సూచనలు చేస్తారని వెల్లడించారు. డాక్టర్లు సూచించిన సమయానికి అనుగుణంగా మందులు వేసుకునేలా, ఆహారపు అలవాట్లపై వీరు సూచిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, సీపీఎం ఎస్.కృష్ణకాంత్, సీసీవోఎస్ విజయభాస్కర్, సీసీఈ రాంప్రసాద్, తార్నాక హాస్పిటల్లో ఓఎస్డీ సైదిరెడ్డి, ఆసుపత్రి సూపరెండెంట్ డా. శైలజామూర్తి, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డా. శ్రీనివాస్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

## మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

### గ్రా. 41 ఎండిఎంఎ, ద్విచక్రవాహనం స్వాధీనం

**మేడ్చల్ మే 9, ప్రభాతవార్త:** అత్యంత ప్రమాదకరమైన నిషేధిత మాదకద్రవ్యాలను దొంగ చాటుగా విక్రయిస్తున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.మేడ్చల్ ఏసిపి వెంకట్ రెడ్డి ఆధ్వరంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు వివరాల ప్రకారం ...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదారి జిల్లా తాడేపల్లి గూడెంకి చెందిన పోతిరెడ్డి మెహర్ బాబా (30) గత కొంతకాలంగా నగరంలోని బేగంపేట్ కుందన్ బాగ్‌లో గల వరద అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటు న్నాడు. కాగా విలాసవంతంగా బతకాలనీ ఉద్దేశంతో అత్యంత ప్రమాదకరమైన ఎండిఎ డ్రగ్ మాదకద్రవ్యాన్ని విక్రయించేందుకు గాను ఢీల్లీకి చెందిన జిన్ని అనే వ్యక్తితో పరిచయం ఏర్పరచుకొని గత రెండు సంవత్సరాలుగా నగరంలో ఈ డ్రగ్ విక్రయిస్తున్నాడు.కాగా గత కొంతకాలంగా తప్పించుకుని తీరుగుతున్న ఇతను మేడ్చల్ పోలీసులకు పట్టుబడ్డాడు..మేడనచల్ ఎస్ఓటీ పోలీసుల అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టపూర్ గ్రామంలో గల సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం పక్కన 8వ తేది సుమారు 6గంటల సమయంలో మెహర్ బాబా మాదకద్రవ్యాలు విక్రయిస్తుండగా అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు కాపు కాసి పట్టుకున్నారు.కాగా అతని వద్ద నుండి 41 గ్రాముల ఎండిఎంఎతో పాటు రెండు సెల్‌ఫోన్లు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.దీని విలువ రూ. 3లక్షల 40వేలు ఉంటుందని పేర్కొన్నారు.అత్యంత చాకచక్యంతో పట్టుకున్న ఎస్ఓటి పోలీసులుతోపాటు మేడ్చల్ పోలీసులను అభినందించిన ఎసిపి వారికి నగదు రివార్డులను ప్రకటించారు.

## మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి లైంగిక వేధింపులు దేశానికే అవమానం



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఐ నేతలు అజీజ్ పాషా, సాంబశివరావు, వెంకట్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 9, ప్రభాతవార్త:** ఒలింపిక్, కామన్వెల్త్ పోటీలలో పతకాలను సాధించి భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్‌భూషన్‌శరన్‌సింగ్ లైంగీక వేదింపులకు పాల్పడటం దేశానికి అవమానకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిజ్‌భూషన్ వంటి నిందితులను కాపాడుతూ న్యాయకోసం పోరాడుతున్న మహిళా క్రీడాకారులను అవమానపరుస్తూ బిజెపి దేశ పరువు ప్రతిష్టలను దిగదార్చు తున్నదని వారు ధ్వజమెత్తారు. గత కొన్ని రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న రెజ్లర్లులకు సంఘీభావంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్ నుంచి హిమాయత్‌నగర్‌లోని వైజంక్షన్ వరకు మంగళవారం ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే బ్రిజ్‌భూషన్‌ను అరెస్టు చేయాలని, మహిళా రెజ్లర్లుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మైనర్‌తోసహా 7గురు రెజ్లర్లపై లైంగీక వేధింపులకు పాల్పడిన శరణ్‌సింగ్ విషయంలో బిజెపి కేంద్ర నాయకత్వం ఎందుకు మౌనంగా ఉంటుందని వారు ప్రశ్నించారు. రెజ్లర్లుకు న్యాయం జరిగేంతవరకు సిపిఐ దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, టి.శ్రీనివాస్‌రావు, శంకర్, ఎన్.బాలమల్లేష్, ఇటి నరసింహ , పశ్య పద్మ, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాల్‌రాజ్, ఎం.డి.యూసఫ్, బి.హేమంత్‌రావు, ఎస్.ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు కోసం కాంగ్రెస్ వ్యూహం

### రాష్ట్రమంతా విలేజ్ కమిటీల ఏర్పాటు

### కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ దృష్టి సారించింది. అందులో భాగంగానే విలేజ్ కమిటీలపై దృష్టి సారించింది. ఇక రానున్న రోజుల్లో కాంగ్రెస్ త్రిముఖ పోటీ పడే అవకాశం కనిపిస్తుంది. బిఆర్‌ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ నెలకొందని చెప్పొచ్చు. అందులో భాగంగానే గ్రామీణ ఎన్నికల బృందాలపై దృష్టిసారించింది. ప్రతి మండలంలో కనీసం 25 మంది సభ్యులతో ఎన్నికల బృందాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇందులో 40 శాతం మంది మహిళలు, ఎస్సీలు, ఎస్టీలు, బిసిలతో పాటు 50 సంవత్సరాలలోపు వారు ఉంటారు. ఈ నెలాఖరులోగా రూరల్ ఎన్నికల టీమ్‌లు అన్ని అందుబాటులోకి రానున్నాయి. ముందస్తు ప్రచారశిక్షణ తరగతుల అనంతరం ఆ బృందం గ్రామాల్లో ప్రచారం చేయ నున్నారు. తెలంగాణలో ఉన్న 119 నియోజకవర్గాలోని 600 మండలాలలో 13 వేలకు గ్రామపంచాయతీలు ఉన్నాయి.

### ఇంటర్‌లో ఫెయిల్ అవుతానని..

## ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి ఉత్తీర్ణత


కృష్ణ (ఫైల్)

**కేసముద్రం, మే 9, ప్రభాతవార్త:** ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అవుతా నేమోనన్న భయంతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి తీరా ఫలితాలు వచ్చిన తర్వాత ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించిన సంఘటన మహబూ బాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో చోటు చేసుకుంది. అప్పటికే కొడుకును పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంతో ఉన్న ఆ తల్లిదండ్రులు తమ వాడు ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడని తెలిసి గుండెలవిసేలా రోదిస్తు న్నారు. కేసముద్రం మండలంలో పీక్లాతండా శివారు బోడగుట్టతండా ఈ విశాదానికి వేదికగా నిలిచింది. తండాకు చెందిన గుగులోతు లచ్చు, జో ్యతిలకు ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో పెద్దవాడైన గుగులోతు కృష్ణ (19) ఇటీవల ఏటూరునాగారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి వార్షిక పరీక్షలకు హాజరయ్యాడు. మొదటి నుండి డాక్టర్ కావాలని కలలు కంటూ శ్రద్ధగా చదివి ఇంటర్మీడియట్ బైపీసి పూర్తి చేసాడు. డాక్టర్ కావాలనుకున్న తన కోరికను కూడా ఇంట్లోని తన గదిలో నినాదాల రూపంలో రాసుకున్నాడు. పరీక్షలు రాసి ఇంటికొచ్చిన కృష్ణ ఒకరోజు తల్లి దండ్రులు ఇంట్లోలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటర్ పరీక్షలు తాను సరిగా రాయలేకపోయానని, డాక్టర్ కావాలనుకున్న కోరిక తీరని పరిస్థితి ఉందని అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఉరివేసుకునే ముందు కృష్ణ వదిలిన సూసైడ్ నోట్‌లో పేర్కొ నడంతో అప్పుడు దీనిపై పోలీసు కేసు కూడా నమోదైంది. కాగా మంగళవారం వెలువడిన ఇం టర్ ఫలితాల్లో కృష్ణ 1000మార్కులకు 892 మార్కులు సాధించి ఏ గ్రేడ్‌లో ఉత్తీర్ణుడయ్యాడు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టేలా చర్యలు తీసుకోండి

### జాతీయ బిసి కమిషన్ చైర్మన్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్ మే 9, ప్రభాతవార్త:** దేశంలోని 56శాతం గల బిసిల జనాభా అభివృద్ధికి కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని అలాగే కేంద్రబడ్జెట్‌లో రెండులక్షకోట్లు, పార్లమెంట్‌లో బిసిబిల్లుపెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి కమిషన్ చైర్మన్ హాంసరాజ్ గంగారామ్‌ను ఎంపి.ఆర్.కృష్ణయ్య కోరారు. ఈమేరకు హైదరాబాద్ పర్యటనలో ఉన్న చైర్మన్‌ను మంగళవారం తన బృందంతో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గత 75ఏళ్లుగా దేశ జనాభాలో సగభాగం ఉన్న బిసిలకు విద్యా,ఉద్యోగ, ఆర్థిక , రాజకీయ ,సామాజిక రంగాల్లో అన్యాయం చేస్తున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశం కనుక అన్నికులాల వారికి వారివారి జనాభా ప్రకారం వాటా దక్కాలన్నారు. కానీ మనదేశంలో బిసిలకులాలకు ఏరంగంలో కూడా వాటా దక్కలేదన్నారు. అందుకే రాజ్యాంగబద్ధమైన జాతీయ బిసి కమిషన్ జోక్యం చేసుకుని బిసిలకు అన్నిరంగాల్లో వాటా దక్కేలా చూడాలని కోరినట్లు తెలిపారు. చైర్మన్ కలిసిన జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నీల వెంకటేష్,నందగోపాల్, వేముల రామకృష్ణ, సుధాకర్, జోషి రాఘవ,నిఃల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ బిసి కమిషన్ చైర్మన్ హాంసరాజ్ గంగారామ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య తదితరులు

## ఓఆర్ఆర్ పచ్చదనానికి ముగ్గురు ఐఎఫ్ఎస్‌ల బృందం

### డ్రిప్ సిస్టమ్, పూలమొక్కలపై అధ్యయనం

### పచ్చదనం ప్రత్యేకతలను వివరించిన డైరెక్టర్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ఔటర్‌రింగ్ రోడ్డు పచ్చదనాన్ని చూసి ఇండియన్ ఫారెస్టు సర్వీస్ అధికారులు ఫిదా అయిపోయారు. దేశంలో ఎక్కడా లేదనివిధంగా ఏకంగా 160 కిలోమీటర్ల మేరకు పచ్చదనం నిర్వహణ కోసం నిరంతరంగా పనిచేసే ఓఆర్‌ఆర్ డ్రిప్ సిస్టం స్కోడా సెంటర్ పనితీరును ఐఎఫ్‌ఎస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది. 1989 నుంచి 2014 బ్యాచ్‌లకు చెందిన తొమ్మిది రాష్ట్రాల నుంచి 16 మంది ఐఎఫ్ఎస్ అధికారుల బృందం 'ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్ మెంట్ : నీడ్ అండ్ మెథడ్స్ ఫర్ అసెస్‌మెంట్' అనే అంశంపై కంపల్సరీ ట్రైనింగ్ కోర్సులో భాగంగా మంగళవారం ఓఆర్‌ఆర్ గ్రీనరిని ఆద్యంతరం సందర్శించారు. వీరిలో 1989 బ్యాచ్‌కు చెందిన సీనియర్ పిసిసిఎఫ్ ఓంప్రకాష్ సింగ్ ఉన్నారు. ఓఆర్‌ఆర్ నిర్వహణలో తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎండిఎ అర్బన్ ఫారెస్టు డైరక్టర్ డా.బి.ప్రభాకర్ ఓఆర్‌ఆర్ గ్రీనరి నిర్వహణలో తీసుకుంటున్న మెలకువలను వివరించారు. వరల్డ్ గ్రీన్ అవార్డు అందుతున్న తరువాత తమ బాధ్యత ఎంతో పెరిగిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్ మార్గదర్శకంతో, మెట్రోపాలిటన్ కమిషనర్ అరవింద్‌కుమార్ పర్యవేక్షణలో అనతి కాలంలోనే ఔటర్ రింగ్ రోడ్డు గ్రీనరి నిర్వహణ కోసం ప్రత్యేకంగా డ్రిప్ సిస్టం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఓఆర్‌ఆర్ మొత్తం సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు జరిగాయని ప్రభాకర్ వారికి వివరించారు. ఓఆర్‌ఆర్ క్షేత్రస్థాయి పర్యటన తదుపరి నానక్‌రాం గూడలోని ఓఆర్‌ఆర్ డ్రిప్ ఆటోమేషన్ సెంటర్ పనితీరును ఐఎఫ్ఎస్ అధికారుల బృందం అధ్యయనం చేసింది, ఓఆర్‌ఆర్ మీద వివిధ రకాల ఫ్లవరింగ్ ప్లాంట్లు చూసి అధికారులు ముగ్దులయ్యారు. యేడాది పొడవుగా ఔటర్ రింగ్‌రోడ్డుపై పూల మొక్కలు కనువిందు చేస్తాయని ప్రభాకర్ వారికి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంట సర్వీస్ రోడ్డులో ఉన్న సోలార్ సైకిల్ ట్రాక్ పనులను కూడా ఐఎఫ్ఎస్ అధికారుల బృందం పరిశీలించింది. ఆ తరువాత వారు హెచ్‌ఎండిఎ దుండిగల్ నర్సరీని పరిశీలించారు.

తెలంగాణ ఇంటర్-2023 ఫలితాల్లో

## నారాయణ విజయవిహారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులు 468 మార్కులు 7గురు విద్యార్థులు సాధించగా, అందులో ముగ్గురు నారాయణ విద్యార్థులే కావటం గమనార్హం. అలాగే 467 మార్కులు 96 మంది, 466 మార్కులు 269 మంది, 465 మార్కులు 439 మంది విద్యార్థులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను 437 అత్యుత్తమ మార్కులతో పాటు 436 మార్కులు 10 మంది, 435 మార్కులు 13 మంది కైవసం చేసుకున్నారు. అలాగే సీనియర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 993 మార్కులతో ఇద్దరు విద్యార్థులు టాప్ మార్కు సాధించగా, 992 మార్కులు సాధించిన వారు 9 మంది,991 మార్కులు సాధించిన వారు 17 మంది,సీనియర్ ఇంటర్ బైపిసి విభాగంలో1000 మార్కులకుగాను 991 మార్కులు ఒకరు సాధించగా, 990 మార్కులు ఆపైన సాధించిన వారు ఇద్దరు 989 మార్కులు ఆపైన సాధించిన వారు ఆరుగురు సాధించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరంభం నుంచి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌ను పటిష్టమైన మైక్రోషెడ్యూల్స్‌గా రూపొందించి కాన్సెప్చువల్ ఒరియంటేషన్‌లో విద్యాబోధన చేయటం వల్లనే తమ విద్యార్థులు ఇంతటి అద్భుత ఫలితాలను సాధించగలిగామని తెలిపారు. తద్వారా తెలంగాణలోని నారాయణ విద్యా సంస్థల్లో జూనియర్,సీనియర్ ఇంటర్‌లలో అత్యధిక పాస్ పర్సంటేజ్ సాధించటం జరిగిందని చెప్పారు. సబ్జెక్టుల వారీగా విశ్లేషణాత్మక ధోరణిలో విద్యార్థుల మేధో సంపత్తిని పెంపొందించే విధంగా పాఠ్యాంశ బోధన చేయటం అనేది నారాయణ ప్రత్యేకంగా చెప్పారు. 44 సంవత్సరాల ఈ మహాప్రస్థానానికి కొనసాగింపుగా,నేటి ఈ ఇంటర్‌లో సాధించిన అత్యద్భుత మార్కులే రేపటి జెఈఈ మెయిన్,అడ్వాన్స్‌డ్,నీట్ ఫలితాలకు ఆరంభమని, ఆ ప్రవేశ పరీక్షలన్నింటిలోనూ తమ విద్యార్థులే అత్యుద్భుత ర్యాంకులు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన తమ విద్యార్థులకు,తల్లిదండ్రులకు,అధ్యాపక బృందానికి నారాయణ విద్యా సంస్థల తరఫున అభినందనలు తెలియజేశారు.

## గొర్రెలు, మేకల దొంగల ముఠా అరెస్టు

48 గొర్రెలు, రూ.2.50లక్షల నగదు స్వాధీనం

**ఇబ్రహీంపట్నం, మే 9, ప్రభాతవార్త:** తాగుడుకు బానిసై ఈజీ మని కోసం గొర్రెలు,మేకలు దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.ఈ ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ సందర్భంగా సోమవారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ రవికుమార్ కథనం ప్రకారం.. వండర్‌లా సమీపంలో టాటాఇండికా కారులో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పారు.వారిని విచారించగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు.షేక్ ఇక్బాల్(26),షేక్ జాఫర్(26)సయ్యద్ అహ్మద్(33),మహ్మద్ గౌస్(23),షేక్ అమీర్ (20) వీరందరు ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. మేకలు,గొర్రెలు దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను చాకచక్యంగా పట్టు కొని నగదు,మేకలు,గొర్రెలను రికవరి చేసినందుకు గాను ఎస్ఐ సురేష్,హెడ్ కానిస్టేబుల్ గిరి,కానిస్టేబుల్ ప్రసాద్,శివచంద్ర,ఉపేందర్‌రెడ్డి,వెంకన్నలకు రివార్డులను అందజేశారు.వారి సేవలను గుర్తించి అభినదించారు.

## ఇదేనా కిసాన్ సర్కార్ అంటే?

నేడు రాష్ట్రవ్యాప్తంగా ఐకెపి కేంద్రాల వద్ద వైఎస్సార్‌టిపి ధర్నాలు

**హైదరాబాద్ మే 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తడిసిన వడ్లు కొనాలని, కోతులు పెట్టవద్దని రైతులు కాళ్ల వేళ్లా పడుతున్నారని, అయినా నీ గుండె కరగడం లేదా? కెసిఆర్ దొరా అంటూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఇదేనా కిసాన్ సర్కార్ అంటూ ప్రశ్నించారు. ఎండనకా, వాననక, రైతులు కొనుగోలు సెంటర్‌లలో పడిగాపులు కాస్తున్నాన్నారు. గడీల్లో దర్జాగా బతకడమా? పెద్ద రైతును అని చెప్పుకునే స్వయం ప్రకటిత మేధావికి అన్నారు. రైతుల బాధలు నెత్తికెక్కడం లేదా అంటూ ప్రశ్నించారు. ఇంతైనా చలించని నికృష్టపాలనకు నిరసనగా ప్రతి గింజా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో ఐకెపి కేంద్రాల వద్ద ధర్నాలు చేస్తుందన్నారు.

## రాష్ట్రంలో కరోనా తాజా కేసులు - 29

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** రాష్ట్రంలో కరోనా పాజిటీవ్ కేసులు మెల్లిగా పెరుగుతున్నాయి.మంగళవారం సాయంత్రం వరకు ఒక్క రోజులో 29 పాజిటీవ్ కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.ఇప్పటివరకు రాష్ట్రంలో 8,43,940పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు.రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4111 వరకు చేరింది.ఒక్క రోజులో 4640 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,88,41,312మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.ఇప్పటి వరకు కరోనా నుంచి 8,39,617 మంది కోలుకోగా (99.49శాతం) మంగళవారం 44 మంది కోలుకున్నారు. మొత్తం యాక్టీవ్ కేసుల సంఖ్య 212కు చేరింది. మంగళవారం జిహెచ్‌ఎంసి పరిధిలో 20 పాజిటీవ్ కేసులు నమోదు అయ్యాయి.

# నా కూతురు భూములను ఎక్కడా కబ్జా చేయలేదు

● కావాలనే బదనాం చేస్తున్నారు: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :** తన కుమార్తె భూములను ఎక్కడా కూడా కబ్జా చేయలేదని, తనపేరిటనే ఉందని, కేవలం అగ్రిమెంట్ మార్చుకున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం జనగామ జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తీవ్ర బావోద్వేగానికి గురయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చేర్యాల భూమి విషయంలో కావాలనే తనను బదనాం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ ఉప్పల్ పీఎస్‌లో కూతురు తనపై ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, హబ్సిగూడలోని స్వాగత్ గ్రాండ్ భవనం తన కూతురుపేరిటనే ఉందని, కిన్నెర గ్రాండ్ అని పేరు మారడంతో లీజు అగ్రిమెంట్ మాత్రమే మార్చుకోవడం జరిగిందన్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో రాజకీయ ప్రత్యర్థులు తన కుమార్తెను అడ్డంపెట్టుకుని ఈ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. చేర్యాలలో 1402 సర్వే నంబర్ పరిధిలో తన కుమార్తె పేరిట 12వందల గజాల స్థలం ఉందని దీనిపై కొంతమంది రాజకీయంచేసి కోర్టు, లోక్ అదాలత్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ సైతం ఇక్కడ ఎటువంటి కబ్జాలేదని అధికారిక ప్రకటన చేసిన సంగతి అందరికి తెలిసిందేనన్నారు. గతంలో



ఎన్నికల సమయంలో కూడా తనపై అనేక కుట్రలు జరిగాయని, అయినా సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చి ఆశీర్వదించగా ప్రజలు భారీ మెజార్టీతో అక్కున చేర్చు కున్నారన్నారు. కుటుంబంలోని జరిగే విషయాలను ఇలా చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు.

### తండ్రి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై కేసుపెట్టిన కుమార్తె

**హైదరాబాద్ (తార్నాక), మే 9, ప్రభాతవార్త:** వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన బీఆర్ఎస్ పార్టీ జనగావ నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై ఆయన కూతురు తుల్జా భవానిరెడ్డి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫోర్జరీ కేసు పెట్టారు. తన స్థలాన్ని తండ్రి కాజేశారని ఫిర్యాదు చేశారు. హబ్సిగూడలోని 159 గజాల కమర్షియల్ బిల్డింగ్ విషయంలో ఆమె ఫిర్యాదు చేశారు. నాచారం హబ్సిగూడ కినారా గ్రాండ్ హోటల్‌కు తన తండ్రి ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అక్రమంగా అగ్రిమెంట్ చేసి తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఫిర్యాదు చేశారు. దీంతో ముత్తిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిబ్రవరిలో ఫిర్యాదు చేసినా ఉప్పల్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు.

## ముంబయి ఇండియన్స్ బ్యాటింగ్‌కు ఆర్సీబి గడబిడ

### ఆరు వికెట్ల తేడాతో ఆర్సీబి ఓటమి

**ముంబయి, మే 9:** ఐపిఎల్ 2023సీజన్‌లో 54వ మ్యాచ్ ఫ్యాన్స్‌కు ఆసక్తికరంగా మారింది. రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్ జట్లమధ్య వాంఖడేలో జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఆరువికెట్ల తేడాతో 20 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. ఆర్సీబీ బౌలర్ల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించడంతో ముంబయి ఇండియన్స్ ఛాన్స్‌తీసుకుని నెగ్గింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన ఆర్సీబీ ఆరువికెట్ల నష్టానికి 199 పరుగులుచేసి ముంబయికి 200 పరుగుల లక్ష్యం విధించింది. కట్టుదిట్టంగా ఆడి పరుగులు బ్రేక్‌చేసిన ముంబయి ఇండియన్స్ 21 బాల్స్ ఉండగానే నాలుగు వికెట్ల నష్టానికి 200 పరుగులుచేసి విక్టరీ నమోదుచేసింది.



తొలుత బ్యాటింగ్ 199కే పరిమితం అయిన ఆర్సీబీ ముంబయి ఇన్నింగ్స్‌లో తమ బౌలింగ్ పేలవంగా చేసారు. భారీ టార్గెట్‌నుప్రత్యర్థి ముందుంచినా బౌలర్ల పేలవ ప్రదర్శన ఆర్సీబీకి ఓటమి ఖాయంచేసింది. సూర్యకుమార్ యాదవ్ 35 బంతుల్లో 83 పరుగులుచేసి రాణించాడు. ఆరుసిక్స్‌లు, ఏడుఫోర్లు తనఖాతాలో వేసుకున్నాడు. నెహాల్ వధేరా 33 బంతుల్లో 52పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. నాలుగుఫోర్లు రెండు సిక్స్‌లతో కలిపి అర్ధసెంచరీతో మెరిసాడు. సిక్సర్‌తో వధేరా మ్యాచ్‌ను ముగించి విక్టరీనమోదుచేసాడు. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబయి ఇండియన్స్‌కు ఇషాన్‌కిషన్ 21 బంతుల్లో 4 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 42 పరుగులుచేసి బోణీచేసాడు. మరో ఎండ్‌లో ఉన్న రోహిత్‌వర్మ ఏడు పరుగేచేసి మరోసారి నిరాశపరిచాడు. ఇషాన్‌కిషన్‌క్రీజులో ఉన్నంతవరకూ రోహిత్ ప్రేక్షకపాత్రపోషించాడు. అయితే బౌలింగ్‌కు వచ్చిన హసరంగ ఒకేఓవర్‌లో ఇద్దరినీ ఔట్‌చేసి ఆర్సీబీకి బ్రేక్‌ఇచ్చాడు. అయితేక్రీజులోనికి వచ్చిన వధేరా సూర్యకుమార్‌యాదవ్ ఆర్సీబీ ఆశలపై నీళ్లుచల్లారు. వీరిద్దరూ వాంఖడేలో సిక్సర్ల వర్షంకురిపించారు. మూడో వికెట్‌కు ఏకంగా 140 పరుగుల భాగస్వామ్యం తెచ్చారు. అనంతరం సూర్యకుమార్‌యాదవ్ ఔట్ అయ్యాడు. అయితే సిక్సర్‌బాదిన వధేరా తన అర్ధసెంచరీతోపాటు మ్యాచ్‌నుసైతం ముగించేసాడు. తొలుత బ్యాటింగ్‌చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో ఆరువికెట్లనష్టానికి 199 పరుగులుచేసింది. గ్లెన్‌మ్యాక్స్‌వెల్ 33 బంతుల్లోఎనిమిదిఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 68 పరుగులుచేసాడు. ఫాఫ్‌డుప్లెసిస్ 41 బంతుల్లో 65 పరుగులుచేసాడు. ఐదుఫోర్లు మూడు సిక్స్‌లుకూడాసాధించాడు. చివరిలో దినేశ్‌కార్తీక్ 18 బంతుల్లో 30 పరుగులుచేసాడు. నాలుగుఫోర్లు ఒకసిక్స్‌తో ధాటిగా ఆడాడు. జేసన్ బెహ్రాండార్ఫ్ 3 వికెట్లుతీసాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ ఆరంభంలోనే వికెట్లను నష్టపోయింది. ఫామ్‌లో ఉన్న విరాట్‌కోహ్లీ ఒకటి, అనూజ్‌రావత్ ఆరు పరుగులతో వెంటవెంటనే ఔట్ అయ్యారు. దాంతో ఆర్సీబీ 16 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయి కష్టాల్లోపడింది. ఈ దశలోక్రీజులోకి వచ్చిన మాక్స్‌వెల్ మెరుపులు మెరిపించాడు. మరో ఎండ్‌లో ఉన్న డుప్లెసిస్‌తోకలిసి ఆర్సీబీ స్కోరు పరుగులు పెట్టించాడు. ఇద్దరూ మూడో వికెట్‌కు 120 పరుగులు సోడించారు. సెంచరీచేసేలా కనిపించిన మ్యాక్స్‌వెల్ భారీ షాట్‌కువెళ్లి ఔట్ అయ్యాడు. కాసేపటికే డుప్లెసిస్‌కూడా ఔట్ అయ్యాడు. చివరిలో కార్తీక్‌ధాటిగా ఆడటంతో ఆర్సీబీ 199 మార్కుచేరింది.

## కన్నడ ఎన్నికలపై తెలుగు రాష్ట్రాల్లో జోరుగా బెట్టింగ్

బిజెపి, కాంగ్రెస్ గెలుపుపై బెట్టింగ్ జోరు, చేతులు మారుతున్న రూ.కోట్లు

కర్ణాటక ఎన్నికల ఫలితాల తీరు తెలంగాణలో మరింత ప్రభావం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** కర్ణాటక ఎన్నికలు దేశ వ్యాప్తంగా ఆసక్తిని రేపుతున్నాయి. బుధవారం పోలింగ్ జరగనుండగా, 13వ తేదీన ఫలితాలు వెల్లడి కానున్నాయి. మరోపక్క,కర్ణాటక ఎన్నికల ఫలితాలపై తెలుగు రాష్ట్రాల్లో జోరుగా బెట్టింగ్ జరుగుతోంది. కాంగ్రెస్,బిజెపి గెలుపుపై హైదరాబాద్,కొంపల్లి,కూకట్‌పల్లి,గచ్చిబౌలి,భీమవరం తదితర ప్రాంతాల్లో జోరుగా బెట్టింగ్ కొనసాగుతోంది. కొట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 114 నుంచి 116 సీట్లు, బిజెపికి 80 నుంచి 82 సీట్లు వస్తాయని బెట్టింగ్‌లు కాస్తున్నారు. మొదట కాంగ్రెస్, ఆ తర్వాత బిజెపి,ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావొచ్చునని బెట్టింగ్‌లు కడుతున్నారు. జెడీఎస్‌కు 21 సీట్ల నుంచి 23 సీట్ల వరకు వస్తాయని మొదటి నుంచి బెట్టింగ్ కడుతున్నారు. బుధవారం పోలింగ్ సరళిని బట్టి కూడా బెట్టింగ్ మారవచ్చునని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కర్ణాటక ఎన్నికల ఫలితాల ప్రభావం తెలుగు రాష్ట్రాలపై తప్పకుండా ఉండనుంది. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంపై ఉండనుంది. ఈ ఏడాదిలో చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే తెలంగాణలో కాంగ్రెస్ మరింత ఊపును అందుకోనుంది. ఇటీవలే ప్రియాంకగాంధీ సరూర్‌నగర్ స్టేడియంలో హైదరాబాద్ డిక్లరేషన్ కూడా ప్రకటించి వెళ్లారు. బిజెపి కర్ణాటకలో ఫలితాలు ఎలా ఉన్న తెలంగాణను వదిలే ప్రసక్తే లేదన్నట్లుగా వ్యూహ రచన చేసుకుంటోంది. కర్ణాటకలో ఒకసారి ఒక రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తే రెండోసారి అదే పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం లేదు. ప్రస్తుతం అక్కడ బిజెపి అధికారంలో ఉండగా, ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ కర్ణాటకలో మకాం వేసి ఎన్నికల ప్రచారం చేశారు. కర్ణాటకలో స్థానిక బిజెపి నేతల పనితీరును చూడకుండా తన ముఖం చేసి బిజెపికి ఓటు వేయాలన్న విధంగా ప్రచారం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి నేతృత్వంలోని జనతాదళ్ ఎస్ పార్టీకి బిఆర్ఎస్ అధినేత,తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మద్దతు ఇస్తామని చెప్పినప్పటికీ కర్ణాటకకు వెళ్లి ప్రచారం చేయలేదు.

## ఒడిశా సిఎం నవీన్‌పట్నాయక్‌తో నితీశ్ భేటీ

**భువనేశ్వర్, మే 9:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మంగళవారం ఒడిషా ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధినేత నవీన్‌పట్నాయక్‌తో భేటీ కావడం ఊహాగానాలకు తావిస్తోంది. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసే కూటమిలోకి పట్నాయక్‌ను ఆహ్వానించేందుకే నితీశ్ వెళ్లినట్లుగా భావిస్తున్నారు. అయితే,వీరిద్దరి భేటీ అనంతరం నవీన్‌పట్నాయక్ మీడియాతో మాట్లాడ్తూ అలాంటిదేమీ లేదన్నారు. తమ మధ్య ఉన్న వ్యక్తిగత సంబంధాల గురించే ముచ్చటించామని నవీన్‌పట్నాయక్ అన్నారు. చాలాయేళ్లుగా తామిద్దరం మంచి మిత్రులమని ఆయన గుర్తు చేశారు. తమ మధ్య సంభాషణల్లో రాజకీయ పొత్తుల గురిం చిన ప్రస్తావన రాలేదన్నారు. నవీన్‌పట్నాయక్ మొదటినుంచీ కాంగ్రెస్, బిజెపికి సమదూరం పాటిస్తున్నారు. కేంద్రంలో ఎవరి ప్రభుత్వం ఉన్నా వారితో మైత్రీ సంబంధాలు కొనసాగించడం ఆనవాయితీగా చేస్తున్నారు. అయితే,నితీశ్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల వల్లే ఆయనతో చర్చించేందుకు నవీన్‌పట్నాయక్ ఆసక్తి చూపినట్లు భావిస్తున్నారు.

## త్వరలోనే రోబోటిక్స్ వినియోగంలో ఐదో స్థానానికి చేరుకోవాలి

స్టేట్ రోబోటిక్ ఫ్రేమ్ వర్క్‌ను ప్రారంభించిన మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** నూతన టెక్నాలజీలు అన్నింటిని అలవాటు చేసుకునే ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో రోబోటిక్స్ ఎకో సిస్టంను మెరుగుపరిచే లక్ష్యంతో మంగళవారం సాయంత్రం తెలంగాణ స్టేట్ రోబోటిక్ ఫ్రేమ్ వర్క్‌ను కెటిఆర్ టీ-హబ్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం సమాజంలో జరిగే చాలా సమస్యలను పరిష్కరించేందుకు రోబోటిక్స్ ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధిలో ఐటీ వినియోగం పెంచాలని, టెక్నాలజీని వాడాలని సూచించారు. రోబోటిక్స్ సాంకేతిత వేగంగా పెరుగుతోందని తెలిపారు. గత మూడు దశాబ్దాల్లో మూడు రెట్లు వాటి వినియోగం పెరిగిందని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం రోబోటిక్స్ వినియోగంలో పదో స్థానంలో ఉందని గుర్తు చేశారు. త్వరలోనే ఐదో స్థానానికి చేరుకోవాలని సూచించారు.

### ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన మీర్జా రహమత్‌బేగ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** నూతనంగా హైదరాబాద్ స్థానిక సంస్థల కోటాలో ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన మిర్జా రహమత్ బేగ్ మంగళవారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తన ఛాంబర్‌లో ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ వ్యవహారాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్, కార్వాన్ ఎమ్మెల్యే మొయినుద్దీన్, అసెంబ్లీ సెక్రటరీ డాక్టర్ వేదాంతం నరసింహాచార్యులు, టిఆరెసెల్పీ రమేశ్‌రెడ్డి, ఎంఐఎంఎల్పీ సెక్రటరీ షఫీ, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు. రహమత్ బేగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



కళా సుబ్బారావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త నోరి సుబ్రహ్మణ్యశాస్త్రికి అందించిన దృశ్యం

## కళాకారులకు ఆత్మీయులు కళా సుబ్బారావు

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 9, ప్రభాతవార్త:** రెండున్నర దశాబ్దాల క్రితం కళాసుబ్బారావు శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎందరో కళాకారులకు వేదిక ఇచ్చి ప్రోత్సహించి వారికి ఆత్మీయులుగా నేటికి గుర్తు చేసుకుంటున్నారని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన గానసభ నిర్వహణలో మూడు రోజుల పాటు జరిగే గానసభ వ్యవస్థాపకులు కళాసుబ్బారావు జయంతి సమావేశం ఆరంభమైంది. ముఖ్యఅతిథిగా మధుసూదనాచారి హాజరై సుబ్బారావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక సాహితీవేత్త నోటి సుబ్రహ్మణ్యశాస్త్రికి బహుకరించి ప్రసంగించారు. గానసభను జంటనగరాలలో కళావేదికగా రూపొందించి ప్రతిష్టను పెంచిన సుబ్బారావు సేవలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి ముందు రత్నమాల శిష్యబృందం ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కార్యక్రమం జరిగింది.

# హైదరాబాద్‌లో మళ్లీ ఉగ్రవాదుల కదలికలు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి ఉగ్ర కదలికలు వెలుగు చూడడం సంచలనం రేపింది. కొంత కాలంగా ఉగ్రవాద కదలికలు పెద్దగా లేని భాగ్య నగరంలో హిజ్బ్ ఉత్ తహరీర్ (హెచ్‌యుటి) అనే ఉగ్రవాద సంస్థ బలపడేందుకు పన్నిన కుట్రను కేంద్ర నిఘా వర్గాలు పసిగట్టడంతో ఐదుగురు ఉగ్రవాదులు దొ రికిపోయారు. ఒకవేళ కేంద్ర నిఘా వర్గాలకు దీనిపై సమాచారం అందడం ఆలస్యం అయివుంటే పరిస్థితి ఏమిటనే దానికి పోలీసులే సమాధానం చెప్పాలి. 2021 ఫిబ్ర వరిలో బిహార్‌లోని దర్భంగా రైల్వే స్టేషన్‌లో ఉగ్రవాదులు జరిపిన బాంబుదాడిలో పాల్గొన్న నిందితుల్లో ఇద్దరు హైదరాబాద్‌లో వుండగా ఎన్ఐఎ అధికారులు పట్టుకోవ డం అప్పట్లో సంచలనం రేపింది. అంతకు ముందు రెండుసార్లు ఐసిస్ ఉగ్రవాదులను ఎన్ఐఎ అధికారులు హైదరాబాద్‌లో పట్టుకున్నారు. తాజాగా హెచ్‌యుటి అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ఐదుగురు టెర్రరిస్టులు హైదరాబాద్‌లో దొరికిపోవడం మరింత సంచలనం రేపింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక మావోయిస్టులను కట్టడి చే సేందుకు వున్న ఎస్ఐబిని, ఉగ్రవాదులను నిర్మూలించేందుకు వున్న కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ (సిఐ సెల్)ను బలోపేతం చేయడం తెలిసిందే. అయితే మావోయిస్టులను కట్టడి చేయడంలో విజయం సాధించిన పోలీసులు ఉగ్రవాదుల విషయంలో ఆశించినంతగా ఫలితాలు అందుకోవడం లేదనే విమర్శలు వున్నాయి. హైదరాబాద్‌లో తల దాచు కుంటున్న ఉగ్రవాదుల గురించి ఇతర రాష్ట్రాల పోలీసులు లేదా ఎన్ఐఎ అధికారులు వచ్చి అరెస్టు చేసే వరకు ఇక్కడి పోలీసులకు సమాచారం లేక పోవడం పెద్ద వెలితిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

హైదరాబాద్‌ను ఉగ్రవాదులు మరోసారి టార్గెట్ చేశారు. వాస్తవానికి ఉగ్రవాదుల హిట్‌లిస్టులో హైదరాబాద్ చాలాకాలం క్రితమే చేరిందనేది అందరికి తెలిసిందే. మ క్కా మసీదులో బాంబు పేలుడు తరువాత లుంబినీ పార్క్, గోకుల్ చాట్‌లలో సంభవించిన జంట పేలుళ్లు దేశ వ్యాప్తంగా సంచలనం రేపాయి. అంతకు ముందు పలు మార్లు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేసే పలు ఉగ్రవాద సంస్థలకు చెందిన అనేక మంది ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో అనేక కుట్రలు వుండడం విశేషం. వీటిలో సికింద్రాబాద్ గణేష్ దేవాలయంతో పాటు మరికొన్ని చోట్ల ఉగ్రవాదులు ముంబాయి తరహాలో వరుస పేలుళ్లకు కుట్ర పన్నడం గమనార్హం. అయితే గడచిన దశాబ్ద కాలంగా హైదరాబాద్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలు పెద్దగా లేకున్నా కొన్ని సందర్భాలలో వెలుగుచూస్తున్న ఉగ్రవాద కుట్రలు ప్రజల్లో భయాందోళనలు రేపుతు న్నాయి. ఇందులో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఐసిస్ ఉగ్రవాదులు పలువురు పట్టుబడడం గురించి చెప్పుకోవాలి. ఎన్ఐఎ అధికారులు రెండుసార్లు ఐసిస్‌కు చెందిన ప లువురిని అరెస్టు చేశారు. వీరంతా బిహార్‌తో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో వరుస పేలుళ్లకు కుట్రలు పన్నారు. దీంతో పాటు హైదరాబాద్‌లో యువతను

**మొన్న ఐఎస్ఐ, నిన్న ఐసిస్, పిఎఫ్ఐ, నేడు హెచ్‌యుటి టెర్రరిస్టుల కదలికలు**

**పొరుగు రాష్ట్రాల పోలీసులు లేదా ఎన్ఐఎ అధికారులు అరెస్టు చేస్తే తప్ప ఇక్కడి పోలీసులకు అందని సమాచారం**

ఐసిస్‌లో చే ర్పించేందుకు వ్యూహాలు రచించారు. ఈ క్రమంలో అన్య మతస్తులు కూడా కొందరు ఐసిస్‌లో చేరారు. ఈ కుట్రలను ఎన్ఐఎ అధికారులు ఛేదించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇక ఇదే సమయంలో హైదరాబాద్‌కు చెందిన పలువురు యువకులు ఐసిస్‌లో చేరి సిరియా అంతర్యుద్ధంలో పాల్గొని మృత్యువాత పడ్డారు. హైదరాబాద్ నుం చి ఐసిస్‌లో చేరిన కొందరి జాడ ఇప్పటి వరకు తెలియరాలేదు. అయితే ఐసిస్ కార్యకలాపాలపై ఎన్ఐఎ కఠినంగా వుండడంతో ఆ సంస్థ కార్యకలాపాలు ప్రస్తుతం పెద్ద గా లేవనే చెప్పాలి. ఐసిస్ ఉగ్రవాదుల కార్యకలాపాలను నియంత్రించడంలో ఎన్ఐఎ అధికారులదే ప్రధాన పాత్రగా చెప్పాలి. దీని తరువాత 2021 ఫిబ్రవరి నెలలో బిహార్‌లోని దర్భంగా రైల్వే స్టేషన్‌లో జరిగిన పేలుడులో పాల్గొన్న నిందితుల్లో ఇద్దరు హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్‌లో ఏడాదిపాటు వస్త్రాల వ్యాపారుల ముసుగులో వుండడం సంచలనం రేపింది. వీరి ని అక్కడి పోలీసులు అరెస్టు చేసే వరకు ఇక్కడి పోలీసులకు కనీసం సమాచారం కూడా లేక పోవడం మరో వెలితిగా చెప్పాలి. దర్భంగా పేలుడు రెండేళ్ల క్రితం దేశ వా ృప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. దీని తరువాత నిజామాబాద్‌లో వెలుగు చూసిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) ఉగ్రవాద కార్యకలాపాలు కూడా రాష్ట్రంలో సంచలనం రేపాయి ఈ సంస్థ కార్యకలాపాల గురించి బిజెపి నాయకులు చెప్పే వరకు పోలీసులకు తెలియక పోవడం పెద్ద వెలితిగా చెప్పాలి. చివరకు బిజెపి నాయకులు దీనిపై ఆందోళనకు దిగి కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేశాక కానీ ఇక్క డి పోలీసులు ఆ సంస్థ ఉగ్రవాదులపై చర్యలు తీసుకోలేక పోయారు. ఈ సంస్థకు కాశ్మీర్‌తో పాటు పలు రాష్ట్రాలలో వున్న ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయని తేలడంతో దీనిపై విచారణకు ఎన్ఐఎ రంగంలో దిగింది. ఇక తాజా విషయానికి వస్తే హెచ్‌యుటి అనే ఉగ్రవాద సంస్థ హైదరాబాద్‌లో వేళ్లానుకునేందుకు ప్రయత్నాలు చేయసాగింది. ఈ సంస్థ ఐసిస్ తరహాలో ప్ర పంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లోనూ ఈ సంస్థ బలంగా వుంది. ఈ క్రమంలోనే భారత్ లో బలపడేందుకు హెచ్‌యుటి ప్రయత్నాలు చేయసాగింది. ఈ సంస్థకు చెందిన కొందరు ఉగ్రవాదులు హైదరాబాద్‌లో వివిధ రంగాల్లో మకాంవేసి అమాయకులను ఉ గ్రవాదం ఉచ్చులో లాగేందుకు కుట్రలు పన్నసాగారు. పట్టుబడ్డ ఐదుగురు ఉగ్రవాదుల్లో మహమ్మద్ సలీం అనే వైద్యుడు ఒక వైద్య కళాశాలలో కీలక విభాగానికి హెచ్ఓ డిగా వుండడం విశేషం. అబ్దుల్ రెహమాన్ అనే మరో ఉగ్రవాది మరో బడా సంస్థలో క్లౌడ్ ఇంజనీర్‌గా షేక్ జునైద్ అనే ఇంకో ఉగ్రవాది పాతబస్తీలో డెంటిస్ట్‌గా పని చేస్తున్నాడు. వీరితో పాటు దొరికిన మరో ఇద్దరు ఉగ్రవాదులు దినసరి కూలీలు. కాగా హెచ్‌యుటి కుట్రలను కేంద్ర నిఘా వర్గాలు సకాలంలో గుర్తించడంతో పెద్ద ము ప్పు తప్పిందని చెప్పాలి. రాష్ట్రంలో మరో ఐదారు నెలల్లో ఎన్నికలు రానుండడంతో ఈ సమయంలో ఉగ్రవాదుల కదలికలు వెలుగు చూడడం సంచలనం రేపింది. హె చ్‌యుటి ఉగ్రవాదులను పట్టుకోవడంలో తెలంగాణ పోలీసులతో పాటు మధ్యప్రదేశ్ పోలీసులు కూడా పాల్గొన్నా వీరి గురించి సమాచారం సేకరించిన కేంద్ర నిఘా వ ర్గాలకే ఇందులో కీలక పాత్రగా చెప్పాలి. మొత్తానికి హైదరాబాద్‌లో వెలుగు చూసిన మరో ఉగ్ర కుట్ర కేసులో రాష్ట్ర పోలీసు యంత్రాంగం పాత్ర కన్నా కేంద్ర నిఘా వ ర్గాలకే పెద్ద పీటగా మారింది. తాజా ఘటన నేపథ్యంలో ఉగ్రవాదుల విషయంలో సిఐ సెల్ మరిం అప్రమత్తం కావాల్సిన అవసరం వుందని చెప్పాల్సి వుంది.

## ఇద్దరి పిల్లలతో చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

భర్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**సత్తుపల్లి, మే 9, ప్రభాత వార్త:** ఇద్దరు చిన్నారులతో ఓ తల్లి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. సత్తుపల్లి సిఐ టి. కరుణాకర్, ఎస్ఐ బి. రాము తెలిపిన వివరాల ప్రకారం .... సత్తుపల్లి పట్టణంలోనే ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పాటిబండ్ల ప్రశాంత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అమెరికాలో విధులు నిర్వహిస్తూ స్థిరపడ్డారు. దాదాపు 12 సంవత్సరాల క్రితం దమ్మపేట గ్రామానికి చెందిన అడపా కృష్ణయ్య దంపతుల కుమార్తె మృధుల (38) ను ప్రశాంత్‌తో వివాహం జరిగింది. ఈమెకు ఇద్దరు పిల్లలు. ప్రజ్ఞాన్ (8), మహాన్ (5) కలరు. గత ఏడు సంవత్సరాల క్రితం అమెరికా నుంచి హైదరాబాదు వచ్చి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ అమెరికాలోవిధులు నిర్వహించే టప్పుడు సంపాధించిన ఆస్తులను ప్రశాంత్ బెట్టింగ్,, షేర్ మార్కెటింగ్, ఆన్‌లైన్ కాయిన్స్ వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆ ఆస్తులను క్రమంగా మొత్తం కాజేసినట్లు పోలీసులు తెలిపారు. ఇది కాకుండా వివాహ సమయంలో తల్లిదండ్రులు మృధులకు ఇచ్చిన బంగారాన్ని సైతం ఆరు నెలల క్రితం రూ. 6.50 లక్షలకు అమ్మి కాజేసినట్లు మృతురాలి హ్యాండ్ బాగ్‌లో లభ్యమైన రసీదులను బట్టి పోలీసులకు ఆధారాలు దొరికాయి. ఇదే కాకుండా అత్తమామలు దమ్మపేటలో ఇచ్చిన ఏడున్నర ఎకరాల భూమిని సైతం మృధుల పేరున రాసిచ్చారు. ఇట్టి భూమిని కూడా అమ్మమని భార్య మృధులను ప్రశాంత్ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నట్లు ఆమె పేపర్‌లో రాసి ఉంచిన చిట్టీ పోలీసులకు దొరికింది. రాత్రి 10. గంటల సమయంలో తన పిల్లలను ఇద్దరిని తీసుకొని పట్టణ శివారులో ఉన్న తామర చెరువు వద్దకు వెళ్లి తన దగ్గర ఉన్న సెల్‌ఫోన్, హ్యాండ్ బ్యాగ్‌ను చెరువు కట్టపై ఉంచి పెద్ద పిల్లాడు తన చున్నీతో కట్టుకొని, చిన్న పిల్లవాడు మహాన్‌ను చంకలో వేసుకొని తామర చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సెల్ ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు వేగవంతంగా ధర్యాప్తు చేయడంతో మంగళవారం ఉదయం తామర చెరువలో శవాలు పైకి రావడంతో మృత దేహాలను పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాలను బంధవులకు అప్పగించారు. మృతురాలి తండ్రి అడపా కృష్ణ ఫిర్యాదు మేరకు సీఐ టి. కరుణాకర్, ఎస్ఐ బి .రాము కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేపట్టారు.

# బ్యూటిఫుల్ మెలోడీయస్‌గా ఖుషీ సాంగ్



డాషింగ్ హీరో విజయ్ దేవరకొండ బర్త్‌డే స్పెషల్‌గా ఖుషీ మూవీ నుంచి ఓ బ్యూటిఫుల్ మెలో డియస్ సాంగ్‌ను విడుదల చేశారు.. శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందు తున్న ఈచిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మి స్తోంది.. ఇప్పటికే ఈచిత్రంపై భారీ అంచనాలున్నాయి.. వాటిని రెట్టింపు చేస్తూ విజయ్ దేవరకొండ బర్త్‌డే స్పెషల్‌గా సాంగ్ కన్పిస్తోంది.. హెషమ్ అబ్దుల్ వాహబ్ స్వరపరిచి ఈ పాటను తనే పాడారు.. ఈ గీతాన్ని దర్శ కుడు శివ నిర్వాణ రాయటం విశేషం... నా రోజా నువ్వే.. అంటూ పాట మొత్తం లో లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం సినిమాల పేర్లు కలిసి వచ్చేలా సాహిత్యం ఉండటం విశే షం.. నా కడలి కెరటంలో ఓమౌన రాగం,,, నువ్వేలే.. నీ అమృపు జడిలో ఓ ఘర్షణే మొదలైంది.. అంటూ మంచి సాహిత్యం కూడ ఈ పాటలో కన్పిస్తోంది.. ఏ సినిమా నుంచి అయినా మొదటి పాట వస్తోందంటే అది ఆ మూవీ ఫ్లేవర్‌ను తెలియజేస్తుంది. ఖుషి నుంచి వచ్చిన ఈ గీతం కూడ ఓ ప్లెజెంట్ లవ్‌స్టోరీని చూడబోతున్నాం అనేలా కన్పిస్తోంది.. శివ నిర్వాణే నృత్యరీతులు సమకూర్చిన ఈ గీతాన్ని కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో చిత్రీకరించారు.. సమంత ఓ కశ్మీరి యువతిగా కన్పిస్తోంది. తన ప్రేమను గెలుచుకునే యువకుడిగా విజయ్ నటిం చారు.. వీరి మధ్య కెమిస్ట్రీ అధ్భుతంగా కుదిరిందని పాటను చూస్తే తెలుస్తోంది.. ఫస్ట్ సాంగ్‌తోనే బెస్ట్ ఇంప్రెషన్ వేసిన ఖుషీ చిత్రాన్ని తెలుగుతోపాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాటు హిందీలోనూ సెప్టెంబర్ 1న విడుదల చేయబోతున్నారు.

# విజయ్ దేవరకొండ బర్త్‌డే కానుకగా విడి12 పోస్టర్



యువ సంచలనం విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్‌సినిమాస్‌తో కలిసి ఓచిత్రాన్ని రూపొందిస్తోంది.. విజయ్ దేవరకొండ కెరీర్‌లో12వ చిత్రంగా తెరకెక్కనునన ఈచిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ ,సాయిసౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మే3న సినీప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది.. కాగా మే 9న విజయ్ దేవరకొండ బర్త్‌డే సంద ర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఓప్రత్యేక పోస్టర్‌ను విడుదలచేశారు.. పోస్టర్ చాలాక్రియేటివ్‌గా ఉంది. పియానోని తలపిస్తూ పేర్చిన కాగితపు ముక్కలపై హీరో రూపం కన్పించటం ఆకట్టుకుంది.. హీరోకళ్లల్లో ఇంటెన్స్ కన్పిస్తోంది.. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా అద్భుతమైన చిత్రంగా అందిస్తామని యూనిట్ నమ్మకంగా చెబుతోంది.. ఈచిత్రంలో విజయ్ సరసన శ్రీలీల నాయికగా నటిస్తోంది. తన అందం, అభినయం నాట్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వరుస సినిమాలతోదూసుకుపోతున్న ఈ యువ తార తొలిసారిగా విజయ్‌తో జోడీగా నటిస్తోంది.. ఈసినిమా షూటింగ్ జూన్ నుంచి ప్రారంభం కానుంది.

**ప్రముఖ నిర్మాణ సంస్థ స్వప్న సినిమా నిర్మాణంలో నందినిరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం అన్నీ మంచి శకునములే.. సంతష్ శోభన్, మాళవిక నాయర్ ప్రధానపాత్రల్లో రూపొందించిన కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్.. మిత్ర విందా మూవీస్‌తో కలిసి ప్రియాంక దత్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచాలను పెంచేసింది.. మే 18న ఈచిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈనేపథ్యంలో ఈచిత్రంలో కీలకపాత్రలోనటించిన నటి వాసుకి మీడియాతో మాట్లాడింది.**



## కంఫర్ట్ జోన్ ఫీలయ్యా

**తొలిప్రేమ చేశాక దాదాపు 23 ఏళ్లు తర్వాత ఇపుడు ఈచిత్రంలో చేశారు కదా.. ఈ కథతోనే రావాలని ఎందుకు అన్పించింది?**

తొలిప్రేమ తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి..నాకు నచ్చిన అవకాశాలు కూడ వచ్చాయి. కానీ చేయం నాకు కుదరలేదు.. ఎందుకంటే నేను మల్టీ టాస్కర్‌కాదు.. అన్ని పనులు ఒకేసారి చేయలేను.. ముందు పిల్లలు, వాళ్ల చదవులు, ఇపుడు ఇద్దరు పిల్లలు యూకేలో చదువుకుంటు న్నారు. పాప మెడిసిన్ (ఫోర్త్ ఇయర్) బాబు సెకండ్ ఇయర్ ఆర్కి టెక్చర్.. ఆనంద్‌గారు ఆయన పనిలో బిజీగాఉంటారు. ఇపుడు ఏదైనా చేయ టానికి నాకు సమయం కుదిరింది.. ఇలాం టి సమయంలో నందినిరెడ్డిగారు ఈ కథతో వచ్చారు. నాకు నచ్చింది సినిమాతోపాటు చదువుపై కూడ దృష్టి పెట్టాను.. సైకాలజీలో పిహెచ్‌డి చేస్తున్నాను.

**ఇండస్ట్రీకి దూరం అయ్యారనే ఫీలింగ్ ఉండేదా?**

లేదండి.. ఇరవై మూడేళ్లుగాసినిమాలు చేయకపోయినప్పటికీ ఆనంద్‌గారి వలన ఏదో ఒక సినిమా గురించి ఇంట్ల చర్చ జరుగుతూనే ఉంటుంది.. అలాగే సినిమా చేసినపుడు కూడ నేను ఇండస్ట్రీ దగ్గర ఉన్నాననే ఫీలింగ్ లేదు (నవ్వుతూ)

**యాక్టింగ్ కెరీర్‌ను ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదు?**

యాక్టింగ్ కాదు. నేను దేన్ని సీరియస్‌గా తీసుకోను.. ఇదే మన దారి. ఇదే చేయాలని అనుకోను.. అది నా తత్వం.. కొంచెం ఫిలసాఫికల్‌గా వెళ్లిపోతాను.

**ఇంత విరామం తర్వాత ఇందులో పాత్ర చేయటానికి మిమ్మల్ని ఆకర్షించిన అంశాలు?**

ఒక విరామం తర్వాత మళ్లీ సినిమా చేస్తున్నామంటే మన కంఫర్ట్‌జోన్‌ముఖ్యం.. తొలిప్రేమ చేసినపుడు నాకు 18 ఏళ్లు.అపుడు డైలాగ్ రాకపోయినా తెలుగు రాకపోయినా , కొత్త స్థలమైనా ఏదైనా ఒక ధైర్యంతో ముందుకు వెళ్లిపోతాం.. ఈ ఏజ్‌లోరీఎంట్రీ చేయాలంటే మాత్రం ఒక సేఫ్ అండ్ కంఫర్ట్‌జోన్ చూస్తాం... స్వప్న ఎపుడూ సినిమా చేయమని అడుగుతుండేది.. ఫైనల్‌గా నాకు సినిమా చేయాటానికి వీలు కుదిరింది..

**ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

ఇందులో చాలా క్యూట్ సిస్టర్ పాత్రలో కన్పిస్తా.. అన్నీ ఫ్యామిలీస్‌లో ఉన్న సిస్టర్ క్యారెక్టరే.. తమ్ముడు ఏం చేసినా, సపోర్ట్ చేసే ఒక అక్క ఉంటుంది.. అలాంటి పాత్రే నాది.. సంతోష్ పాత్రకు చాలా మంచి బాండింగ్ ఉంటుంది.. ప్రేక్షకులు కచ్చితంగా కనెక్ట్ అవుతారు

**మీరు చాలా రోజుల తర్వాత సినిమాచేస్తున్నారంటే ప్రేక్షకులకు కచ్చితంగా అంచనాలు ఉంటాయి కదా.. తొలిప్రేమ ప్రభావం ఉంటుంది కదా?**

అంచనాలు గురించి నాకు తెలియదు.. కానీ తొలిప్రేమ అనేది సపరేట్ ఏరా (యుగం),, అందులో ఉనన కొన్ని అంశాలు ఇందులో ఉంటేనే ఈ పాత్రని అంగీకరించిఉంటాను.. ఆ పేరుని పాడుచేసుకోను కదా..తొలిప్రేమకు దగ్గరగాఈ పాత్ర కన్పించింది..

**యాదాద్రి నిర్మాణంలో ఆనంద్‌గారి పనితీరుకు చాలా మంచి పేరు వచ్చింది..ఇందులోమీ పాత్ర ఎలా ఉండేది?**

యాదాద్రి ప్రాజెక్టు ఆరంభం నుంచి చివరిదాకా నేను ఆయనతోనే ఉన్నాను. చిన్న కాగితంలో కొండను గీసి చూపించినప్పటి నుంచిసిఎం కెసిఆర్‌గారు ఆయనకి సన్మానం చేసిన రోజు వరకూ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి డెవలప్‌మెంట్ నాకు తెలుసు.. ఆయనప్రతిది చెప్పేవారు.. యాదాద్రి ప్రాజెక్టుచేయటం మాకు దొరికిన గొప్ప ప్రాప్తం.. అది చరిత్రలో నిలిచిపోతుంది..

**భవిష్యత్‌లో ఎలాంటి పాత్రలు చేయాలని అనుకుంటున్నారు?**

నాకు నచ్చే విధంగా ఉండాలి... నాకు నచ్చాలి.. ఒక మార్క్ క్రియేట్ చేసేలా ఉండాలి... అలాంటి పాత్రలే నాకు వస్తాయని భావిస్తున్నాను.



# గర్వంగా ఫీలవుతున్నా: శ్రియశరణ్

శర్మన్ జోషి, శ్రియాశరణ్, షాన్,సుహాసిని మూలే, ప్రకాష్‌రాజ్ తదితరులు ప్రధానపాత్రలోల నటించిన చిత్రం మ్యూజిక్ స్కూల్... ఇళయరాజా సంగీత సారధ్యం వహిస్తున్న ఈ మల్టీ లింగ్వల్ మ్యూజికల్ మూవీ ఈనెల 12న రిలీజ్‌కాబోతోంది.. ఈనేపథ్యంలో నాయిక శ్రియాశరణ్ మీడియాతో కాసేపు మాట్లాడారు.. ఇదొక అందమైన సినిమా అన్నారు. ఇళయరాజాగారితో వర్క్ చేయటం చాలా ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు, నిర్మాత పాపారావుగారుచాలా ప్యాషన్‌తో ఈసినిమానుచేశారన్నారు. నేటి తరంలో చదువు పేరుతోపిల్లలపై ఒత్తిడి తీసుకొచ్చి, వాళ్ల క్రియేటివిటీని చంపేస్తున్నారని అన్నారు. అయితే ఈ విషయాన్నిమంచి పాటలతో, ఆహ్లాదకరంగా చూపించబో తున్నామని తెలిపారు. ఇలాంటి సినిమాలో భాగమైనందుకు గర్వంగా ఉందన్నారు.

# 'చాంగురే బంగారురాజా' నుంచి పాట



మాస్ మహారాజ రవితేజ యువ ప్రతిభావంతులైన ఫిల్మ్ మేకర్స్‌తో కంటెంట్‌రిచ్ సినిమాలను తీయ టానికి ఆర్టీ టీమ్ వర్క్స్‌ను స్థాపించారు. లేటెస్ట్ ప్రొడక్షన్ చాంగురే బంగారు రాజా..ప్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి రవితేజ నిర్మిస్తు న్నారు. ఈచిత్రానికి సతీష్ వర్మ దర్శకత్వం వహిస్తు న్నారు. శ్వేత కాకర్లపూడి, షాలిని నంబు ఈచిత్రానిక క్రియేటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహ రిస్తున్నా రు.. ఈచిత్రంలో కార్తీక్ రత్నం హీరోగా, గోల్డీ విస్సీ హీరోయిన్‌గా నటిస్తోంది.. రవిబాబు, సత్య ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. టీజర్‌కు మంచి స్పందన వచిచంది. తాజాగా ఈచిత్రం ఫస్ట్ సింగిల్ సామిరంగా.. పాటను విడుదల చేశారు.. కృష్ణసౌరభ్ క్యాచీ ట్యూన్‌గా కంపోజ్‌చేశారు.. ఈచిత్రం కోసం సతీష్ వర్మ కామెడీ ఎంటర్ టైనర్‌లో ఫ్రెష్‌క్రైమ్ జానర్‌ను ఎంచు కున్నారు. ఈచిత్రం విడుదలకు రెడీ అవుతోంది.

# కథ వెనుక కథ.. రిలీజ్‌కు రెడీ



కొత్త కాన్సెప్ట్ చిత్రాలను అందిస్తూ న్యూటాలెంట్‌ను ఎంకరేజ్ చేయ టానికి ప్రారంభమైన నిర్మాణ సంస్థ దండమూడి బాక్సాఫీసు.. ఈ బ్యానర్‌పై రూపొందిన తొలి చిత్రం ' కథ వెనుక కథ'.. విశ్వంత్ దుద్దుంపూడి, శ్రీజిత గౌష్, శుభ శ్రీ ప్రధాన తారాగణంగా నటించారు. కృష్ణచైతన్య దర్శకత్వంలో రూపొందిన ఈచిత్రానికి అవనీంద్ర కుమార్ నిర్మించారు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో రూపొందిన ఈమూవీని మే 12న విడుదల చేస్తున్నారు. ఈసం దర్భంగా చిత్ర నిర్మాత అవనీంద్ర కుమార్ మాట్లాడారు.. కథ వెనుక కథ సినిమాను మే12న విడుదల చేస్తున్నామని తెలిపారు. మా సాయి సినిమాను ముందుండి నడిపించారని అన్నారు. సినిమా చాలా బాగా వచ్చింది.. సీట్ ఎడ్జ్ మూమెంట్స్ తో ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుందన్నారు. హీరో విశ్వంత్ దుద్దుంపూడి, శ్రీజిత గౌష్, శుభశ్రీ సహా నటీనటులు, టెక్నీ షియన్లకు థాంక్స్ అన్నారు.. ఎగ్జిక్యూ టివ్ ప్రొడ్యూసర్ గొట్టిపాటి సాయి మాట్లాడుతూ ఇండస్ట్రీ లోకి వచ్చి 30ఏళ్లు అయ్యిందని, 80కిపైగా చిత్రాలు చేశానని అన్నారు.. మే 12న వస్తున్న ఈచిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నానని అన్నారు.

# విజువల్ ఫీస్ట్‌లా 'ఆదిపురుష్' ట్రైలర్

ప్యాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్,కృతిసనోన్ సీతారాములుగా నటించిన సినిమా ఆదిపురుష్...సైఫ్ ఆలీఖాన్, సన్నీసింగ్, దేవదత్త వాగే, వత్సల్ సేన్, సోనాల్ చౌహాన్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రమిది.. ఓంరౌత్ దర్శకత్వం వహిస్తున్నారు.. ఈ మూవీ ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు.అంచనాలకు భిన్నంగా ట్రైలర్ ఈ సారి అద్భుతం అనే టాక్ తెచ్చుకుంటోంది.. ఎఎంబి మాల్‌లోజరిగిన ట్రైలర్ ప్రివ్యూ కు మూవీ టీం హాజరైంది.. ట్రైలర్ విజువల్ వండర్‌గా ఉంది.. హనుమంతుడి కోణంలోసాగే కథలా ఈ ట్రైలర్ ఆరంభంలోనే కన్పిస్తోంది.. ఇదే నా రాముడి కథ..



ఆయన మనిషిగా పుట్టిన భగవంతుడైన మహనీయుడు. ఆయన జీవితం ధర్మానికి, సన్మార్గానికి నిదర్శనం.. ఆయన నామం రాఘవ.. ఆయన ధర్మం, అధర్మానికి ఉన్న అహంకారాన్ని అంతం చేసింది.. ట్రైలర్‌ను బట్టిచూస్తే ఆదిపురుష్ రామాయణ కావ్యం మొత్తం కాకుండా కేవలం సీతా పహరణం ఎపిసోడ్‌ను మాత్రమే చూపించేలా కన్పిస్తోంది.. చివర్లో వచ్చిన రామ, రావణ యుద్ధానికి నేటి ఆధునిక టెక్నాలజీని జోడించినట్టు కన్పిస్తోంది.. ఇది సినిమాకు ప్రధాన బలంగా ఉండే అవకాశం ఉంది.. విజువల్స్ పరంగా సింప్లీ సూపర్బ్‌గా ఉన్నాయి.. మొదట్లో వచ్చిన విమర్శలకు ధీటైన జవాబుగావిజువల్ ఎఫెక్ట్స్ , గ్రాఫిక్స్ కన్పిస్తున్నాయి.. రాముడు ప్రభాస్, సీతగా కృతిసనోన్ జోడీ బాగుంది.. ఈఏడాది మోస్ట్ అవెయిటెడ్ మూవీగా ఉన్న ఈచిత్రం జూన్16న ప్రపంచ వ్యాప్తంగా రాబోతోంది.

**అక్కినేని నాగచైతన్య, వెంకట్ ప్రభు తెలుగు,. తమిళ చిత్రం కస్టడీ.. కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై శ్రీనివాస చిట్టూరి ఈచిత్రాన్నినిర్మిస్తున్నారు.. పవన్‌కుమార్ సమర్పిసుతన్నారు.. మే 12న ఈచిత్రం విడుదల సందర్భంగా దర్శకుడు వెంకట్ ప్రభు మీడియాతో మాట్లాడారు.**



## ఆడియెన్స్ ఎక్సయిట్ అవుతారు

**కస్టడీ జర్నీ ఎలా స్టార్ట్ అయ్యింది?**

కోవిడ్ సమయంలో ఈ కథ ఆలోచన వచ్చింది.. అపుడే రాసుకున్నా.. ఈ కథ ఆలోచనకు స్ఫూర్తి మలయాళం సినిమా నయట్టు.. అయితే అందులో కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండవు.. తెలుగు తమిళ ప్రేక్షకుల కోసం చేసినపుడు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉండాలి.. పెద్ద ఆశయాతో ఉన్న ఒక సాధారణ కానిస్టేబుల్‌కథ చెప్పాలనేది ఆలోచన.. అలా రాయటం స్టార్ట్‌చేశాను.. అలా కస్టడీ పుట్టింది.. లవ్‌స్టోరీ లో ఒక పాట చూశాను.. అందులో నాగచైతన్య ఈ పాత్రకు సరిపోతాడని అన్పించింది.. నాగ చైతన్య కు కథచెప్పా... ఆయనకు నచ్చింది. అలాగే నిర్మాత శ్రీనివాసగారు జాయిన్ అయ్యారు.. ఆయనకు ఎప్పటి నుంచో తానుసినిమా చేయాలని ఉంది. అలా జర్నీ మొదలైంది.

**కస్టడీలో ప్రేమకథ ఉంటుందా?**

శివ ఒక చిన్న టౌన్ నుంచి వచ్చిన కానిస్టేబుల్.. తనకు కుటుంబం ఉంటుంది.అలాగే ప్రేమగా కూడ ఉంటుంది.. సినిమా శివకి వచ్చిన సమస్యతో మొదలౌతుంది.. తనది కాని సమస్యను తను ఎదుర్కొవాల్సి వస్తుంది.. ప్రీ ఇంటర్వెల్ నుంచి క్లైమాక్స్ వరకు సినిమా ఎడ్జ్ ఆఫ్ సీట్ థ్రిల్లర్‌గా ఉంటుంది.. తెలుగు, తమిళ ఆడియెన్స్ అభిరుచికి తగ్గట్టుగా ఈచిత్రాన్ని రూపొందించాం.. ఇది యూనివర్సల్ సబ్జెక్టు.. అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది.స్క్రీన్‌ప్లే ఫాస్ట్ ఫీస్ట్‌గా ఉంటుంది.

**నాగ చైతన్య నటన గురించి?**

నాగచైతన్య అద్భుతమైన నటుడు. ఈచిత్రంలో కొత్త చై..ని చూస్తారు. నాసినిమాల్లో హీరోలని డిఫరెంట్‌గా చూపించటానికి ఇష్టపడతాను.. ఇందులో కూడ చై .చాలా కొత్తగాకన్పిస్తారు.. యాక్షన్‌ఉ చాలా యూనిక్‌గా డిజైన్ చేశాం.. అన్నీ ఫ్రెష్‌గా ఉంటాయి.

**కృతిశెట్టి పాత్ర గురించి?**

ఇందులో కృతి పేరు రేవతి... చాలా అద్భుతంగా చేసింది..తన పాత్ర కథలోకీలకంగా ఉంటుంది.నేను రాసుకున్న పాత్రకు తగ్గట్టుగా స్క్రీన్‌పై కన్పించింది..

**కొత్త ప్రాజెక్టుల గురించి?**

ఒక పెద్ద ప్రాజెక్టు ఉంటుంది.త్వరలోనే చెబుతాను.

# 'చత్రపతి'తో హిందీలో శ్రీనివాస్ బెల్లంకొండ స్టార్ అవుతాడు...

డైనమిక్ హీరో శ్రీనివాస్ బెల్లంకొండ, స్టార్ డైరక్టర్ వివి వినాయక్ దర్శకత్వంలోప్రముఖ నిర్మాణ సంస్థ పెన్ స్టూడియోస్‌లోరూపొందుతున్న చిత్రపతి తోబాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు.. రాజమౌళి బ్లాక్‌బస్టర్ చత్రపతికి రీమేక్‌గా అదే టైటిల్‌తోఈచిత్రాన్ని హిందీలోతెరకెక్కించారు.. ఈనెల 12న ఈచిత్రం విడుదల కానుంది. తాజాగా యూనిట్‌మీడియాతో మాట్లాడింది.. దర్శకుడు వివి వినాయక్ మాట్లాడారు.. మంచి కథను అందించిన విజయేంద్ర ప్రసాద్‌గారికి కృతజ్ఞతలు అన్నారు.



రాజమౌళిగారు చత్రపతిని అద్భుతంగా తీశారన్నారు.. వారు చేసిన దాన్ని పాడుచేయకుండా ఐకానిక్ సీన్స్ షాట్‌స ఏమీ మార్చకుండా చాలా జాగ్రత్తగా చేశామన్నారు. ఏదన్నాచిన్నమార్పు ఉన్నా ప్రసాద్‌గారితో మాట్లాడి చాలాజాగ్రత్తగా చేశామని తెలిపారు.. సాయి సినిమాలన్నీ నార్త్‌లో బాగా ఆడాయని, ఆ నమ్మకంతో పెన్‌స్టూడియోస గడా గారు ఈసినిమా చేశారన్నారు.. బెల్లంకొండ సురేష్‌గారు మాకు బ్యాన్‌బోన్ అన్నారు.. ఈచిత్రంతో సాయిచాలా పెద్ద హీరోగా హిందీలోనిల బడతాడని అన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్ మాట్లాడుతూ, అరవై కోట్లుతో పెన్ స్టూడియోస్ లాంటి నిర్మాణ సంస్థ మా అబ్బాయితో సినిమా చేయటం తండ్రిగా నేను ఎంతో గర్వపడే విషయం అన్నారు. నార్త్‌లో చాలా అద్భుతంగా ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. కచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారని అన్నారు.

## మందారంతో హెయిర్ ప్యాక్స్



జుట్టు ఆరోగ్యం కోసం కొబ్బరినూనె వాడుతుంటాం. అయితే మందార పూలతో చేసే ప్యాక్‌లు కురుల్ని బలంగా చేస్తాయి. వారానికోసారి అయినా, జుట్టు కోసం మనకు అందుబాటులో ఉండే మందారాలతో హెయిర్ ఫ్యాక్స్ తయారుచేసుకోవచ్చు. మందారం ప్యాక్స్‌తో జుట్టు మరింత ఆరోగ్యకరంగా ఉంటుంది.

- సూర్యకాంతిలో ఎండబెట్టిన పది మందారం పూలను తీసుకోవాలి. కొంచెం కొబ్బరి నూనెను గోరు వెచ్చగా వేడి చేసి అందులో పూలను వేయాలి. వీటికి మెంతులు జతచేసి మిక్స్ చేయాలి. రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటి రోజు ఉదయాన్నే ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల ఆయుదం నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు కదుళ్లకు తగిలేట్లు పట్టించాలి దీనివల్ల జుట్టు పెరుగుతుంది.
- రెండు మందారాలు, ఏడు మందారం ఆకులను గ్రైండ్ చేసుకోవాలి. ఆ పేస్ట్‌లోకి గోరు వెచ్చగా కాచిన మూడు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె వేయాలి. దీనికి మూడు టేబుల్‌స్పూన్ల ఉసిరిపొడిని జతచేయాలి. ఈ మిశ్రమాన్ని పట్టిస్తే జుట్టు మృదువుగా తయారవుతుంది. జుట్టులో ఇన్‌ఫెక్షన్స్, చుండ్రు ఉన్నా తొలగిపోతాయి
- టేబుల్ స్పూన్ మెంతుల్ని మంచి నీళ్లలో నానబెట్టాలి. ఉదయాన్నే ల ేచాక పది మందారం పూలతో కలిపి మెంతులనూ పేస్ట్‌చేయాలి అందులోకి అరకప్పు మజ్జిగ వేసి ఆ పేస్ట్‌ను జుట్టుకు పట్టించుకుంటే. జుట్టురాలే సమస్య తగ్గిపోతుంది.
- పదిహేను మందార పూలను పేస్ట్ చేసి అందులోకి అరకప్పు గోరింటాకు పొడి, కాసింత పెరుగు కలపాలి. ఆ మిశ్రమాన్ని జట్టుకు పట్టించాలి. ఇలా చేయడం వల్ల తెల్ల వెంట్రుకలు రాకుండా నివారించొచ్చు. ❑

## మహిళలు వ్యాపారంలో రాణించాలంటే..

ఇంటి అలంకరణ వస్తువులంటే మన కంటికి ఇంపుగా కనిపించడమే కాదు.. ఇంటికీ సరికొత్త హంగులద్దాలి.. అలాంటి ఇంటీరియర్స్‌కి హస్తకళలతో హంగులద్ది ఎంతోమంది వినియోగదారుల్ని ఆకట్టుకుంటున్నారు కోల్‌కతాకు చెందిన అదితి ముర్కా. ప్రయాణాలంటే మక్కువ చూపే ఆమె. తాను వెళ్లిన ప్రదేశానికి చెందిన ప్రత్యేకతను ఇట్టే పసిగడతారు. ఆసియా వ్యాప్తంగా వివిధ దేశాల్లో పర్యటించిన ఆమె.. అక్కడి హస్తకళా నైపుణ్యాలకు ముగ్ధులయ్యారు. ఈ ఆలోచనతోనే ఈశాన్య రాష్ట్రాల్లోని హస్తకళలకు ఇంటీరియర్స్ రూపంలో జీవం పోస్తున్నారామె. కిచెన్ నుంచి డైనింగ్ దాకా.. ఫర్నిషింగ్ నుంచి హోమ్ ఆక్సెసరీస్ దాకా తన క్రియేటివిటీకి పదునుపెడుతూ, హస్తకళా నైపుణ్యాలను జత చేస్తూ ఆకర్షణీయమైన ఇంటీరియర్ ఉత్పత్తుల్ని తయారుచేస్తోంది. మహిళలు వ్యాపారంలో రాణించాలి అంటున్న అధితి వ్యాపార ప్రయాణం గురించి తెలుసుకుందాం..



కోల్‌కతాకు చెందిన అదితి.. వృత్తిరీత్యా తన భర్తతో కలిసి సింగపూర్‌లో స్థిరపడ్డారు. ఆమెకు ప్రయాణాలంటే మక్కువ. ఈ క్రమంలో ఉద్యోగం నుంచి విరామం దొరికిన ప్రతిసారీ తన భర్తతో కలిసి కంబోడియా, వియత్నాం, ఇండోనేషియా, మలేషియా, థాయ్‌ల్యాండ్, ఫిలిప్పీన్స్.. వంటి దేశాల్ని సందర్శించేవారామె.

**ఆ కళల స్ఫూర్తితో..** చాలామంది ప్రయాణాలంటే సరదా కోసమే చేస్తుంటారు. కానీ అదితికి తాను వెళ్లిన చోట్లలో ఉన్న ప్రత్యేకతల్ని పసిగట్టడం అలవాటు. ఈ క్రమంలోనే తాను పర్యటించిన ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేకమైన హస్తకళలు క్రాఫ్ట్స్.. వంటి చేతి వృత్తులు ఆమెను ఆకట్టుకున్నాయి. ఇవి చూసినప్పుడు ఈశాన్య రాష్ట్రాల్లోని చేతి వృత్తి నైపుణ్యాలే తన మదిలో మెదిలాయని చెబుతోందామె. 'నేను సింగపూర్‌లో ఓ ఫ్యాషన్ సంస్థతో కలిసి పనిచేస్తున్నప్పుడు.. అక్కడి హస్తకళా నైపుణ్యాల గురించి నాకు పూర్తి అవగాహన ఏర్పడింది. అయితే నాకు ఇంటీరియర్ వ్యాపారం ప్రారంభించాలన్న ఆలోచన ఎప్పట్నుంచో ఉంది. దీనికి ఈశాన్య రాష్ట్రాల్లోని హస్తకళల్ని జోడిస్తే ఎక్కువమంది వినియోగదారుల్ని ఆకట్టుకోవచ్చనిపించింది. ఆ ఆలోచనే 2019లో 'నెస్టేషియా' అనే సంస్థకు బీజం వేసింది. నా భర్త అనురాగ్‌తో కలిసి అదే ఏడాది నా వెంచర్‌ని ప్రారంభించా.. అంటూ చెప్పుకొచ్చింది అదితి.

**పదివేలకు పైగానే..** ఇంటి అలంకరణలో భాగంగా తాము తయారుచేసే ప్రతి వస్తువూ ఇంటికి ప్రత్యేకంగా మార్చేయాలన్న లక్ష్యం తోనే రూపొందిస్తున్నాంటున్నారు అదితి. 'మేక్ హోమ్ స్పెషల్ అనేది మా సంస్థ నినాదం. అంటే. మేం తయారుచేసే ప్రతి వస్తువూ ఇంటికి ప్రత్యేకంగా మార్చేయాలనేది దీని వెనకున్న ముఖ్యోద్దేశం. ఈ క్రమంలో డైనింగ్, కిచెన్, డెకార్ పీసెస్, ఫర్నిషింగ్ వస్తువులు బాత్‌రూమ్ యాక్సెసరీస్ వంటివి తొలుత అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇందులో భాగంగా ఆయా వస్తువులపై హ్యాండ్‌ప్రింటెడ్, హ్యాండ్ క్రాఫ్ట్స్ డిజైన్స్‌తో హంగులద్దాం. ఇక వీటితో పాటు సోఫా-బెడ్‌కు అందాన్నిచ్చే కుషన్స్, రగ్గులు.. వంటివీవిభిన్న హ్యాండ్ వర్క్, ఎంబ్రాయిడరీ, బొహో స్టైల్స్‌తో డిజైన్ చేసినవి. చేనేత-జ్యూట్.. వంటి మెటీరియల్‌తో తయారుచేసినవి మా వద్ద లభ్యమవుతున్నాయి. ఇక సంస్థను విస్తరించే క్రమంలో ఇలాంటి ఇంటీరియర్స్‌తో పాటు ఫ్యాషనబుల్ బ్యాగ్స్, బ్యూటీ యాక్సెసరీస్, గిఫ్ట్ బాక్సులు, ఇతర స్టేషనరీ ఐటమ్స్‌ని కూడా మా సంస్థలో భాగం చేశాం. ఇలా ఇప్పటివరకు సుమారు పది వేలకు పైగా విభిన్నమైన, ప్రత్యేకమైన అలంకరణ వస్తువుల్ని, ఇతర యాక్సెసరీస్‌ని అందుబాటులోకి తీసుకొచ్చాం. అలాగే వినియోగదారుల అభిరుచుల్ని బట్టి ఆయా ఇంటి అలంకరణ వస్తువుల్ని తయారుచేస్తున్నా. అంటున్నారీ బిజినెస్ ఉమెన్.





**తయారీ నుంచి ప్యాకింగ్ దాకా ...** తమ అలంకరణ వస్తువులతో ఆకట్టుకోవడమే కాదు.. వాటి తయారీ నుంచి ప్యాకింగ్ దాకా.. ప్రతి దశలోనూ పర్యావరణహితమైన ముడి సరుకుల్నే వాడుతున్నామంటున్నారు అదితి. వీటి తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలన్నీ స్థానికంగా దొరికే సహజసిద్ధమైన మెటీరియల్‌నే ఎంచుకుంటున్నాం. అలాగే ప్యాకింగ్ విషయంలోనూ సహజ సూత్రాన్నే పాటిస్తున్నాం. ఈ క్రమంలో కాటన్-కార్డ్‌బోర్డ్ తుక్కు రీసైక్లింగ్ చేసి తయారుచేసిన బాక్సుల్లో.. ఉత్పత్తుల్ని ఆకర్షణీయంగా ప్యాక్ చేసి వినియోగదారులకు అందిస్తున్నాం. ఇక ఆయా చేతి వృత్తి కళాకారులకు సమకాలీన డిజైన్లు. అంశాల్లో నైపుణ్యాలు పెంచడానికి మా బృందం ప్రత్యేక శిక్షణ తరగతులు సైతం నిర్వహిస్తోంది. అంటోన్న ఈ బిజినెస్ లేడీ.. మహిళలు వ్యాపారంలో రాణించాలంటే తమలో ఉన్న భయాల్ని సందేహాల్ని తరిమేయాలంటున్నారు. ❑

## రాజీనామా చేసేముందు జాగ్రత్తలు..

చేసుకోబోయే వారికి నచ్చలేదనో.. కుటుంబం, ఆఫీసు రెండు బాధ్యతలతో సతమతమవుతున్నామనో, పిల్లలను చూసుకోవాలనో.. సాధారణంగా మనం ఉద్యోగాలకు దూరమవుతుంటాం. కారణమేదైనా.. రాజీనామా చేసేముందు ఈ అంశాలను మాత్రం ఓ సారి పరిశీలించుకోండి.

- రాజీనామాకు కారణం.. భర్తకు నచ్చపోవడం అనుకుందాం. మరి అప్పటి దాకా చదివిన చదువు, కెరియర్, సాధించిన నైపుణ్యాలు.. అన్నీ పక్కన పెట్టేయడం సబబేనా అని ఆలోచించుకోండి. ఉద్యోగమంటే అన్నిసార్లూ సంపాదన కోసమే కాదు. మీకంటూ లక్ష్యాలుంటే వాటిని వివరంగా చెప్పండి. ఏమో! మీ అభిప్రాయం విన్నాక వాళ్లే మనసు మార్చుకోవచ్చు. పిల్లల విషయంలోనూ ప్రత్యామ్నాయాలు దొరుకుతాయేమో ఆలోచించండి.
- ఆఫీసు వాతావరణం నచ్చకా ఈ నిర్ణయం తీసుకునేవారు ఇక కొనసాగే ప్రసక్తే లేదు అంటారా! మరి తర్వాతేంటి? ఆలోచించుకున్నారా! అప్పటిదాకా వృత్తిపనితో నిండిపోయే సమయం మిగిలిపోతుంది. కొద్దిరోజులు విశ్రాంతి తీసుకున్నా. తర్వాత ఏమీ తోయకపోవచ్చు. పైగా నెలనెలా కొంత డబ్బు చేతికొస్తుంది. అది రాకపోయినా ఫర్లేదా అన్నదీ ఆలోచించుకోవాలి.
- ఉద్యోగమున్నప్పుడు మీకంటూ డబ్బులుంటాయి. ఇంట్లో వాళ్లకి ఇచ్చినా.. సరదా ఖర్చులు చేసుకున్నా అడ్డు ఉండకపోవచ్చు. కానీ ఆపై అది కొనసాగకపోవచ్చు. ఇంకా.. తర్వాత తిరిగి మీరు చేరాలనుకున్నా.. అప్పుడు అవకాశం దొరక్కపోవచ్చు. కాబట్టి, మీ పైవాళ్లు ముఖ్యంగా మిమ్మల్ని అర్థం చేసుకుంటారన్న వాళ్లతో మాట్లాడండి. పరిష్కారం దొరకొచ్చు. ఒక్కోసారి వాళ్లే ప్రత్యామ్నాయ మార్గాలూ సూచించొచ్చు. వీలైతే దీర్ఘకాలిక సెలవు తీసుకోండి. ప్రశాంతంగా ఆలోచించి ఆపైనా అలాగే అనిపిస్తేనే.. అప్పుడు రాజీనామా పత్రం ఇవ్వండి. ❑




చాలామందికి అదే కారణమైతే. వేరే ఉద్యోగం చూసుకున్నాకే రాజీనామా గురించి ఆలోచించండి. ఇక్కడ మీరు గుర్తించాల్సిన విషయమేమిటంటే. వేరే చోటా ఇలాంటి పరిస్థితి ఉండొచ్చు. అప్పుడే చేస్తారు? కాబట్టి, పైవాళ్ల ద్వారానో, హెచ్‌ఆర్ విభాగం ద్వారానో సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నించండి. అప్పటికీ ఫలితం లేకపోతే ఉద్యోగం వదలడం గురించి ఆలోచించండి. ప్రయత్నం మాత్రం తప్పనిసరి.

### చెలి చిట్కా

ప్లాస్టిక్ వస్తువులకు అంటిన నూనె మరకలు వదలాటంటే వంటసోడాలో నీళ్లు కలిపి ఆ మిశ్రమంతో రుద్ది కడిగితే సరి. ❑

## వేసవిలో శక్తినిచ్చే పానీయాలు

మండే ఎండల నుంచి మనల్ని మనం కాపాడ ుకోవడానికి బోలెడు సహజ సిద్ధమార్గాలున్నాయి. అందులో ఒకటి చల్లటి పానీయాలు తీసుకోవడం. ఇవి దాహార్తి తీర్చడంతో పాటు శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూస్తాయి. అందరికీ అందు బాటులో ఉంటే ఆ రసాలు/పానీయాలు ఏంటో చూద్దామా..



### ఆమ్ పన్నా...

మామిడికాయను ఉడికించి ఆ రసంలో చల్లటి నీళ్లను కలిపి కాస్తంత జీలకర్ర పొడి, ఉప్పు వేసి దీన్ని తయారు చేసుకోవాలి. ఇది శరీరానికి చలువ చేస్తుంది. కావాలనుకుంటే చక్కెర వేసుకోవచ్చు. దీంట్లో బోలెడు ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. ఇవి తక్షణ శక్తిని అందిస్తాయి.

### వెలగపండు జ్యూస్..

**ఈ పండు** గుజ్జులో విత్తనాలను తీసేయాలి. ఇందులో చల్లని నీళ్లు పోసి చేత్తో రసం తీయాలి లేదా మిక్సీ పట్టాలి. ఈ రసాన్ని వడకట్టుకోవాలి. ఇప్పుడు మరికొన్న నీళ్లు కలిపి చిక్కటి ద్రవంలా చేసుకోవాలి. కావాలనుకుంటే చక్కెర వేసుకోవచ్చు. ఎందుకంటే ఇది సహజంగానే తియ్యగా ఉంటుంది. ఇప్పుడు దీన్ని ఓ పెద్ద పాత్రలో పోసి, ఐసు ముక్కలు, పుదీనా ఆకులు వేసి మరికొన్ని నీళ్లు కలిపి గ్లాసుల్లో పోసి సర్వ్ చేసుకుంటే తియ్యతియ్యటి పోషకాల వెలగపండు జ్యూస్ రెడీ. పండు అందుబాటులో లేకపోతే దీని సిరప్ బజారులో దొరుకుతుంది. ఈ సిరప్‌ను చల్లని నీళ్లలో తీసుకుంటే చాలు.





ఇది శరీరానికి చాలా మేలు చేస్తుంది. వీటతోపాటు నిమ్మరసం నీళ్లు, కొబ్బరినీళ్లు, ఓఆర్‌ఎస్ ద్రావణం.. ఇవీ మేలు చేసేవే.

### సత్తు డ్రింక్..

ఇదొక చల్లటి సంపూర్ణ పానీయం. దీంట్లో ప్రొటీన్లు, క్యాల్షియం, ఐరన్ దండిగా ఉంటాయి. రోజూ ఈ పానీయాన్ని తాగితే ఉత్సాహంగా ఉంటారు. వేయించిన శనగల పిండినే సత్తుగా పిలుస్తాయి. గ్లాసు నీటిలో రెండు చెంచాల సత్తు పిండి, చెంచా చక్కెర, రెండు చిటికెల జీలకర్ర పొడి వేసి, కొద్దిగా నిమ్మరసం పిండి, తగినన్ని నీళ్లు పోసి బాగా కలపాలి. అంతే సత్తు డ్రింక్ సిద్ధం. దీంట్లో పుదీనా ఆకులు వేసి తాగితే ఆహా అనకుండా ఉండలేరు. దీన్ని తీపిగా కాకుండా ఉప్పు వేసి కూడా చేసుకోవచ్చు. అధిక వేడిమి నుంచి ఈ జ్యూస్ చల్లదనాన్ని అందిస్తుంది. తాగితే రోజంతా శరీరం తాజాగా ఉంటుంది. ఇది ఆకలిని కూడా కలిగిస్తుంది.



**మజ్జిగ..** దీంట్లో ప్రొటీన్లు, క్యాల్షియం, విటమిన్ బి12 మెండుగా ఉంటాయి. కప్పు పెరుగులో రెండు కప్పుల నీళ్లు పోసి తగినంత జీలకర్ర పొడి, నల్లుప్పు, చిటికెడు ఉప్పు వేసి బాగా గిలక్కొట్టి తాగితే సరి. రుచికరమైన మజ్జిగ సిద్ధం. దీని నతచూతాగుతూ ఉంటే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. శక్తి కోల్పోకుండా ఉంటారు. ❑

## ఎండల్లో మెరిసే..

ఎండలు బాగా పెరిగి పోయాయి కదా! బయటకు వెళ్లొచ్చా మంటే వేడిక చర్మం నల్లబడటం, మెరుపును కోల్పోవడం, చెమట కారణంగా అలర్జీలు.. ఎన్ని సమస్యలో! ఈ పూతలను వేయండి.. వాటి నుంచి తప్పించుకోవచ్చు.

- రెండు చెంచాల చొప్పున గులాబీ రేకల పొడి, గంధం తీసుకొని, వాటికి తగినన్ని రోజ్‌వాటర్, పావు స్పూను తేనె, చిటికెడు పసుపు చేర్చాలి. వీటిని బాగా కలిపి ముఖానికి మెడకీ పట్టించి, 15 నిమిషాలయ్యాక కడిగేయండి. ముఖం చక్కగా, మృదువుగా తయారవుతుంది.



- రెండు స్పూన్ల బియ్యప్పిండికి స్పూను తేనె, తగినన్ని పాలు కలిపి కడిగిన ముఖానికి రాయాలి. ఆరాక కొద్దికొద్దిగా తడిచేసుకుంటూ ముఖాన్ని రుద్ది కడిగేస్తే సరి. మృతకణాలు తొలగడంతోపాటు ఎండ వేడికి నల్లబడిన చర్మం తిరిగి కాంతులీనుతుంది.
- చల్లారిన గ్రీన్‌టీ రెండు స్పూన్లు, టేబుల్ స్పూను చొప్పున పాలు, కోకో పౌడర్ తీసుకుని బాగా కలపాలి. దీన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాలు ఉంచి కడిగేయాలి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మానికి పోషణనివ్వడంతోపాటు దద్దుర్లు, కమలడం వంటి వాటినీ దూరం చేస్తాయి. ❑

## మహా సరస్వతి

ఆధ్యాత్మికం

దేవీ నవరాత్రులలో మూలానక్షత్రం రోజున మహాసరస్వతీని అర్చించడం శాస్త్రీయ సంప్రదాయం. బ్రహ్మను గూర్చి తపస్సు చేసి వరాలను పొందిన శుంభనిశుంభులు ఇంద్రుడిని, దిక్పాలకులను పరాజితులను చేయడం, దేవతలు అమ్మవారిని శరణువేడడం, ఆదిశక్తి మహాసరస్వతిగా అవతరించి ఆ రాక్షసులను వధించడం దేవీ సప్తశతి ఉత్తర చరిత్రలో కనిపిస్తుంది. శుంభ నిశుంభులు రజస్తమోగుణాలకు, అహంకార మమకారాలకు ప్రతీకలు, అసురీభావాన్ని అణిచివేసే ప్రయోజ నానికై సత్వగుణ ప్రధానంగా మహా సరస్వతి అవతరించింది. అంతటా ఉన్నది ఒక్కటే. అదే అనేకంగా మారింది. ఏ ప్రయోజనాన్ని ఆశించి సాధకులు ధ్యాని స్తారో తదనుగుణమైన రూపంలో ఆది శక్తి అవతరిస్తుంది. ఇక్కడ శుంభని శుంభుల దౌర్జన్యాలను నిలువరించా ల్సి ంది గా దేవతలు ధ్యానించడం వల్ల అమ్మవారు మహా సరస్వతి రూపంలో దర్శనమిచ్చింది. ఇది దేవతల అందరి సమష్టి ఆశయం. అందుకే ఆమె సమష్టి దైవతత్వంగా చెప్పబడింది. ఈ సమష్టి తత్వాన్నే అపరాజితగా చెబుతారు. చంచలత, అభద్రతాభావన మనస్సు స్వభావం. వాటిని అహం కార మమ కారాలు ఆక్రమిం చాయి. బుద్ధి ప్రబోధనతో చాంచ ల్యాన్ని, రాక్షసత్వాన్ని అధిగమించడం సాధనాలక్ష్యం. ఆ లక్ష్యం వైపు నడిపిం చేది మహాసరస్వతీ ఉపాసన. ఆత్మావలోకం, చింతనాపరత, ధ్యానం వీటివల్ల అమ్మ సమగ్రతత్వాన్ని దర్శించడం సాధ్యపడుతుంది. భద్రలోకం నుండి భవ్యలోకం వరకు సాగే సాధకుని ప్రస్థానంలో మహాసరస్వతి ఆరాధన మంగళప్రదమైన ఆలోచనలను జాగృతం చేసి, బుద్ధిని ప్రచోదన చేస్తుంది. మహాసరస్వతి కృపాకటాక్షాలు పొందిన వారు ఋషులు, బ్రహ్మజ్ఞానులు అవుతారు అంటుంది మేధాసూక్తం. ❑



## చాడీలు ప్రోత్సహించొద్దు..

కొంతమంది పిల్లలు తోటి పిల్లలపై చాడీలు చెబుతారు. ఇంట్లో వాళ్లపైనా ఫిర్యాదులే. ఈ అలవాటు చిన్నప్పుడే దూరం చేయాలంటున్నారు మానసి క నిపుణులు. దీన్ని ఖండిచకపోతే అందరినీ విమర్శించడమే అలవరుచుకుం టారు.

**అక్క కొడుతోందంటూ..** తోబుట్టువులు తాము కోరిన బొమ్మలు ఇవ్వకపోతే తల్లికి ఫిర్యాదు చేస్తారు. మరికొందరు ఏకం అక్క కొడుతోందంటూ అబద్ధం చెబుతారు. అప్పుడే తల్లి తమను సమర్థిస్తుందని నమ్ముతారు. చిన్నవాడుకదా అంటూ..చాడీలు చెబుతున్న వారికి పెద్దవాళ్లు మద్దతిస్తే దాన్నే పిల్లలు కొనసాగిస్తారు. ఈ అలవాటును ప్రోత్సహించకుండా విషయాన్ని గుర్తించి, అబద్ధం చెప్పిన చిన్నారులకు అది తప్పు అని వివరించాలి. ఇద్దరూ కలిసి ఆడుకోవాలని చెప్పాలి. క్రమేపీ పిల్లలు తోబుట్టువులను ప్రేమిస్తారు.



**సమస్య ఉంటే..** పిల్లలు ఆడుకుంటున్నప్పుడు చిన్నచిన్న గొడవలొస్తుంటాయి. గోరంతది కొండంతగా మార్చి వాల్లు పెద్ద వాళ్లకు చెబుతుంటారు. దాన్ని పూర్తిగా ఆలకించాలి. లేదంటే తాము చెప్పింది వినడం లేదనే ఒత్తిడికి గురవుతారు. ముందుగా సమస్యను గుర్తించాలి. దాన్ని పరిష్కరించుకోవడం ఎలాగో నేర్పాలి. ఇది ఫిర్యాదులను తగ్గించుకోవడమే కాకుండా, పరిష్కరించుకోవడం కూడా నేర్పుతుంది.

**విమర్శ..** అమ్మానాన్నలు, చుట్టుపక్కల వారి నుంచి పిల్లలు ఫిర్యాదులు చెపపడం నేర్చుకుంటారు. ఇట్లో ప్రతి చిన్న విషయానికీ ఫిర్యాదులు చేసుకోవడం, లేదా బయటి వరిని నిత్యం విమర్శిస్తూ మాట్లాడుకోవడం వింటే, తామూ అలానే ప్రవర్తించడానికి ప్రయత్నిస్తారు. అందుకే పిల్లలెదుట పెద్దవాళ్ల ప్రవర్తన హుందాగా ఉండాలి. అప్పుడే చిన్నారులూ. మంచి వ్యక్తులుగా ఎదుగుతారు. ఎందుటి వారిని విమర్శనాత్మక దృష్టితో చూడకుండా సానుకూలంగా ఆలోచించడం నేర్పాలి. ❑

## కొలెస్ట్రాల్ అదుపులో..

పుట్ట గొడు గుల్లో కెలోరీలు, పిండి, కొవ్వు పదార్థాలు తక్కువ. ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇవి కొలెస్ట్రాల్ స్థాయులు అదుపులో ఉంచి గుండెని ఆరోగ్యంగా ఉంచు తాయి. బరువు తాగ్గాలనుకునే వారు వీటిని తినడం మంచిది.

- మష్రూమ్స్‌లో విటమిన్- సి అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని హాని కలిగించే ఫ్రీ రాడి కల్స్‌ను తొలగించడంలో సహాయపడు తుంది. వీటిని తినడం వల్ల మధుమేహం మచ్చే ముప్పు తక్కువగా ఉంటుంది.
- పొటాషియం, మెగ్నీయం ఖనిజాలు పుట్ట గొడుగు ల్లో ఎక్కువగా ఉం టాయి. ఇవి రక్తపోటును క్రమబద్ధీకరించి, ఎముకలు బలంగా మారడానికి ఉపయోగపడతాయి.
- ఇందులో సెలీ నియం సమృద్ధిగా ఉండడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది. అంతేకాకుండా ఇదిథైరాయిడ్ గ్రంథి పనితీరునూ మెరుగుపరుస్తుంది.
- పుట్టగొడుగుల్లోని కాపర్ ఎర్ర రక్తకణాలు పెరగడానికి తోడ్పడుతుంది. రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చూస్తుంది.





# భద్రం బికేర్‌ఫుల్‌బ్రదరూ!
## కోహ్లీకి రవిశాస్త్రి హెచ్చరిక

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్‌కోహ్లీకి మాజీ హెడ్‌కోచ్ రవిశాస్త్రి కీలక హెచ్చరికలుచేసాడు. మైదానంలో జాగ్రత్తగా ఉండాలని సూచించాడు. కెమేరాలన్నీ కోహ్లీచుట్టూనే ఉంటాయని, డ్రెస్సింగ్‌రూమ్‌కువెళ్లేవరకూ జాగ్రత్తగా నడుచుకోవాలన్నాడు. ఐపిఎల్ 2023సీజన్‌లోభాగంగా లక్నో సూపర్‌ఝెయింట్స్‌తోజరిగిన మ్యాచ్ అనంతరం కోహ్లీ గౌతమ్ గంభీర్‌ల వాగ్యుద్ధం వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఈసంఘటనపై కోహ్లీ, ధోనీఇలకు కొన్ని సూచనలు చేయాలనుకుంటున్నా, మహేంద్రసింగ్‌దోనీకి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆతను పక్కాప్రొఫెషనల్. ధోనీ ఎక్కడుంటే అక్కడ కెమేరాలు ఉంటాయన్న అంశం ఆతనికి బాగా తెలుసు. క్రికెట్ రంగానికి ఆతడుచేసిన సేవలకు దక్కిన గుర్తింపు అది. సచిన్‌టెండూల్కర్‌కూడా అంతే సచిన్ ఎక్కడుంటే కెమేరాలన్నీ అటువైపే తిరుగుతాయి. ఈ ఇద్దరిలాగే కోహ్లీకూడా ఈ విషయం గుర్తించాలి. ప్రతినిమిషం అప్రమత్తంగా ఉండాలని రవిశాస్త్రిసూచించాడు. మ్యాచ్ అయిపోయాకా కూడా కెమేరాలన్నీ తనవైపే ఉన్నాయన్నది గుర్తిస్తే చాలు. మన మాటలు చేతలు అదుపులో ఉంటాయి. కెమేరాలద్వారామనం జనాల మనసులు గెలుచుకోవచ్చు. ఎందరికో ఆదర్శంగా మారవచ్చని తెలిపాడు. అలాగే ఒక్కరోజులోనే విలన్‌గా కూడా మారవచ్చని కాబట్టి కోహ్లీ జాగ్రత్తపడితే బెటర్ అన్నాడు.

# ధోనీ వచ్చే ఐపిఎల్‌లో కూడా ఆడటం ఖాయం: సురేష్ రైనా

**చెన్నై:** చెన్నై సూపర్‌కింగ్స్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఈ ఏడాదే ఐపిఎల్‌కి రిటైర్మెంట్ ప్రకటిస్తాడని కొన్నిరోజులుగా అందుతున్న ఊహాగానాలపై ఆతనికి అత్యంత సన్నిహితుడు అయిన క్రికెటర్ సురేష్‌రైనా అసలు వాస్తవం బయటపెట్టాడు. ధోనీ వచ్చే ఏడాదికూడా ఐపిఎల్‌లో ఆడతాడని ధీమా వ్యక్తంచేసాడు. ఇటీవలే చెన్నైలోని చేపాక్‌స్టేడియంలో ముంబయి ఇండియన్స్‌తో మ్యాచ్ ఢీకొట్టింది. చెన్నై విజయం సాధించగా ఆ మ్యాచ్‌కి కామెంటేటర్‌గా రైనా వ్యవహరించాడు. ధోనీతోకలిసి చేపాక్ స్టేడియంలోరైనా మాట్లాడుతూ కనిపించాడు. ఆ టైమ్‌లో ధోనీ తన రిటైర్మెంట్‌గురించి చెప్పిన వ్యాఖ్యల్ని రైనా బహిర్గతంచేసాడు. ఐపిఎల్ టైటిల్ గెలిచిన తర్వాత మరో ఏడాదికూడా తాను ఐపిఎల్ ఆడతానని ధోనీ నాతో చెప్పాడు. ధోనీ మంచి ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్నాడు. అలాగే చెన్నై టీమ్ కాంబినేషన్‌కూడా బాగుంది. అన్నింటికీ మించి చాలామంది ఆటగాళ్లు ధోనీనుంచి చాలా అంశాలను నేర్చుకుంటున్నారని కానీ ఆతని శరీరం ఏమేరకు సహకరిస్తుందనేదానిపై ఐపిఎల్ భవిష్యత్తు ఉంటుందని, తాను ధోనీతో మాట్లాడిన తర్వాత అర్థమయింది ఏమిటంటే కచ్చితంగా మరో ఏడాది ఐపిఎల్‌లో ఆడతాడని రైనా తెలిపాడు. ఈసీజన్‌లో ఇప్పటివరకూ 11 మ్యాచ్‌లు ఆడిన చెన్నై జట్టు ఆరుమ్యాచ్‌ల్లో విజయం సాధించింది. నాలుగుమ్యాచ్‌ల్లో ఓటమి పాలుకాగా ఒక మ్యాచ్‌వర్షం కారణంగా ఫలితం రాలేదు. 13 పాయింట్లతో సిఎస్కే పాయింట్ల పట్టికలో రెండోస్థానంలో ఉంది. వచ్చే మ్యాచ్‌ను ఢిల్లీకేపిటల్స్‌తో బుధవారం చెన్నైలో ఆడుతుంది.






# గంభీర్ పెద్దమనసు వెల్లడించిన రాహుల్‌శర్మ

**న్యూఢిల్లీ:** ఆర్సీబీ కెప్టెన్‌తో జరిగిన ఘర్షణతో వార్తల్లోకెక్కిన లక్నోజట్టు మెంటార్ గౌతమ్‌గంభీర్ పెద్దమనసు కూడా ఇటీవల వార్తల్లోకి వచ్చింది. గౌతమ్ గంభీర్ తమ కుటుంబానికిచేసిన సాయాన్ని భారత మాజీ క్రికెటర్ రాహుల్‌శర్మ వెల్లడించాడు. గతనెల తనకు ఎంతోకష్టంగా గడిచిందని, మా అత్తకు బ్రెయిన్ హ్యామరేజి వచ్చిందని, తనపరిస్థితి విషమంగా మారిందని, కష్టకాలంలో గంభీర్ అన్న సాయం చేసాడని వెల్లడించాడు. తక్కువసమయంలోనే బెస్ట్ న్యూరాలజిస్ట్ ఆసుపత్రిని అందించారని, మా అత్తకు విజయవంతంగా సర్జరీ జరిగిందని ఆమె ఇపుడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని వివరించాడు. గౌతమ్ గంభీర్‌కు ఆయన పిఎ గౌరవ్ అరోరాకు ధన్యవాదాలని ఎంతోజాగ్రత్తగాచూసిన గంగారాం ఆసుపత్రికి వారిసిబ్బందికి ధన్యవాదాలని, శ్రద్ధతో చికిత్స అందించిన డాక్టర్ మనీష్ చుగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలని రాహుల్‌శర్మ వెల్లడించాడు. తనభార్య అత్తతోకలిసి దిగినఫోటోలను కూడా తన పోస్టులో షేర్‌చేసాడు.

# ప్లే ఆఫ్స్ రేసుకోసం పోటాపోటీ
## నేడు చేపాక్‌లో సిఎస్కే వర్సెస్ ఢిల్లీకేపిటల్స్



**చెన్నై:** ఐపిఎల్ 2023 సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరువగా ఉన్న చెన్నై సూపర్‌కింగ్స్ మరో ఆసక్తికరపోరుకు సిద్ధం అవుతోంది. ఢిల్లీకేపిట ల్స్‌తో బుధవారం చెన్నై చేపాక్‌లో జరిగే మ్యాచ్‌లో ధోనీ సేన గట్టిపో టీ ఇచ్చేందుకు సిద్ధం అవుతోంది. వరుసగా రెండు ఓటముల తర్వాత ముంబయి ఇండియన్స్‌పై మంచి విజయం సాధించిన చెన్నై ఆరువిజయాలతో పాయింట్స్ టేబుల్‌లో రెండోస్థానంలో ఉంది. ప్లే ఆఫ్స్ చేరాలంటే చెన్నై చివరిమూడు మ్యాచ్‌ల్లోరెండింటిలో గెలవాలి. ఈనేప థ్యంలోనే ఢిల్లీకేపిటల్స్‌ను ఎలాగైనా ఓడించాలని ఆజట్టు భావిస్తోంది.
మరోవైపు వరుస పరాజయాల తర్వాత పుంజుకున్న ఢిల్లీ నాలుగు విజయాలతో పాయింట్స్ టేబుల్‌లో చివరిస్థానంలో నిలిచింది. ప్లే ఆఫ్స్‌రేసులో నిలవాలంటే ఆ జట్టుప్రతిమ్యాచ్ గెలవాల్సిందే. ఈమ్యా చ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అలాగే సిఎస్కే జట్టు కాంబినేషన్‌పైనా చర్చ సాగుతోంది. మోకాలి గాయంతో జట్టుకు దూరం అయిన బెన్ స్టోక్స్ ఫిట్ అయ్యాడని అంచనా. స్టోక్స్ నెట్‌ప్రాక్టీస్ సెషన్‌కు సంబం ధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే బెన్‌స్టోక్స్ జట్టులోకి తీసుకుంటే ఎవరిని పక్కనపెట్టాలనేది సిఎస్కేకు తలనొప్పిగా మారింది. బ్యాటింగ్‌కోచ్ మైక్ హస్సీకూడా ఇదేభావనతో ఉన్నాడు. బెన్‌స్టోక్స్ ఫిట్ అయినా ఆతడు బెంచ్‌కే పరిమితం అయ్యే ఛాన్స్ ఎక్కువ ఉంది.
తుదిజట్టులో ఆడుతున్న మోయిన్ ఆలీ, మతీష పతిరణ, మహేశ్ తీక్షణ, మిచెల్‌శాంట్నర్‌లు అద్భుతంగా రాణిస్తుండ టంతో బెన్‌స్టోక్స్‌ను జట్టులోకి తీసుకునే ఛాన్స్‌లేదు. అలాగే ఈమ్యాచ్ లో అదనపు స్పిన్నర్‌తో బరిలోకి దిగుతోంది. సూపర్‌ఫామ్‌లో ఉన్న బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎలాంట ఇమార్పులు ఉండే అవకాశం లేదు. ఇంపాక్ట్‌ప్లేయర్‌గా అంబటిరాయుడు, తుషార్‌దేశ్‌పాండేలు ఉన్నారు. ముందుగా బౌలింగ్‌చేస్తే తుషార్‌దేశ్‌పాండే, బ్యాటింగ్‌చేస్తే అంబటి రాయుడు బరిలోకి వస్తారు. తుదిజట్టుపరంగా దేవాన్ కాన్వే, రుతురాజ్‌గైక్వాడ్, అజింక్యా రహానె, అంబటిరాయుడు, శివమ్‌దూబే, మొయిన్ ఆలీ, రవీంద్రజడేజా, మహేంద్రసింగ్‌ధోనీ, దీపక్‌చాహార్, మహీశ్‌తీక్షణ, మహీశ్‌పతిరణలుంటారు. ఇంపాక్ట్‌ప్లేయర్‌గా తుషార్‌దేశ్ పాండే ఉంటాడని అంచనా.

# స్టార్‌పేసర్ జోఫ్రా ఆర్చర్ స్వదేశానికి పయనం



**ముంబయి:** ఐపిఎల్‌సీజన్‌లో ముంబయి ఇండియన్స్‌కు గట్టిషాక్ తగిలింది. ఆజట్టు స్టార్‌పేసర్ జోఫ్రా ఆర్చర్ ఐపిఎల్ 16 సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరం అయ్యాడు. ఆర్చర్ ఇంకా పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో స్వదేశానికి తిరుగుముఖం పట్టాడు. ఆతడి స్థానంలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ క్రిస్ జోర్డాన్‌ను జట్టులోకి తీసుకుంటున్నట్లు ముంబయి ఇండియన్స్ ట్విట్టర్‌ద్వారా వెల్లడించింది. క్రిస్ జోర్డాన్‌తో ముంబయి రెండుకోట్లకు ఒప్పందం చేసుకుంది. అయితే ఈసీజన్‌లో ఆర్చరన ఆశించినమేకు రాణించలేకపోయాడు. ఐదు మ్యాచ్‌లు ఆడి 9.50 ఎకానమీతో రెండు వికెట్లు మాత్రమే తీసాడు. 2016లో ఐపిఎల్ అరంగేట్రంచేసిన క్రిస్ జోర్డాన్ వివిధ సీజన్లలో ఆర్సీబీ సన్‌రైజర్స్ హైదరాబాద్, పంజాబ్‌కింగ్స్, చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల తరపున ఆడాడు. మొత్తం 28 మ్యాచ్‌లు ఆడి 9.32 ఎకానమితో 27 వికెట్లుతీసాడు. ముంబయి ఇండియన్స్‌పరంగా ఈసీజన్‌లో ఇప్పటివరకూ 10 మ్యాచ్‌లు ఆడ ఐదు విజయాలు ఐదు ఓటములతో పాయింట్లపట్టికలో ఎనిమిదోస్థానంలో ఉంది.


# భారత్ స్టాక్ మార్కెట్లలోకి రష్యా ఇన్వెస్టర్లు

**న్యూఢిల్లీ, మే 9:** ఉక్రెయిన్‌పై దాడి అనంతరం రష్యాపై అమెరికా, ఐరోపాలు ఆంక్షలు విధించడంతో, రష్యా ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు భారత స్టాక్ మార్కెట్ల వైపు అడుగులు వేస్తున్నారు. రష్యాకు చెందిన రెండు సంస్థలు సెబి నుంచి 3 విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పిఐ) లైసెన్సులు పొందడం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఎఫ్‌పిఐలుగా సెబి వద్ద నమోదైన ఈ సంస్థలు మాస్కో కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఆల్ఫా కేపిటల్ మేనేజ్‌మెంట్ కంపెనీ కేటగిరి-1, కేటగిరి-2 విభాగాల్లో, సెవోలాడ్ రోజనోవ్ కేటగిరి-1 విభాగంలో నమోదైనట్లు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీస్ వద్ద లభ్యమవుతున్న గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. పైగా వీటికి జారీచేసిన లైసెన్సులు మూడేళ్లపాటు అంటే 2026 ప్రారంభం వరకు చెల్లుబాటు కానున్నాయి. కాగా భారత్‌లో పెట్టుబడుల కోసం రష్యా ఇన్వెస్టర్లు ఎఫ్‌పిఐ మార్గాన్ని ఎంచుకోవడం ఇదే మొదటిసారి. సాధారణంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మార్గానికే వీళ్లు ప్రాధాన్యమిస్తుంటారు. పెట్టుబడులు పెట్టేందుకు భారత మార్కెట్ల వైపు రష్యా ఇన్వెస్టర్లు దృష్టిసారిస్తుండడం, కొత్త ఆర్థిక పరిణామాలకు దారి చూపొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. డాలరుకు ప్రత్యామ్నాయ కరెన్సీపై విస్తృతంగా చర్చ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో రష్యా ఇన్వెస్టర్లు, సంస్థలు భారత కేపిటల్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టేందుకు యోచన చేస్తుండడాన్ని కూడా అదే కోణంలో చూడాల్సి ఉంటుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ముఖ్య పెట్టుబడుల వ్యూహకర్త వి.కె.విజయకుమార్ చెబుతున్నారు. పెట్టుబడుల పరంగా భౌగోళిక వైవిధ్యం ఉండడం కూడా భారత్‌కు మంచిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే అదానీ షేర్లలో ఎఫ్‌పిఐలు పెట్టుబడుల వ్యవహారం తీవ్ర వివాదాస్పదం అయిన నేపథ్యంలో వెల్లడి నిబంధనలను సెబి మరింత కఠినం చేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.



# బెంగళూరులో ఫాక్స్‌కాన్ స్థల సేకరణ

**బెంగళూరు, మే 9:** తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్ బెంగళూరు శివారులో పెద్ద మొత్తంలో స్థలాన్ని కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని కంపెనీ లండన్ స్టాక్ ఎక్స్చేంజీకి తెలియచేసింది. చైనా వెలుపలకు తయారీ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఫాక్స్‌కాన్ భారత్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం విదితమే. ఆపిల్ ఐఫోన్ల అసెంబ్లింగ్‌ను చేపడుతన్న ప్రధాన కంపెనీల్లో ఫాక్స్‌కాన్ ఒకటి. ప్రస్తుతం ఈ కంపెనీ కార్యకలాపాలు చైనాలో కేంద్రీకృతమై ఉన్నాయి. కానీ అక్కడ తలెత్తిన వివిధ సమస్యల వల్ల తయారీని ఇతర దేశాలకు విస్తరిస్తోంది. భారత్‌లో వ్యాపార విస్తరణకు అపార అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్న ఆపిల్ కూడా ఇక్కడి మార్కెట్‌పై దృష్టిసారించింది. బెంగళూరు ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న దేవణహళ్లి ప్రాంతంలో 1.2 మిలియన్ చదరపు మీటర్ల స్థలాన్ని ఫాక్స్‌కాన్ కొనుగోలు చేసింది. దీని కోసం అనుబంధ సంస్థ ఫాక్స్‌కాన్ హాన్ హాయ్ టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ దాదాపు రూ.300 కోట్లు చెల్లించినట్లు తెలిసింది. మరోవైపు వియత్నాంలోనూ ఫాక్స్‌కాన్ 4,80,000 చదరపు మీటర్ల స్థలం కొనుగోలు చేసింది. త్వరలోనే రాష్ట్రంలో కొత్త తయారీ కేంద్రంలో ఆపిల్ తమ ఐఫోన్లను తయారు చేయనుందని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై మార్చిలో ప్రకటించిన విషయం విదితమే.



# హెచ్‌ఎస్‌బిసి బ్యాంకుపై ఆర్‌బిఐ భారీ జరిమానా..

**న్యూఢిల్లీ, మే 9:** నిబంధనలు పాటించని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా కొరడా ఝుళిపిస్తూ ఉంటుంది. ఇటీవల కొన్నింటిపై అపరాధ రుసుము విధించగా, మరికొన్నింటి లైసెన్సులు రద్దుచేసింది. తాజాగా హెచ్‌ఎస్‌బిసికి కేంద్ర బ్యాంకు వాత పెట్టింది. ఈ మేరకు భారీగా ఫైన్ కట్టాలని ఆదేశించింది. భారతీయ నిబంధనలను పాటించనందుకు హెచ్‌ఎస్‌బిసిపై రూ.1.73 కోట్ల జరిమానా విధించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. సేవల్లో లోపాలపై ఆధారపడి ఈ చర్య తీసుకున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. మార్చి 31, 2021 నాటికి ఆ బ్యాంకు ఆర్థిక స్థితి, రిస్క్ అసెస్‌మెంట్ రిపోర్ట్ తయారు చేసేందుకు జరిపినప్పుడు దీనిని గుర్తించినట్లు పేర్కొంది. బకాయిలు లేని వివిధ క్రెడిట్ కార్డులకు సంబంధించి మొత్తం నాలుగు క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలకు హెచ్‌ఎస్‌బిసి తప్పుడు సమాచారం అందించినట్లు ఆర్‌బిఐ గుర్తించింది. తద్వారా రిజర్వ్ బ్యాంకు నిబంధనలను అతిక్రమించినందుకు ఈ బ్యాంకుపై చర్యలకు ఉపక్రమించింది. దీని గురించి లోతైన దర్యాప్తు కోసం బ్యాంకుకు నోటీసు కూడా ఇచ్చినట్లు ఆర్‌బిఐ తెలిపింది. సిఐసి నిబంధనలు ఉల్లంఘించినందుకు ఎందుకు జరిమానా విధించకూడదో కారణం చెప్పాలని హెచ్‌ఎస్‌బిసికి ఆర్‌బిఐ నోటీసులు పంపింది. అందుకు అది ఇచ్చిన సమాచారం, వ్యక్తిగత విచారణ సమయంలోని మౌఖిక సమర్పణలను పరిగణలోని తీసుకున్న తర్వాత, నగదు పెనాల్టీ విధించాలని నిర్ధారణకు వచ్చింది.



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ముంబై, మే 9:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిసాయి. ఉదయం లాభాలతో ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నానికి ఇంట్రాడే గరిష్టాలకు చేరాయి. తర్వాత అమ్మకాల ఒత్తిడితో నష్టాల్లోకి మళ్లాయి. మరోవైపు ఐటిసి, ఎస్‌బిఐ, బజాజ్ ఫైనాన్స్ వంటి దిగ్గజ షేర్లు నష్టపోవడం కూడా మార్కెట్లను కలవరపెట్టింది. చివరికి సెన్సెక్స 2.92 పాయింట్ల స్వల్ప నష్టంతో 61,761.33 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 1.55 పాయింట్ల స్వల్ప లాభంతో 18,265.95 పాయింట్ల వద్ద నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, టిసిఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఏసియన్ పెయింట్స్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌డిఎఫ్‌సి వంటి షేర్లు అత్యధికంగా పుంజుకున్నాయి. ఐటిసి, ఎస్‌బిఐ, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌టిపిసి, పవర్‌గ్రిడ్‌కార్పొరేషన్, ఐసిఐసిఐబ్యాంకు, సన్ ఫార్మా, కోటాక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. భవిష్యత్తు వృద్ధిపై మెరుగైన అంచనాల నేపథ్యంలో జిందాల్ పాలీ ఫిల్మ్స్ లిమిటెడ్ షేరు ఇంట్రాడేలో రూ.740 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరింది. చివరికి 9.63 శాతం పెరిగి రూ.696.75 వద్ద నిలిచిందిద. గణేశ్ హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు ఒక్కో షేరుపై రూ.2.40 డివిడెండ్‌ను ప్రకటించింది. దీంతో ఇంట్రాడేలో కంపెనీ షేరు 8శాతం వరకు పెరిగింది. చివరికి ఎన్‌ఎస్‌ఇలో 4.41 శాతం పెరిగి రూ.362.00 వద్ద నిలిచింది.

# లింక్డ్ఇన్ 716 మంది తొలగింపు

**ముంబై, మే 9:** అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితులు చాలా డైనమిక్‌గా మారాయి. మైక్రోసాఫ్ట్ యాజమాన్యంలోని జాబ్స్ సెర్చ్ యాప్ లింక్డ్ఇన్ తాజాగా ఉద్యోగుల తొలగింపును ప్రకటించింది. జాబ్ సెర్చ్ దిగ్గజం లింక్డ్ఇన్ దాదాపు 716 మంది ఉద్యోగులను తగ్గించాలని నిర్ణయించింది. ఇదేసమయంలో అమెరికాకంపెనీ చైనా-ఫోకస్డ్ జాబ్ అప్లికేషన్‌ను మూసివేయడానికి సిద్ధమైంది. బలహీనపడుతున్న ప్రపంచ ఆర్థిక దృక్పథం, డిమాండ్ తగ్గుదల మధ్య తాజా నిర్ణయం వెలువడింది. లింక్డ్ఇన్‌లో దాదాపు 20వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గతసంవత్సరం ప్రతి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం పెరిగినప్పటికీ, దాని మాతృసంస్థ మైక్రోసాఫ్ట్‌తో సహా కార్మికులను తొలగించడంలో ప్రధాన సాంకేతిక సంస్థల హోస్ట్‌లోచేరింది. ఇది దాదాపు 3.5 శాతం ఉద్యోగాల కోతలకు దారి తీసింది. కార్యక్రమాలను క్రమబద్ధీకరించడంతో పాటు నిర్ణయాలు వేగవంతం చేసేందుకు తగిన రూట్ ఏర్పాటు చేస్తామని సిఇఒ ర్యాన్ రోస్లాన్స్కీ ఉద్యోగులకు లేఖ ద్వారా తెలిపారు.

# వాణిజ్యం

# గో ఫస్ట్‌పై కేంద్ర మంత్రి క్లారిటీ..

**ముంబై, మే 9:** డబ్బు కొరతతో నేలకొరిగిన గోఫస్ట్ విహంగాలను తిరిగి గాల్లోకి తీసుకొచ్చేందుకు వాడియా గ్రూప్ ప్రయత్నాలను కొనసాగిస్తోంది. ప్రభుత్వం నుంచి ఏ చిన్న సాయం అందినా తాము తిరిగి సేవలను పునరుద్ధిస్తామని కంపెనీ సిఇఒ ఇటీవల ధీమాగా తెలిపారు. అయితే ఎయిర్‌లైన్ ఆశలు అడియాశలుగా మారే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈవ్యవహారంపై కేంద్ర సహాయమంత్రి వికె సింగ్ తాజాగా స్పందించారు. అమెరికాకు చెందిన ప్రాట్ అండ్ విట్నీతో ఇంజిన్‌ల సరఫరా సమస్యను పరిష్కరించే వరకు నగదు కొరతతో ఉన్న గోఫస్ట్ ఎయిర్ లైన్స్‌కు ప్రభుత్వం బెయిలౌట్ చేసే అవకాశం లేదని వెల్లడించారు. నగదు కొరతతో విమాన సేవలను అకస్మాత్తుగా రద్దు చేస్తున్నట్లు కంపెనీ గతవారం ప్రకటిస్తూ స్వచ్ఛందంగా దివాలా కోసం ఎయిర్‌లైన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. కంపెనీ ఎదుర్కొంటున్న తాజా పరిస్థితులకు ఇంజిన్-మేకర్ ప్రాట్ అండ్ విట్నీని నిందించింది. లోపభూయిష్ట ఇంజిన్‌ల కారణంగా 54 ఎయిర్‌బస్ ఎ320 నోయిస్ విమానాల్లో 50శాతం గ్రౌండింగ్ అయ్యాయని గో ఫస్ట్ ఆరోపించింది. ఈ సంక్షోభ సమయంలో విమానాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు లీజర్లు కోర్టును ఆశ్రయించినందున ఎయిర్‌లైన్ దివాలా పిటిషన్‌పై ఉత్తర్వులు జారీచేయాలని గో ఫస్ట్ లాయర్లు ట్రిబ్యునల్‌కు తెలిపారు. ఈ వివాదం కొనసాగుతుండగా విమాన టిక్కెట్ల విక్రయాన్ని కంపెనీ వెంటనే నిలిపివేయాలని డిజిసిఎ కంపెనీకి నోటీసులు జారీచేసింది. అయితే గోఫస్ట్ విమానాలను త్వరగా తిరిగి ప్రారంభించలేక పోతే కంపెనీ తన స్లాట్లను కోల్పోవచ్చని తెలుస్తోంది.



# మ్యాన్‌కైండ్ ఐపిఒ భేష్..

**ముంబై, మే 9:** చాలా కాలంగా మార్కెట్లలో మంచి ఐపిఒ కోసం ఎదురు చూసిన ఇన్వెస్టర్లకు మంచి కాలం వచ్చింది. ప్రఖ్యాత దేశీయఫార్మా సంస్థ మ్యాన్ కైండ్ ఐపిఒ మంగళవారం స్టాక్‌మార్కెట్లోకి అడుగు పెట్టింది. మ్యాన్ కైండ్ ఫార్మా ఐపిఒలో షేర్లు పొందిన ఇన్వెస్టర్లు మంచి రాబడులను పొందారు. ఈ స్టాక్ బిఎస్‌ఇలో రూ.1300 వద్ద లిస్ట్ అయింది. అంటే షేర్లు మార్కెట్లో దాదాపు 20శాతం ప్రీమియం ధరకు ట్రేడింగ్ ప్రారంభించాయి. మధ్యాహ్నం సమయంలో స్టాక్ ధర రూ.1,375 వద్ద ఉంది. అలాగే ఇంట్రాడేలో గరిష్ఠ ధర రూ.1,414కు చేరింది. ఐపిఒ ప్రైస్ బ్యాంక్ గమనిస్తే ఒక్కో షేరు ధర రూ.1,026 నుంచి రూ.1,080గా ఉంది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఒక్కో షేరుపై ఐపిఒలో స్టాక్స్ పొందిన ఇన్వెస్టర్లు రూ.295 లాభం పొందారు. దీనికి ముందు 2020లో గ్లాండ్ ఫార్మా కంపెనీ రూ.6,480 కోట్ల ఐపిఒ ఫ్లోట్ చేయగా, ఆ తర్వాత ఫార్మా రంగంలో వస్తున్న అతిపెద్ద ఐపిఒగా మ్యాన్ కౌండ్ నిలిచింది. ముఖ్యంగా అర్హత కలిగిన సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి బలమైన ప్రతిస్పందన లభించడంతో ఐపిఒ విజయవంతం అయింది. దాదాపు 50 రెట్లు అధికంగా బిడ్డింగ్ జరిగింది. తాజా ఐపిఒ ద్వారా కంపెనీ రూ.4,326 కోట్లను సమీకరించింది. ఈ ఐపిఒలో సిపిపిఐబి, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, గోల్డ్‌మన్ శాచ్స్, ఫిడిలిటీ, బ్లాక్‌రాక్, జిఐఎస్, నోమురా వంటి 16 మ్యూచువల్ ఫండ్స్ స్కీమ్స్ ఫార్మా ఐపిఒలో ఆసక్తిని కనబరిచాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.